
రైల్వే రిజర్వేషన్‌కు ఆధార్ లింక్



మొదటి 15 నిమిషాలు ఆధార్ వెరిఫైడ్ యూజర్లకే సాధారణ రిజర్వేషన్ అవకాశం!

వచ్చే నెల 1 నుంచి కొత్త నిబంధన ||

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA



ఐటీఆర్ ఫైలింగ్ గడువు పెంపు › 12

ఒక్కరోజు పెంచిన సీబీడీటీ

మంగళవారం TUESDAY 16.9.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 15 || సంచిక (Issue): 102 || వెల (Price) రూ.6.50 | దశమి

మంగళవారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-17. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: దశమి రాత్రి 12-22 వరకు. నక్షత్రం: ఆరుద్ర ఉదయం 6-46 వరకు, తదుపరి పునర్వసు. వర్జ్యం: సాయంత్రం 6-34 నుంచి రాత్రి 8-09 వరకు. రాహుకాలం: పగలు 3-13 నుంచి సాయంత్రం 4-45 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-31 నుంచి ఉదయం 9-20 వరకు, పునర్ దుర్ముహూర్తం రాత్రి 10-59 నుంచి రాత్రి 11-47 వరకు. అమృతకాలం: తెల్లవారుజామున 4-03 నుంచి తెల్లవారుజామున 5-38 వరకు. రవి కన్యా సంక్రమణం రాత్రి 1-47 గంటలకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



ఆర్థిక ఇబ్బందులతో హోంగార్డు ఆత్మహత్య

కూతురి పెండ్లి చేయడంతో అప్పులపాలు.. కరీంనగర్ జిల్లాలో విషాదం

› 8



అప్పుల బాధతో ఆటో డ్రైవర్ బలవన్మరణం

జనగామ జిల్లా వీఎస్‌ఆర్ నగర్‌లో విషాదం

› 8

ఇది జనం మాట

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో

విజయం గులాబీదే


42.8% ప్రజల మద్దతుతో ముందంజలో బీఆర్‌ఎస్

కాంగ్రెస్ కంటే బీఆర్‌ఎస్‌కు 10.1 శాతం ఎక్కువ ఓట్లు

మళ్లీ కేసీఆరే సీఎం కావాలన్న 46 శాతం మంది ఓటర్లు

'కోడ్‌మో-కనెక్టింగ్ డెమోక్రసీ' నిర్వహించిన సర్వేలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): గులాబీ పార్టీకి కంచుకోట జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ విజయదుందుభి మోగించనున్నదా? పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వంలోని అభివృద్ధితోపాటు రెండేండ్ల కాంగ్రెస్ పాలనా వైఫల్యాలకు అద్దం పట్టే రీతిలో జూబ్లీహిల్స్ ఓటరు తీర్పు ఇవ్వనున్నారా? అవును.. అక్షరాల నిజం అంటున్నది 'కోడ్‌మో-కనెక్టింగ్ డెమోక్రసీ' అనే సంస్థ నిర్వహించిన సర్వే. అధికార కాంగ్రెస్ కంటే ఏకంగా 10.1 శాతం ఎక్కువ ఓట్లతో బీఆర్‌ఎస్ విజయకేతనం ఎగురవేయనుందని ఆ సర్వే వెల్లడించింది. హైదరాబాద్ నగరంలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల రాజకీయం ఆసక్తి రేపుతున్న దరిమిలా కోడ్‌మో సంస్థ ఇటీవల జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో శాస్త్రీయంగా సర్వేను చేపట్టింది. ఇందులో బీఆర్‌ఎస్ 42.8 శాతం ఓట్లతో ముందంజలో నిలువగా.. హస్తం, కమలం పార్టీలు రెండు, మూడుస్థానాలకు పరిమితమయ్యాయి. ప్రధానంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటరు నాడి ఎలా ఉన్నదో తెలుసుకోవడమే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన ఈ సర్వేలో భాగంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఎవరు కావాలనుకుంటున్నారనే అంశాన్ని కూడా పొందుపరిచారు. ఈ క్రమంలో ఏకంగా 46.5 శాతం మంది ఓటర్లు మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి కావాలని తమ అభీష్టాన్ని కుండబద్ధలు కొట్టినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మొదలు గులాబీ పార్టీకి కంచుకోటలా నిలుస్తున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హ్యాట్రిక్ విజయాలు సాధించారు. దురదృష్టవశాత్తు ఆయన అనారోగ్యంతో మరణించడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలో కోడ్‌మో సంస్థ ఇటీవల నియోజకవర్గంలో సర్వే నిర్వహించింది. గతంలో కాంగ్రెస్ రాజస్థాన్, మహారాష్ట్ర వంటి › 2వ పేజీలో



పథకాలకు పాతర..

చెప్పుల జాతర!

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం



అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసం పథకాల జాతరకు తెరలేపిన కాంగ్రెస్ ఇప్పుడు పల్లె పల్లెనా చెప్పుల జాతరను తెరపైకి తెచ్చింది. యూరియా కోసం అన్నదాతలు క్యూలలో పడిగాపులు పడుతుంటే రేవంత్ సర్కారు నిద్రమత్తులో మునిగితేలుతున్నది.

-కేటీఆర్

- 6 గ్యారెంటీలకు రేవంత్ ఎగనామం
- తెలంగాణ ప్రజలకు పంగనామం
- పింఛన్ పెంపు ఊసు లేనే లేదు.. తులం బంగారం మాటే లేదు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- రేవంత్ పాలనపై కేటీఆర్ ఆగ్రహం
- తెలంగాణ భవన్‌లో వెంగళరావునగర్ బూత్‌కమిటీల సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పాతరేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఊరూరా చెప్పుల జాతరకు తెరలేపిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. 22 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు పంగనామాలు పెట్టడం తప్ప చేసిందేమీ లేదని విరుచుకుపడ్డారు. రైతులకు యూరియా పంపిణీలో విఫలమైన ప్రభుత్వం, నిధుల్లేవనే సాకుతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు పొడుస్తున్నదని విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని వెంగళరావునగర్ డివిజన్ బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో › 2వ పేజీలో

ఆ ఎమ్మెల్యేలు దొరికిన దొంగలు

ఇక్కడ బయటపడ్డా కోర్టు ముందు తప్పించుకోలేరు

ఆ పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు ఖాయం

స్పీకర్ ఇచ్చిన గడువులోగా రిజాయిండర్లు ఇచ్చినం

కోర్టు ఇచ్చిన గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): కారు గుర్తుపై గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న పది మంది ఎమ్మెల్యేలు ఎన్నిచేసినా తప్పించుకోలేరని, ప్రజల దృష్టిలో వారంతా దొరికిపోయిన దొంగలు అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి విమర్శించారు. 'రేవంత్‌రెడ్డి మూటలతో దొరికి తప్పించుకున్నరు.. మేము తప్పించుకోలేమా? అని పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనుకుంటున్నరు. ఇక్కడ తప్పించుకున్నా కోర్టు ముందు వీరు తప్పించుకోలేరు. వీరి నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయం. వారికి రాజకీయ భవిష్యత్తు లేకుండా ప్రజలు తీర్పు చెప్పడం ఖాయం' అని హెచ్చరించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, తెల్లం వెంకట్రావ్, గూడెం మహిపాల్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ స్పీకర్‌కు ఇచ్చిన సమాధానాలపై అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ ఉపేందర్‌రెడ్డికి సోమవారం బీఆర్‌ఎస్ తరపున పార్టీ ఎమ్మెల్యేలు జీ జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, › 8వ పేజీలో

బండి సంజయ్‌పై కేటీఆర్ పరువు నష్టం దావా

- అనుచిత వ్యాఖ్యలు ప్రసారం చేసిన మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ వేదికలపై కూడా..
- విచారణకు స్వీకరించిన కోర్టు.. కేంద్రమంత్రికి నోటీసు
- డిసెంబర్ 15న విచారణకు హాజరుకావాలని ఆదేశం

› 2

108 అంబులెన్సుల్లో భారీ స్కామ్!

శాలరీలు, మెయింటెనెన్స్ కలిపి ప్రతి నెలా 7.5 కోట్ల గోల్‌మాల్



› 11

- ఉద్దేశపూర్వకంగా వాహనాలు బ్రేక్‌డౌన్
- ఉద్యోగులకు 15-20 రోజులే డ్యూటీ
- మిగిలిన రోజులకు జీతాలు ఎగవేత
- ఇదేమిటని ప్రశ్నిస్తే.. 'రిలీవర్ ఉన్నారు ఆఫ్ తీసుకోవాల్సిందే' అంటూ హుకుం
- మెయింటెనెన్స్ డబ్బుల్లోనూ గోల్‌మాల్
- శాలరీ, మెయింటెనెన్స్ కోసం ఒక్కో వాహనానికి ప్రభుత్వం 2 లక్షలు చెల్లింపు
- అందులో రూ.లక్ష అధికారుల జేబుల్లోకి!
- అన్ని స్థాయిల అధికారులకు వాటాలు
- మంత్రి కూతురి కనుసన్నల్లోనే వ్యవహారం!

వంతారాపై గౌరవనీయ సుప్రీం కోర్టు చదివిన సిట్ నివేదికలోని ముఖ్యాంశాలు

- ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదిక ఆధారంగా వంతారాపై వచ్చిన అన్ని ఆరోపణలను సుప్రీంకోర్టు ఈరోజు విచారించి నిర్ణయించినది
- **సుప్రీంకోర్టు:** "మేము నివేదిక యొక్క సారాంశాన్ని పరిశీలించాము. నియంత్రణ సమ్మతిలో పాండిత్యాన్ని గమనించినది. వాటాదారులు కూడా అభిప్రాయాలను అందించారని గమనించింది. నియంత్రణ సమ్మతి మొదలైన వాటిపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. మేము ఉత్తర్వులో భాగంగా నివేదిక చేస్తాము."
- **సుప్రీంకోర్టు:** "ఇప్పుడు నిపుణుల సహాయం పొందిన స్వతంత్ర కమిటీ నివేదిక మన దగ్గర ఉంది. ఇప్పుడు అందరూ సిఫార్సుల ప్రకారం చర్యలు తీసుకోవడానికి స్వేచ్ఛ కలదు. ఇప్పుడు మేము ఎవరినీ మళ్లీ మళ్లీ ప్రశ్నలు లేవనెత్తడానికి అనుమతించము. మేము 10 ప్రశ్నలు ఇచ్చాము, వాటికి కమిటీ కూడా సమాధానం ఇచ్చింది."
- సుప్రీంకోర్టు కూడా 'కమిటీ అన్ని అంశాలను వివరంగా పరిష్కరించింది' అని ప్రస్తావించింది.
- వంతారాను ప్రస్తావిస్తూ, సుప్రీంకోర్టు ఇలా వ్యాఖ్యానించింది, "మన దేశానికి గర్వకారణమైన కొన్ని విషయాలు ఉన్నాయి. మనం ఈ సమస్యలను లేవనెత్తలేము మరియు గందరగోళాన్ని సృష్టించలేము. దేశంలో కూడా కొన్ని మంచి విషయాలు జరగనివ్వండి. ఈ మంచి విషయాలన్నింటికీ మనం సంతోషంగా ఉండాలి."
- సుప్రీంకోర్టు, "ఏనుగులను స్వాధీనం చేసుకోవడం చట్టం ప్రకారం జరిగితే సమస్య ఏమిటి. అన్ని నిబంధనలను అనుసరించి దాన్ని పొందినట్లయితే.. సమస్య ఏమిటి. మీరు ఇలాంటి కొన్ని సాధారణ స్టేట్‌మెంట్లను జారీ చేయలేరు."
- వంతారా (గ్రీన్స్ జూలాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ & రాధే కృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్)లో అన్యాయాలు మరియు అక్రమాలు జరిగాయని ఆరోపించిన రెండు రిట్ పిటిషన్లు.
- అంతకుముందు (25.08.2025), కోర్టు ఎటువంటి ప్రోబేటివ్ మెటీరియల్‌ను కనుగొనలేదు కానీ, తీవ్రత దృష్ట్యా, నిజనిర్ధారణ విచారణ నిర్వహించడానికి రిటైర్డ్ న్యాయమూర్తులు మరియు సీనియర్ అధికారుల నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (SIT) ఏర్పాటు చేసింది.





కీలకాంశాలు

1 చట్టపరమైన ఉల్లంఘనలు లేవు: వన్యప్రాణుల (సంరక్షణ) చట్టం, 1972, జూ నియమాలు, CZA మార్గదర్శకాలు, కస్టమ్స్ చట్టం, FEMA, PMLA లేదా CITES ఉల్లంఘన కనుగొనబడలేదు. అన్ని సేకరణలు మరియు దిగుమతులు సక్రమంగా అనుమతించబడ్డాయి మరియు నమోదు చేయబడ్డాయి.

2 జంతు సంక్షేమం & సౌకర్యాలు: వంతారా సౌకర్యాలు సంక్షేమం, పెంపకం మరియు పశు వైద్య సంరక్షణ యొక్క నిర్దేశించిన ప్రమాణాలను మించిపోయాయి. మరణాల రేట్లు ప్రపంచ జంతుశాస్త్ర సగటులతో ఏవరేజ్ చేయబడ్డాయి. "అప్రూవల్ యొక్క గ్లోబల్ హ్యూమన్ సర్టిఫైడ్ ముద్ర"తో గ్లోబల్ హ్యూమన్ సొసైటీ ద్వారా ధృవీకరించబడింది.

3 ఆర్థిక ఆరోపణలు: కార్బన్ క్రెడిట్స్, నీరు లేదా మనీలాండరింగ్ దుర్వినియోగం వంటి వాదనలు నిరాధారమైనవిగా గుర్తించబడినవి. నిధుల అక్రమ ఫ్లోస్ లేదా స్మగ్లింగ్ లింకులు కనుగొనబడలేదు.

4 పునరావృత ఫిర్యాదులు: వంతారా పదేపదే ఇలాంటి ఆరోపణలను ఎదుర్కొందని కోర్టు గుర్తించింది, అన్నీ అర్హత లేకుండా కనుగొనబడ్డాయి. అటువంటి ఊహాజనిత పిటిషన్లను కొనసాగించడం ప్రక్రియ దుర్వినియోగంగా పేర్కొనబడింది.

సిట్ దర్యాప్తు

- SIT బహుళ భారతీయ మరియు విదేశీ అధికారులతో (CZA, CBI, ED, DRI, కస్టమ్స్, CITES సంస్థలు, మొదలైనవి) సమన్వయం చేసుకుంది.
- రికార్డులు, అఫిడవిట్లు, సైట్ సందర్శనలు, నిపుణుల అభిప్రాయాలు మరియు వ్యక్తిగత విచారణలను పరిశీలించింది.
- జంతువుల సేకరణ, స్మగ్లింగ్, లాండరింగ్, సంక్షేమం, పరిరక్షణ, ఆర్థిక అక్రమాలు మరియు పర్యావరణ సమస్యలకు సంబంధించిన ఆరోపణలను పరిశీలించినది.

కోర్టు ఆదేశాలు

SIT నివేదిక సీలు చేయబడింది, అంతర్గత ఉపయోగం కోసం వంతారాకు పూర్తి కాపీ. SIT నివేదిక సారాంశం గోప్యంగా లేదు మరియు కోర్టు ఆదేశంలో భాగం.

- షెడ్యూల్ Aలో పేర్కొన్న అన్ని ఫిర్యాదులు/పిటిషన్లు మూసివేయబడ్డాయి. అదే ఆరోపణలపై తదుపరి ఫిర్యాదులు ఏ ఫోరమ్‌లోనూ స్వీకరించబడవు. వంతారా మరియు అధికారులు SIT సూచించిన చర్యలను అమలు చేయాలి. పరువు నష్టం కలిగించే ప్రచురణలకు వ్యతిరేకంగా వంతారా పరిష్కారాలను అనుసరించవచ్చు.
- SIT సభ్యులు (సేవ చేస్తున్న IRS అధికారి తప్ప) వారి పనికి గౌరవ వేతనం పొందారు.

ముగింపు : సుప్రీంకోర్టు SIT యొక్క ఫలితాలను పూర్తిగా అంగీకరించింది, కేసులను ముగించింది మరియు అదే అంశాలపై పునరావృత వ్యాజ్యాలను నిషేధించింది. ఇది వంతారా యొక్క సంక్షేమ ప్రమాణాలు మరియు పరిరక్షణ ప్రయత్నాలను కూడా ప్రశంసించింది, అదే సమయంలో ఆధారం లేని ఆరోపణలకు వ్యతిరేకంగా హెచ్చరించింది.



తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

పథకాలకు పాతర.. చెప్పుల జాతర!

మొదటిపేజీ తరువాయి...

కళకళలాడిన మహానగరం రేవంత్ పాలనలో కళ తప్పిందని నిప్పులు చెరిగారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ముఖ్యమంత్రి, మంత్రులు మాత్రం మూటలు పంచుకోవడంలో బిజీగా ఉన్నారని ఆరోపించారు. 'రేవంత్ పాలనలో వీధి దీపాలు వెలగడం లేదు, చెత్త ఎత్తే నాథుడు లేడు, రోడ్లపై గుంతలు పూడ్చే పరిస్థితిలేదు, మురుగు కాలువలు శుభ్రం చేయడంలేదు' అంటూ తూర్పారబట్టారు. ఆదివారం నాటి వరదల కారణంగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయినా సర్కారులో చలనం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసం పథకాల జాతరకు తెరలేపిన కాంగ్రెస్ ఇప్పుడు పల్లెపల్లెనా చెప్పుల జాతరను తెరపైకి తెచ్చిందని ఎద్దేవా చేశారు. యూరియా కోసం అన్నదాతలు క్యూలలో పడిగాపులు పడుతుంటే రేవంత్ సర్కారు నిద్రమత్తులో మునిగితేలుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అవినీతిలో మునిగితేలిన హస్తం పార్టీ నేతలు యూరియాను సైతం బ్లాకుల్లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. 'మిర్యాలగూడ కాంగ్రెస్ ఎమ్మెల్యే గన్‌మెన్ లారీ యూరియాను ఎత్తుకుపోతే, ఎమ్మెల్యేలు, మంత్రులు కనీసం ఓ గోదాం యూరియా అన్నా అమ్ముకోరా? ప్రజలు కాంగ్రెస్ దోపిడీని అర్థం చేసుకోవాలి' అని కోరారు.

అంధకారంగా విద్యార్థుల భవిష్యత్తు

కాంగ్రెస్ సర్కారు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఎగనామం పెట్టడంతో రాష్ట్రంలోని 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. రేవంత్ సర్కారు చేతగానితనంతో పేద, మధ్య తరగతి పిల్లలు చదువుకొనే కాలేజీలు మూతపడే ప్రమాదమున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రూ. 3 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించడంతో పాటు రూ. 17 వేల కోట్లు ఖర్చు చేశామని గుర్తుచేశారు. 'మాది వందేండ్ల చరిత్ర కలిగిన పార్టీ. ఒడ్డు, పొడుగు కలిగినోళ్లం.ఆదాయం పెంచడం, సంక్షేమ పథకాలు ఇవ్వడమెలాగో మాకు తెలుసు' అని నాడు గప్పాలు కొట్టి గొప్పలు చెప్పిన ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క నేడు ఖజానాలో నిధుల్లేవని సాకులు చెప్తున్నారని ధ్వజమెత్తారు. కాంట్రాక్టర్లకు కమీషన్లు ఇచ్చి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న కాంగ్రెస్ పెద్దలు పేద విద్యార్థుల ఫీజులు చెల్లించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తెచ్చిన మంచి పథకాన్ని కేసీఆర్ సర్కారు కొనసాగించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తూట్లు పొడుస్తున్నదని ధ్వజమెత్తారు. ఇచ్చిన మాట మేరకు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుంటే బీఆర్‌ఎస్ తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

> ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తెచ్చిన మంచి పథకాన్ని కేసీఆర్ సర్కారు కొనసాగించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తూట్లు పొడుస్తున్నది. ఇప్పటికైనా ఇచ్చిన మాట మేరకు కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి. లేదంటే బీఆర్‌ఎస్ తరపున పోరాటం చేస్తాం. -కేటీఆర్

కేసీఆర్‌పై కోపంతోనే స్కీంలకు మంగళం


కేసీఆర్‌పై కోపంతోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆయన తెచ్చిన పథకాలకు ఎగనామం పెడుతున్నదని కేటీఆర్ ఆరోపించారు. గతంలో ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఎన్నో పథకాలను కేసీఆర్ కొనసాగించారని గుర్తుచేశారు. 'ప్రస్తుత సర్కారు కేసీఆర్‌పై అక్కసుతో కేసీఆర్ కిట్‌ను కట్ చేసింది. బతుకమ్మ చీరలను బంద్‌పెట్టింది. రంజాన్ తోఫాను ఎగ్గొట్టింది. క్రిస్మస్ కానుకకు మంగళంపాడింది. రైతుబంధు ఎగ్గొట్టింది. రుణమాఫీ పేరిట దగా చేసింది' అని ధ్వజమెత్తారు.

అత్తా కోడళ్ల మధ్య పైసల పంచాయితీ

కాంగ్రెస్ రాగానే పింఛన్ డబ్బులను రెట్టింపు చేస్తామని గప్పాలు కొట్టిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మొండి చెయ్యి చూపుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. 'అత్తకు నాలుగు వేల పింఛన్ ఇత్తం. కోడలుకు నెలకు రూ. 2,500 ఇత్తం అని ఇచ్చిన హామీని తుంగలో తొక్కి అత్తా కోడళ్ల మధ్య పంచాయితీ పెట్టారు' అని మండిపడ్డారు. కొత్త కోడలు వస్తే నెలకు రూ. 2,500 వస్తాయని సంతోషపడిన అత్త, నెలనెలా అత్తమ్మకు నెలకు రూ. 4 వేల పింఛన్ వస్తుందని సంబురపడిన కోడలు ఆశలను అడియాశలు చేశారని ధ్వజమెత్తారు.

పరువు తీస్తున్న రేవంత్..

అడ్డగోలు మాటలు, పచ్చి అబద్ధాలు చెప్తూ రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నాడు ఓట్ల కోసం, ఇప్పుడు సీటును కాపాడుకొనేందుకు మాయమాటలు చెప్తున్నారని విమర్శించారు. 'సెక్రటేరియట్‌లో లంకె బిందెలు ఉన్నాయనుకొన్నానని, ఢిల్లీకి వెళ్తే ఎవరూ నమ్మడం లేదని, బ్యాంకుల వద్దకు అప్పుల కోసం వెళ్తే చెప్పులు ఎత్తుకుపోయేవాడిలా చూస్తున్నారని, వేతనాలు అడిగిన ఉద్యోగులతో తనను కోసుకొని తిన్నా నయాపైసా రాలదు, నిలదీసిన ప్రతిపక్ష నాయకుల నుద్దేశించి పేగులు తీసి మెడలో వేసుకుంటానని, గుడ్లు పీకి గోలీలాడుకుంటానని' ఇలా తలాతోకలేని వ్యాఖ్యలతో ఇజ్జత్ తీస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేసీఆర్ పాలనలో అన్నిరంగాల్లో ముందున్న తెలంగాణను రేవంత్‌రెడ్డి తెలివిలేని పాలనతో దివాలా తీయిస్తున్నారని తూర్పారబట్టారు. ఇప్పటికైనా హామీలపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ భవన్‌లో అచ్చంపేట రైతు బక్కన్నను ఆప్యాయంగా దగ్గరికి తీసుకున్న కేటీఆర్

త్వరలోనే అచ్చంపేటకు వస్తా

మాజీ ఎమ్మెల్యే పార్టీ మారినా అచ్చంపేట కార్యకర్తలు మాత్రం బీఆర్‌ఎస్‌లోనే కొనసాగడం సంతోషకరమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన 300 మంది నాయకులు, కార్యకర్తలు కేటీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ నాయకులు పార్టీ మారినంతా మాత్రాన కార్యకర్తలు పార్టీని విడిచి పెట్టిపోరు అనే గొప్ప సందేశాన్ని అచ్చంపేట కార్యకర్తలు ఇచ్చారని చెప్పారు. వారి స్పందన చూసిన తర్వాత భవిష్యత్తులో ఏ నాయకుడు కూడా పార్టీని విడిచిపోరనే విశ్వాసం కలుగుతున్నదని తెలిపారు. 22 నెలల పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదని, చివరకు ఆయన సొంత గ్రామంలోని మాజీ సర్పంచ్‌ను వేధించి.. అతడి ఆత్మహత్యకు కారణమయ్యారని విమర్శించారు. త్వరలోనే తాను అచ్చంపేటలో పర్యటిస్తానని వెల్లడించారు. కార్యకర్తలు సమరోత్సాహంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కేటీఆర్‌తోనే నా ప్రయాణం: విష్ణువర్ధన్‌రెడ్డి

తన రాజకీయ ప్రయాణం కేటీఆర్‌తోనేనని మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి స్పష్టంచేశారు. ఇదే విషయాన్ని తాను గతంలోనూ చెప్పానని, ఇప్పుడూ అదే చెప్తున్నానని పేర్కొన్నారు. 'ఆయన (కేటీఆర్)కు ప్రమోషన్ ఉంటుంది. నాకూ ప్రమోషన్ ఉంటుంది' అని చెప్పారు. నవరాత్రి వేడుకలకు ఆహ్వానించేందుకు మాత్రమే తాను కవితను కలిశానని, ఇందులో ఎలాంటి రాజకీయ కారణం లేదని వెల్లడించారు.

పార్టీ మార్పు వదంతులు సరికాదు: సోహైల్

ఒక ఆలయ ట్రస్టీగా విష్ణువర్ధన్‌రెడ్డి దసరా నవరాత్రుల సందర్భంగా అందరినీ ఆహ్వానించడం ఆనవాయితీ అని, అందులో భాగంగానే ఆయన జాగృతి నాయకురాలు కవితను ఆహ్వానించేందుకు కలిశారని, ఇందులో ఎటువంటి రాజకీయ కోణం లేదని బీఆర్‌ఎస్ మైనారిటీ నాయకుడు సోహైల్ స్పష్టంచేశారు. అంతమాత్రన ఆయన పార్టీ మారుతున్నారనే వదంతులు సరికాదని చెప్పారు.

విజయం గులాబీదే

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్రాల్లో సర్వే చేసిన ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ తరఫున కూడా సర్వే నిర్వహించింది. తాజాగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై ఇటీవల కోడ్‌మో స్వతంత్రంగా టెలిఫోన్ ద్వారా సర్వే చేపట్టింది. దాదాపు రెండు వేలమంది నుంచి అభిప్రాయాలు సేకరించింది. వీరిలో 22.9 శాతం మంది మహిళలు ఉన్నారు. నియోజకవర్గంలోని 19 ప్రాంతాల్లో అన్ని వర్గాల ప్రజల్లో కొత్త ఓటరు మొదలు 50ఏండ్లుపైబడిన వారు ఇందులో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. నిరక్షరాస్యుల నుంచి వివిధ రకాల వృత్తులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నవారు, విద్యావంతులు సర్వేలో పాల్గొన్నారు.


10.1 శాతం ఓట్ల ఆధిక్యంలో గులాబీ


నియోజకవర్గంలో 42.8 శాతం మంది ఓటర్లు రానున్న ఉపఎన్నికలో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేయనున్నట్టు ఈ సర్వేలో స్పష్టం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీకి 32.7 శాతం మంది జైకొట్టగా.. మరో 19.5 శాతం మంది బీజేపీ వైపు మొగ్గుచూపారు. ఇతరులు మరో ఐదు శాతం ఉన్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ కంటే బీఆర్‌ఎస్ ఏకంగా 10.1 శాతం ఓట్ల ఆధిక్యాన్ని ప్రదర్శిస్తున్నట్టు సర్వే ద్వారా వెల్లడైంది. సర్వేలో వెల్లడైన ప్రధాన ఆసక్తికర అంశాలు ఇలా ఉన్నాయి...


- బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపిన ఓటర్లలో 46.5 శాతం మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తామన్న వారిలో మహిళా ఓటర్లు 34.4 శాతం ఉన్నారు.
- కొత్త ఓటర్లు బీఆర్‌ఎస్‌ను ఎక్కువగా ఆదరిస్తున్నట్టు వెల్లడైంది. 18–25 ఏండ్ల వారిలో బీఆర్‌ఎస్‌కు 50.5 శాతం ఆదరణ ఉంటే... కాంగ్రెస్ పట్ల 23.2 శాతం, బీజేపీకి 21.2 శాతంగా ఉంది.
- 26–35 సంవత్సరాల మధ్య ఉన్న ఓటర్లలో 45 శాతం బీఆర్‌ఎస్‌కు ఓటేస్తామని చెప్పగా, 26.1 శాతం కాంగ్రెస్‌కు వేస్తామన్నట్టు సర్వే నివేదిక పేర్కొన్నది. 36–50 ఏండ్ల మధ్య వారిలో బీఆర్‌ఎస్‌కు 44.7 శాతం ఆదరణ ఉంటే కాంగ్రెస్‌కు 33.8 శాతం ఉంది. అయితే 50 సంవత్సరాల పైబడిన వారిలో బీఆర్‌ఎస్‌కు ఓటేస్తామన్న వాళ్లు 35.9 శాతం ఉంటే, కాంగ్రెస్‌కు ఓటేస్తామన్న వాళ్లు 40 శాతంగా ఉన్నారు.
- ఈ సర్వేలో వెల్లడైన మరో ఆసక్తికర అంశం... దాదాపు అన్ని మతాలవారు బీఆర్‌ఎస్‌ను ఆదరించడం విశేషం. ముస్లిం మైనార్టీల్లో 46.5 శాతం, క్రిష్టియన్ మైనార్టీల్లో ఏకంగా 58.7 శాతం మంది గులాబీ పార్టీకి జై కొట్టారు.
- వృత్తులవారీగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు, సొంత వ్యాపారం చేసుకునేవారు, గృహిణులు, డ్రైవర్లు, నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులతోపాటు విద్యార్థులు ఈ సర్వేలో తమ అభిప్రాయాలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు మినహా మిగిలిన వారందరిలో కాంగ్రెస్ కంటే బీఆర్‌ఎస్ పార్టీకే విశేష ఆదరణ కనిపించింది. ప్రభుత్వ ఉద్యోగుల్లో మాత్రం స్వల్ప తేడాతో ఎక్కువ మంది కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు.
- నిరక్షరాస్యులు, వివిధ స్థాయి విద్యార్హతలు ఉన్న ఏడు క్యాటగిరీల వారిలో కూడా బీఆర్‌ఎస్ పార్టీకే ఆదరణ కనిపించింది. సామాజిక వర్గాల వారీగా చూసినా అత్యధికంగా ఓటర్లు బీఆర్‌ఎస్‌కు ఓటేస్తామని స్పష్టం చేశారు.

సారే.. మళ్లీ రావాలి

కోడ్‌మో సంస్థ ఈ సర్వేలో వచ్చేసారి ముఖ్యమంత్రి ఎవరు కావాలని కోరుకుంటున్నారనే ప్రశ్నను కూడా ఓటర్ల ముందుఉంచింది. ఈ క్రమంలో ఏకంగా 46 శాతం మంది మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కుండబద్ధలు కొట్టారు. 28.4 శాతం మంది రేవంత్‌రెడ్డి తిరిగి సీఎం కావాలని కోరుకుంటుండగా... కేంద్ర మంత్రి, బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సీఎం కావాలని 1.1 శాతం మంది కోరుకున్నారు. కాంగ్రెస్ సర్కారు పనితీరు ఎలా ఉందనే కీలక అంశాన్ని కూడా ప్రస్తావించగా.. 41.5 శాతం జూబ్లీహిల్స్ ఓటర్లు రేవంత్ సర్కారు పనితీరు ఏమీ బాగాలేదని పెదవి విరిచారు. 35.4 శాతం మంది బాగానే ఉందని చెప్పగా.. 23.1 శాతం మంది పరవాలేదు అని వెల్లడించారు. మరోవైపు ప్రజా సమస్యలను కూడా ఓటర్ల ముందు ఉంచగా.. 38.4 శాతం ఓటర్లు ఎలాంటి సమస్యను ఏకరువు పెట్టలేదు. కానీ 61.6 శాతం మంది మాత్రం డ్రైనేజీ, అధ్వాన రహదారులు, మంచినీటి సమస్య, ట్రాఫిక్, కరెంటు కోతలు తదితర సమస్యల్ని ఎదుర్కొంటున్నామని వెల్లడించారు.









మాజీ జడ్పీటీసీ లావణ్య, రాంబాబు దంపతుల కుమారుడికి నామకరణం చేస్తున్న కేటీఆర్

చిన్నారికి సూర్యాంశ్‌గా కేటీఆర్ నామకరణం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తేతెలంగాణ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని అన్నపురెడ్డిపల్లి మాజీ జడ్పీటీసీ లావణ్య, రాంబాబు దంపతుల కుమారుడికి... బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సూర్యాంశ్ అని నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఆ దంపతులు మురిసిపోయారు. ఈ అపురూపమైన క్షణాలు జీవితాంతం గుర్తుండిపోతాయని తెలిపారు. సోమవారం తమ కుమారుడి నామకరణ మహోత్సవానికి అభిమాననేత కేటీఆర్ హాజరు కావడం, పేరు పెట్టడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా చిన్నారిని కేటీఆర్ ఎత్తుకుని ముద్దుచేశారు. ఏ అక్షరంతో పేరు పెట్టాలని లావణ్య, రాంబాబు దంపతులను అడిగారు. పండితుల సూచనల మేరకు 'సు' అక్షరంతో పేరు పెట్టాలని కోరారు. కేటీఆర్ తన కుమారుడు హిమాన్షు పేరును గుర్తుచేసుకుంటూ ఆ బాబుకు సూర్యాంశ్ అని పేరు పెట్టారు. ఈ సందర్భంగా లావణ్య, రాంబాబు దంపతులు భావోద్వేగానికి గురయ్యారు. గతంలో జడ్పీటీసీ టికెట్ ఇచ్చి రాజకీయంగా ప్రోత్సహించిన కేటీఆర్, ఇప్పుడు తమ కుమారుడికి పేరు పెట్టడంపై సంతోషం వ్యక్తంచేశారు. అడిగిన వెంటనే వేడుకకు హాజరు కావడాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటామని చెప్పారు.

'స్థానికత'పై మానవీయ కోణంలో ఆలోచించాలి


మెడికల్ ప్రవేశాలపై ప్రభుత్వానికి కేటీఆర్ విజ్ఞప్తి • అర్హత సాధించిన విద్యార్థులతో భేటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ విద్యార్థుల మెడికల్ అడ్మిషన్ల విషయంలో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. మెడికల్ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించినప్పటికీ, ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త స్థానికత జీవో కారణంగా ప్రవేశాలకు అనర్హులుగా మిగిలిపోతున్న తెలంగాణ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాలసీపరమైన మార్పులు లేదా స్థానికతకు సంబంధించిన అర్హతలను మార్చినప్పుడు, వాటిని గతానుగతంగా కాకుండా భవిష్యత్తు కోసం కటాఫ్ డేట్ పెట్టి, రెండు లేదా మూడేండ్ల సమయం ఇస్తే బాగుంటుందని సూచించారు. కానీ, విద్యార్థులు అప్పటికే తమ ఇంటర్మీడియట్‌ను ఇతర ప్రాంతాల్లో చదువుతూ, ప్రిపేర్ అవుతున్న వారిని పరిగణనలోకి తీసుకోకుండా ఇచ్చిన ఆదేశాలతో ఈ పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకొని విద్యార్థులకు ఉపశమనం కల్పించాలని ఆశాభావం వ్యక్తంచేశారు.

సీఎస్‌తో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం స్థానికతకు సంబంధించి ఇబ్బందికరమైన జీవోను తీసుకువచ్చిందని విద్యార్థులు కేటీఆర్‌కు తెలిపారు. గతంలో పదో తరగతి వరకు 7 సంవత్సరాలు ఎక్కడ చదివితే అక్కడే స్థానికులుగా పరిగణించే నిబంధన ఉండేదని వారు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు 9, 10, 11, 12 తరగతులు వరుసగా చదివిన వారికే స్థానికత వర్తిస్తుందని, వారికే మెడికల్ సీట్ల అడ్మిషన్లు దక్కుతాయని వివరించారు. కొత్తగా ఇచ్చిన ఆదేశాల వల్ల వందల మంది విద్యార్థులు నష్టపోతున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తంచేశారు. పదో తరగతి వరకు తెలంగాణలో చదివిన తర్వాత, అత్యుత్తమ శిక్షణ కోసం ఆంధ్రాతో పాటు అనేక నాన్–తెలుగు రాష్ట్రాలలో కోచింగ్‌లు తీసుకుని నీట్ పరీక్షలకు సన్నద్ధమయ్యామని తెలిపారు. ఇప్పుడు ప్రతిభ కనబరిచి అర్హత సాధించినప్పటికీ, ప్రభుత్వం అనర్హులుగా ప్రకటించి ప్రవేశాలు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయంలో ప్రభుత్వం మొండిగా సుప్రీంకోర్టు వరకు వెళ్లిందని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలను విన్న కేటీఆర్, వెంటనే ప్రభుత్వ ప్రధానకార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తిచేశారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని కలుస్తుందని కేటీఆర్ విద్యార్థులకు తెలిపారు.

లోకం పోకడ



మాకు చిన్నా, పెద్ద తేడాల్లేవయ్యా.. అందరికీ ఒకే పద్ధతి!

వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	35.1°c	24.1°c
రంగారెడ్డి	35.0°c	21.0°c
మెదక్	34.9°c	24.0°c
నిజామాబాద్	31.7°c	23.6°c
ఖమ్మం	31.0°c	23.0°c
వరంగల్	31.0°c	22.0°c
నల్లగొండ	30.0°c	23.4°c
కరీంనగర్	30.0°c	26.0°c
మహబూబ్‌నగర్	30.0°c	24.0°c
హైదరాబాద్	28.8°c	22.1°c

బండి సంజయ్‌పై కేటీఆర్ పరువు నష్టం దావా

అనుచిత వ్యాఖ్యలు ప్రసారం చేసిన మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ వేదికలపై కూడా..

విచారణకు స్వీకరించిన కోర్టు.. డిసెంబర్ 15న హాజరవ్వాలని ఆదేశం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు/హైదరాబాద్ సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై పరువు నష్టం దావా వేశారు. తనపై తప్పుడు ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేసి పరువుకు భంగం కలిగించిన సంజయ్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదా రూ.10 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొన్ని మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమాలపై కూడా హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో సోమవారం పరువు నష్టం దావా వేశారు. సోమవారం విచారణకు స్వీకరించిన కోర్టు బండి సంజయ్‌కి సమన్లు జారీచేస్తూ డిసెంబర్ 15న విచారణకు హాజరవ్వాలని ఆదేశించింది.

వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా బండి వ్యాఖ్యలు

కేటీఆర్‌కు విరుద్ధంగా బండి సంజయ్ ఆగస్టు 8న తప్పుడు ఆరోపణలతోపాటు అనుచితమైన వ్యాఖ్యలు చేశారని ఆయన తరపు న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను ఏబీఎన్ తెలుగు, ఎన్టీవీ, టీవీ5, వీ6, ఏఎన్ఎన్ తెలుగు వంటి టీవీ చానళ్లు, ఇండియా టుడే, ఎన్డీటీవీ, డెక్కన్ హెరాల్డ్, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్, గూగుల్, మెటా (ఫేస్ బుక్/ఇన్‌స్టాగ్రామ్) వంటి సోషల్ మీడియా సంస్థలు విస్తృతంగా ప్రసారం చేశాయని తెలిపారు. ఈ వ్యాఖ్యలు కేవలం ఆయన పరువుకు భంగం కలిగించడమే కాకుండా, కేటీఆర్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని తెలిపారు. 2025 ఆగస్టు 11న లీగల్ నోటీసు పంపినప్పటికీ, బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పడానికి నిరాకరించడంతో కేటీఆర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు పేర్కొన్నారు. బండి సంజయ్ కేవలం రాజకీయ కక్షతో నిందారోపణలు చేస్తూ దుష్ప్రచారానికి పాల్పడ్డారని వెల్లడించారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ ఇటువంటి బాధ్యతారహితమైన, పరువునష్టం కలిగించే వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజాప్రతినిధుల విశ్వసనీయత, గౌరవానికి తీవ్రమైన పరిణామాలు ఉంటాయని తమ దావాలో వెల్లడించారు. బండి సంజయ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు.

'వక్ఫ్' మధ్యంతర ఉత్తర్వులపై హర్షం

సవరణ చట్టంలో సమస్యలపై పోరాడాం

మతసామరస్యానికి బీఆర్‌ఎస్ కృషి: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): వక్ఫ్ సవరణ చట్టం–2025పై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వాగతించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ చట్టంలోని వివాదాస్పద నిబంధనలపై బీఆర్‌ఎస్ మొదటి నుంచీ ఆందోళనలను గట్టిగా వినిపించిందని గుర్తుచేశారు. ఈ చట్టం ప్రగతిశీలత ముసుగులో మత సామరస్యానికి విఘాతం కలిగించడానికి ప్రయత్నిస్తుందని వివరించారు. వక్ఫ్ సవరణ చట్టంలోని సమస్యలపై తాము పోరాడామని స్పష్టంచేశారు. బీఆర్‌ఎస్ ఎప్పుడూ దేశంలోని మతసామరస్య వాతావరణాన్ని పరిరక్షించడానికి కృషి చేస్తుందని స్పష్టం చేశారు. రాజకీయాల కన్నా దేశ ఐక్యత ముఖ్యమని తాము విశ్వసిస్తామని తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రాజ్యసభలో తమ పార్టీ సభ్యులు పూర్తి శక్తితో పోరాడారని, భవిష్యత్తులో కూడా అవసరమైనప్పుడు దేశ సమగ్రత కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రంలో ఒక్క మత ఘర్షణ కూడా జరగలేదన్నారు. ఇది తమ పాలనా నిబద్ధతకు నిదర్శనమని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో షాదీ ముబారక్, రంజాన్‌తోఫా పథకాలను రూపొందించి, అమలు చేశామని గుర్తుచేశారు. ఈ పథకాలు తమ హయాంలో మైనారిటీలకు చాలా లబ్ధి చేకూర్చాయని తెలిపారు.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

మంగళవారం TUESDAY 16.9.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 102 | వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



వైద్యం అందక ఆవేదన

అమ్మకు చికిత్స చేయని 'గాంధీ'!

పక్షవాతం వచ్చిన తల్లిని గాంధీ దవాఖానకు తీసుకెళ్తే బెడ్లు లేవని వైద్యులు నిరాకరించారు. కనిపించిన డాక్టర్‌నల్లా వేడుకున్నా కాదుపొమ్మన్నారు. ఆవేదనతో ఆ యువకుడు తన వృద్ధ తల్లిని తీసుకొని సోమవారం సచివాలయం వద్దకు వచ్చాడు. 'సీఎం సార్.. మేం మీకు ఓటేసినం. మా అమ్మకు వైద్యం చేయించు' అంటూ నినాదాలు చేశాడు.

అంగన్‌వాడీల ఆక్రోశం



మా బతుకులు ప్రశ్నార్థకం చేయొద్దు

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసి తమ బతుకులను ప్రశ్నార్థకం చేయొద్దని, అంగన్‌వాడీల్లోనే చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్య అందించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. సీఎం, మంత్రుల ఇండ్లను ముట్టడించారు. కొడంగల్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయం, ఇల్లు ముట్టడికి యత్నిస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిని అడ్డుకుంటున్న పోలీసులు.

అన్నదాతల ఆక్రందన



ఒక్క యూరియా బస్తా కోసం ఉయ్యాలో

నాడు తెలంగాణ ప్రజల గోస బతుకమ్మ పాటల రూపంలో వ్యక్తమైంది. నేడు తెలంగాణ రైతుల యూరియా కష్టాలను కూడా బతుకమ్మ పాటల రూపంలో పాడుకునేదాకా వచ్చింది. రాష్ట్రంలో ఎరువుల కొరతపై సోమవారం కరీంనగర్ మండలం దుర్శేడులో మహిళలు వినూత్నంగా బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. 'ఒక్క యూరియా బస్తా కోసం ఉయ్యాలో.. పడిగాపులు పడుతున్నరు ఉయ్యాలో'' అంటూ పాట పాడుతూ బతుకమ్మ ఆడి కాంగ్రెస్ సర్కార్ తీరును ఎండగట్టారు. వీరికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మద్దతు పలికారు.

సకల జనుల సమరం

రైతుల నుంచి విద్యార్థుల దాకా రోడ్డెక్కి ఆందోళన.. యూరియా కోసం అన్నదాతల ఫైట్.. సమస్యలపై అంగన్‌వాడీల జంగ్

సబ్బండవర్ణాల ధర్నాలు, ముట్టడులతో అట్టుడికిన తెలంగాణ.. కాంగ్రెస్ సర్కారు తీరుపై రాష్ట్రవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు

తెలంగాణలో సకల జనుల సమరభేరి మోగుతున్నది. రాష్ట్రంలోని అన్ని వర్గాలు రోడ్డెక్కుతున్నాయి. నాడు స్వరాష్ట్రం కోసం సకల జనుల సమ్మెతో ఉద్యమించిన తెలంగాణ సమాజం.. ఇప్పుడు సర్కారు దమన నీతి మీద సమరం చేస్తున్నది. సర్కారు చేతగానితనాన్ని నిలదీస్తున్నది. పట్టింపులేని వైఖరిని ప్రశ్నిస్తున్నది. సామాన్య ప్రజల నుంచి మొదలుకొని సంఘటిత వర్గాల దాకా.. సేద్యం చేసుకునే రైతు నుంచి అంగన్‌వాడీల దాకా.. కళాశాలల యాజమాన్యాల నుంచి.. ఆరోగ్యశ్రీ నిర్వాహకుల దాకా అంతా సర్కారు మీద నిరసన గళమెత్తుతున్నారు. దివ్యాంగులు, హోంగార్డులు, భూ నిర్వాసితులు, ఆటో డ్రైవర్లు, నిరుద్యోగులు ఇలా సకల జనులంతా గొంతెత్తుతున్నారు. రెండేండ్లలోనే ఎంత మార్పు? ఎంప్లాయీస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం మాయమైంది. రైతును నెత్తిమీద పెట్టుకున్న సర్కారు కనుమరుగైంది. విదేశాల్లో విద్యార్జనకూ లక్షల నిధులిచ్చిన పాలన పోయి ఫీజుల చెల్లింపునకే చేతులెత్తేసే పరిస్థితి. ఆరోగ్యశ్రీ కొన ఊపిరితో కొట్టు మిట్టాడుతున్నది. యూరియా అందక పంటలు పశువుల పాలవుతున్నాయి. గురుకులాల్లో పసి పిల్లల ప్రాణాలు గాల్లో దీపాలయ్యాయి. పాలన అంటే ఒక కళ. ప్రభుత్వ నిర్వహణ ఒక నైపుణ్యం. పాలనలో ప్రాధాన్యక్రమ నిర్ధారణ ఒక రాజనీతిజ్ఞత. ప్రజల అవసరాలెరిగి పాలన సాగించడమే పాలకుడి సమర్థతకు గీటురాయి. అయితే ఈ సర్కారుకు ఇవేవీ లేవు. పాలన పట్టదు. ప్రజలు గిట్టరు. నిరసనలు రుచించవు. పాలించే చేవ లేదు..ప్రభుత్వాన్ని నడపడం చేతగాదు. దాని పర్యవసానంగానే కడుపు మండిన ప్రజలు రోడ్ల మీదికి వస్తున్నారు. తోలుమందం సర్కారు మీద కన్నెర్ర చేస్తున్నారు !!

'స్థానికత'పై మానవీయ కోణంలో ఆలోచించాలి

మెడికల్ ప్రవేశాలపై ప్రభుత్వానికి కేటీఆర్ విజ్ఞప్తి

పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులతో భేటీ



నేటినుంచి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల సమ్మె

నిలిచిపోనున్న విద్యుత్తు మరమ్మతు పనులు

ఎస్‌ఎస్‌ఆర్ పెంచే దాకా కొనసాగిస్తాం

ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్

ఆర్ఆర్ఆర్ రైతుల ఫైర్



కాంగ్రెస్ సర్కారు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడం వల్ల తమ భూములు కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తూ హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేస్తున్న వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల రైతులు

రాజుకున్న ట్రిపుల్ ఆర్ నిప్పు



అలైన్‌మెంట్ మార్పుతో రోడ్డెక్కిన రైతన్నలు


హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయం ముట్టడి

భారీగా వచ్చిన భూనిర్వాసితులు, రైతులు

దళితుల భూములే లక్ష్యంగా అలైన్‌మెంట్‌ను మార్చారంటూ వెల్లువెత్తుతున్న విమర్శలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు అడ్డదిడ్డంగా గీసిన ట్రిపుల్ ఆర్ గీతలు చిన్న, సన్నకారు రైతుల పాలిట శాపంలా మారుతున్నాయని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అలైన్‌మెంట్ మార్పులను నిరసిస్తూ రోడ్డెక్కుతున్నారు. ఆందోళనలు చేపట్టేందుకు రాజధాని నగరానికి క్యూకడుతున్నారు. అలైన్‌మెంట్ మార్పులతో జీవనోపాధి కోల్పోతున్నామంటూ సోమవారం రైతులు హెచ్‌ఎండీఏ కార్యాలయాన్ని ముట్టడించారు. పలు జిల్లాల నుంచి వచ్చిన రైతులు అధికారులను కలిసేందుకు ప్రయత్నించగా లోపలికి అనుమతించకుండా ఇన్‌వార్డ్ నుంచే వెనక్కి పంపిస్తున్నారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ నోటిఫికేషన్‌ను హెచ్‌ఎండీఏ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించడంతో అసలు సమస్య మొదలైంది. గత అలైన్‌మెంట్ కాకుండా మార్పులు చేసిన మ్యాపులో గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ల వారీగా జాబితా ప్రచురించడంతో హెచ్‌ఎండీఏ భూసేకరణ చేస్తున్నదని రైతులు భావిస్తున్నారు. నల్లగొండ, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల నుంచి రైతులు ఉదయాన్నే హెచ్‌ఎండీఏ కార్యాలయానికి చేరుకుని పాత అలైన్‌మెంట్‌తోనే › 5వ పేజీలో

పింఛన్లు ఎప్పుడు పెంచుతరు?



ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రూ.6016 పింఛన్ ఇవ్వాలని దివ్యాంగులు, రూ.4016 పింఛన్ ఇవ్వాలని వృద్ధులు డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా యాచారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్న దివ్యాంగులు, వృద్ధులు.

గంగపుత్రుల గోస



చెరువులపై మా హక్కులు కాపాడండి

కొండ్రికర్ల, కోనరావుపేట గంగపుత్రుల వేడుకోలు

జగిత్యాల ప్రజావాణిలో పెట్రోల్ డబ్బాలతో నిరసన



అన్నదాత కడుపుమండి

తన భూమికి వోఆర్‌సీ చేయడం లేదని మనస్తాపం

పాలమూరులో ఆటోకు నిప్పంటించిన వైనం

అనంతరం తానూ ఆత్మహత్యాయత్నం

నిరుద్యోగుల ఆగ్రహజ్వాల



మన కొలువులు మనకే..

తెలంగాణ ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకే దక్కాలని పోలీసు నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా ఎదుట జీవో 46 ప్రతులను చింపివేసి నిరసన తెలిపారు.

కాంట్రాక్టర్ల కుతకుత



రూ. 600 కోట్ల 'మన ఊరు-మన బడి' పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కాంట్రాక్టర్లు మరోసారి ఆందోళనకు దిగారు. సోమవారం సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ఎదుట ధర్నా చేయగా పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

కార్మికుల కన్నెర్ర



కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట గిరిజన ఆశ్రమ పాఠశాల కార్మికులు చేస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరింది. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఫీజు కోసం విద్యార్థుల పోరు



ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని సోమవారం మాసబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్వీ విద్యార్థులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఆర్టీసీ యూనియన్లపై ఆంక్షలు ఎత్తేయండి

మ్యానిఫెస్టో హామీని నెరవేర్చండి

ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

ముఖ్యమంత్రికి మెయిల్ ద్వారా లేఖ

సమ్మె దిశగా రేషన్ డీలర్లు

అక్టోబర్ 1 నుంచి దుకాణాల బంద్!

పేరుకుపోయిన 100 కోట్ల బకాయిలు

తన వాటా నిధులు విడుదల చేసిన కేంద్రం

రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో పెండింగ్

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయండి

టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్

మంత్రి పొంగులేటి, డీజీపీ, అంబేద్కర్ విగ్రహానికి వినతి

కేసులు ఎత్తివేయకపోతే ఐక్య పోరాటాలకు సిద్ధమని హెచ్చరిక

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

ప్రభుత్వంతో కొలిక్కిరాని దవాఖానల చర్చలు

1,400 కోట్ల చెల్లింపులో సర్కారు తీవ్ర నిర్లక్ష్యం

ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో బకాయిలు

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

బ్రిటన్‌లో వలసల వ్యతిరేకత

సూర్యుడు అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం నేడు జాతుల విముక్తి పోరాటాల పుణ్యమా అని పిడికెడు ప్రభావ ప్రాంతాలకు పరిమితమైపోయింది. నవ స్వతంత్ర దేశాలతో బ్రిటిష్ కామన్వెల్త్ ఏర్పాటు చేసి ఏదో రకంగా సంబంధ, బాంధవ్యాలు నెరపుతున్నది. ఫలితంగా ఆయా దేశాల నుంచి ప్రజల రాకలూ నిరంతరంగా పెరిగిపోయాయి. వలస పాలన కింద మగ్గిన దేశాల పేదరికం, అవకాశాల లేమి బ్రిటన్ వైపు చూసేలా చేశాయి. అటు బ్రిటన్ వైపు నుంచి చూస్తే అపరాధ భావన, జనాల కొరత ఈ వలసలకు ఆజ్యం పోశాయి. దీనివల్ల ఇప్పుడు యూకే పేరుతో వ్యవహరిస్తున్న నాటి బ్రిటన్‌లో జనాభా తీరుతెన్నులే మారిపోయాయి. భిన్నజాతుల సంగమంతో ఏర్పడిన మిశ్రమం వల్ల సంస్కృతి, సంప్రదాయాల్లోనూ గణనీయమైన మార్పులే వచ్చాయి. అక్కడి ప్రజా జీవితంలో మాజీ వలస దేశాల సంతతివారు ప్రముఖ పాత్ర వహించే స్థాయికి ఎదగడం మామూలు విషయం కాదు. దీనికి పరాకాష్ఠగా ఓ పాక్ సంతతి వ్యక్తి లండన్ మేయర్ కావడం, భారత సంతతి వ్యక్తి ఏకంగా దేశానికి ప్రధాని కావడం గురించి చెప్పుకోవచ్చు. కానీ, ఇటీవలి కాలంలో ఆసియా, ఆఫ్రికా దేశాల నుంచి వలస వచ్చేవారి పట్ల బ్రిటన్‌లో ఎదురుగాలి వీస్తున్నది. 'ఈ సంతను మేమెందుకు భరించాలి?' అనే ధోరణి అక్కడి మూలవాసుల్లో వ్యక్తమవుతున్నది. ఫలితమే 'మా దేశాన్ని మాకివ్వండి' అనే ఉద్యమం. ఒకప్పుడు బ్రిటన్ పాలిత దేశాల్లో వినిపించిన ఈ నినాదం ఇప్పుడు బ్రిటన్‌లో ప్రతిధ్వనించడం కాల వైచిత్రి.

చిన్నచిన్న పడవల్లో ఇంగ్లిష్ చానల్ దాటి వస్తున్న వలసదారుల వార్తలతో బ్రిటన్‌లో వలస వ్యతిరేక చర్చ వేడెక్కుతున్నది. గత శనివారం రాజధాని లండన్ నగరం నడిబొడ్డున సుమారు లక్షన్నర మందితో జరిగిన ప్రదర్శన ఈ ధోరణికి బలమైన నిదర్శనం. బ్రిటన్‌లో ఆశ్రయం కోరి వచ్చేవారు బసచేసిన హోటళ్ల దగ్గర చిన్నచిన్న ప్రదర్శనలతో మొదలైన నిరసనలు మహాప్రదర్శనతో తారస్థాయికి చేరుకున్నాయి. శాంతియుతంగా మొదలైన లండన్ నిరసన చివరికి హింసాత్మకమైంది.

బ్రిటన్ జాత్యహంకార సామాజిక కార్యకర్త టామీ రాబిన్సన్ నేతృత్వంలో జరిగిన ఈ నిరసన ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. లండన్ ప్రదర్శనలో పాల్గొన్న నిరసనకారులు 'ఇప్పటివరకు జరిగింది చాలు', 'మా పిల్లల భవితను కాపాడండి', 'వలసదారులను వెనక్కి పంపండి' వంటి నినాదాలు రాసిన ప్లకార్డులు పట్టుకున్నారు. రాబిన్సన్ సహా వక్తలు యురోపియన్ సమాజంలో మహా జనాభా మార్పిడి గురించి ఆవేశాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. అడ్డూఅదుపూ లేని వలసలతో బ్రిటన్‌లో విధ్వంసం జరుగుతున్నదని గగ్గోలు పెట్టారు. దేశదేశాల్లో వాణిజ్య సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్న పారిశ్రామిక దిగ్గజం టెస్లా అధినేత ఎలాన్ మస్క్ వీడియో ప్రసంగం ద్వారా వారితో గొంతు కలుపడం విశేషం. 'హింస మీ దగ్గరకు వస్తున్నది.. తిరగబడటమో, చావడమో రెండే మీ ముందున్నాయి' అంటూ రెచ్చగొట్టడమే కాకుండా కీర్ స్టార్మర్ నేతృత్వంలోని లేబర్ పార్టీ సర్కారును గద్దెదించాలని ఆయన పిలుపునివ్వడం విస్మయం కలిగిస్తున్నది.

నిజానికి వలస వ్యతిరేక ధోరణి బ్రిటన్‌కు మాత్రమే పరిమితమైన వ్యవహారం కాదు. మాజీ వలస సామ్రాజ్యాలైన ఇతర యూరప్ దేశాల్లోనూ వలస వచ్చిన వారి పట్ల వ్యతిరేకత క్రమంగా పెరుగుతుండటం చూస్తున్నాం. ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీల్లో ఇదే ఎజెండాతో పార్టీలు పుట్టుకువచ్చాయి. ఫ్రాన్స్‌లో ఇదే ఎజెండాతో పోటీచేసిన మేరీ లెపెన్ నేతృత్వంలోని నేషనల్ ఫ్రంట్ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో, యురోపియన్ యూనియన్ ఎన్నికల్లో గణనీయమైన స్థానాలు రావడం గమనార్హం. 2018లో 'యూ-గవ్' జరిపిన సర్వేలో జర్మనీలో 72%, డెన్మార్క్‌లో 65%, ఫిన్లాండ్‌లో 64%, స్వీడన్‌లో 60%, యూకేలో 58%, ఫ్రాన్స్‌లో 58%, నార్వేలో 52% మంది వలసలకు వ్యతిరేకత తెలిపారు. కాగా, అదే సంస్థ ఈ ఏడాది గత పదేండ్లలో వలసలు పెరిగాయా? వాటివల్ల మూలవాసులకు నష్టం జరిగిందా? అనే ప్రశ్నలతో జరిపిన సర్వేలో అత్యధికులు, అంటే జర్మనీలో 81%, స్పెయిన్‌లో 80%, స్వీడన్‌లో 73%, బ్రిటన్, ఇటలీలో 71%, ఫ్రాన్స్‌లో 69% మంది 'ఔనవే' సమాధానమిచ్చారు. ఈ దేశాలు అన్నిటిలో ఇప్పుడు వలసల నిలిపివేతే కీలక అంశంగా ఉంటున్నది. ఒకప్పుడు యూరోపియన్ దేశాల పడవలు విదేశీ తీరాలకు చేరుకుని వలస దోపిడీతో వణికిస్తే, ఇప్పుడు అవే దేశాలవారిని మోసుకొస్తున్న పడవలు యూరప్ దేశాల్లో దడ పుట్టించడం గొప్ప చారిత్రక విరోధాభాస.

ఆంధ్రలో నీరాజనాలు.. తెలంగాణలో నిందలు!



చంద్రి రాఘవరెడ్డి

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి దాదాపు 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిత్తూరు జిల్లా కుప్పంలోని పరమసముద్రం చెరువును కృష్ణా జలాలతో నింపుతున్న వీడియోలను ఇటీవల చూసినప్పుడు మనసుకు ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది. ఏ రైతుకైనా లేదా వ్యవసాయంతో అనుబంధమున్న ఎవరికైనా సరే ఈ దృశ్యాలు అమితానందాన్నిస్తాయి. అంతేకాదు, రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదనే భరోసా కలిగిస్తాయి. ప్రాంతంతో సంబంధం లేకుండా తెలంగాణ సరిహద్దుల నుంచి తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో బీడువారిన గ్రామాల్లోని చెరువులను నింపుతూ నీళ్లు ఇంత దూరం ప్రయాణించడం ఒక మధుర ఘట్టమనే చెప్పాలి. ఈ ప్రయాణంలో కృష్ణా జలాలు మార్గమధ్యంలో అనేక జలాశయాలను నింపుతూ, కరువు ప్రభావిత రాయలసీమకు జీవం పోస్తాయి.

భారతదేశ సైన్స్, టెక్నాలజీ రంగాలు, ప్రపంచ దౌత్యపరంగా గణనీయమైన పురోగతి సాధిస్తున్న ప్రస్తుత రోజుల్లోనూ వ్యవసాయానికి నీళ్లను అందించడం సాధ్యంకాని కలగానే మిగిలిపోయింది. అంతేకాదు, రైతులను పాలకులు ప్రకృతి అస్థిరతలకు వదిలేశారు. అయితే గత రెండు మూడు దశాబ్దాలను పరిశీలిస్తే, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా, గోదావరి నీటిని ఉపయోగించడం లేదా మళ్లించడంలో గణనీయమైన పురోగతి కనిపిస్తున్నది. తెలంగాణలో నీటిపారుదల రంగాభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ చర్యలు ఆలస్యంగా రాష్ట్ర విభజన తర్వాత ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ, 2014-2023 మధ్యకాలంలో వేగం పుంజుకోవడమే కాదు; గోదావరి, కృష్ణా నీటిని గొప్పగా ఉపయోగించడంలో అత్యద్భుతమైన ఫలితాలను సాధించారు.

నీటిపారుదలరంగంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలకు సంబంధించిన లెక్కల గురించి కాదు ఈ వ్యాసం. సోషల్ మీడియా, ప్రధాన తెలుగు మీడియా (ప్రింట్, ఎలక్ట్రానిక్) సహాయంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని నీటిపారుదల పథకాలపై వ్యాప్తి చేసిన, చేస్తున్న విరుద్ధమైన కథనాల గురించి వివరించి చెప్పడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

తెలంగాణలోని రైతులు, పరిశీలకుల మెదళ్లలో శాశ్వతంగా నిలిచిపోయేవి ఈ విరుద్ధ కథనాలే. ఉదాహరణకు కృష్ణా నీళ్లతో కుప్పం ప్రాంతంలోని చెరువులను నింపడం పట్ల ఏపీలో విజయోత్సవాలు చేసుకున్నారు. దీనిపై విస్తృత ప్రచారం జరిగింది. రైతుల్లో ఉత్సాహం, అక్కడి అధికార పార్టీ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని కలిగించింది ఈ ఘటన. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ వార్త ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికే పరిమితమైంది. తెలంగాణ రైతులు, ముఖ్యంగా ప్రజలకు ఈ విషయం గురించి కనీస అవగాహన కూడా లేదు. తెలంగాణ వార్తాపత్రికల్లో ఈ వార్తను ప్రచురించకపోవడం, ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ దృశ్యాలను చూపించకపోవడమే అందుకు కారణం. దీని వెనుక తెలంగాణ ప్రజలకు తెలియని పలు కారణాలున్నాయి.

ఇందుకు విరుద్ధంగా 2023కు ముందు తెలంగాణలో ఇలాంటి అద్భుతమైన మైలురాళ్ల గురించిన వార్తలు ఈర్ష్యతోనూ, సాధ్యాసాధ్యాలపై అనుమానాలతోనూ, అసలు ఇలాంటివి అవసరమా? అనే సందేహాలతోనూ ప్రచురితమయ్యాయి. సాగునీళ్లు అన్ని ప్రాంతాల రైతులకు జీవనాడి అయినప్పుడు ఏపీలో ఎందుకు 'జలహారతి' ఇస్తూ ఉత్సవాలు చేసుకుంటున్నారు? తెలంగాణలో ఎందుకు నిందలు వేస్తున్నారు? వ్యయం-ప్రయోజనాల విశ్లేషణ, విద్యుత్ భారం, నదీ బేసిన్ల వెలుపల నీటిని మళ్లించడం, సంబంధిత చట్టాలు లాంటి ప్రశ్నలను ఏపీ విషయంలో చాలా అరుదుగా లేవనెత్తుతారు. కానీ, తెలంగాణ విషయంలో మాత్రం రైతుల ప్రయోజనాలను విస్మరించేందుకు కూడా సాహసిస్తున్నారు. అధికారంలో ఉన్నవారిపై ఆరోపణలు చేయడం, సర్కారుపై నిందలు వేయడం మొదలుకొని వాతావరణ మార్పుల వరకు వివిధ రకాల కథనాలను ఎలాంటి తడబాటు లేకుండా వ్యాప్తి చేస్తున్నారు.



> **తెలంగాణలో మీడియా కథనాల్లో సాగు విస్తీర్ణం, వరి సాగు వల్ల కార్బన్ ఉద్గారాల విడుదల గురించిన ఆందోళనలు, ఎకరం పంట పండించేందుకు అధిక సాగునీటి ఖర్చు, నీళ్లను ఎత్తిపోసేందుకు అత్యధిక విద్యుత్తు వ్యయం లాంటి అంశాలే ఎక్కువగా కనిపిస్తాయి. ఈ కథనాలు చివరికి వరిపై ఎక్కువ నీళ్లను వాడే పంటగా ముద్రవేసేంత వరకు, వరి సాగును తగ్గించాలని సూచించేంత వరకు వెళ్లాయి.**

రాష్ట్ర విభజన జరగకపోయి ఉంటే, తెలంగాణ రైతులకు వ్యవసాయం చేయడం తెలియదని, అందువల్ల వారికి సాగునీరు అవసరం లేదని సూచించే స్థాయికీ ఈ కథనాలు వెళ్లేవి. కానీ, వాస్తవానికి ఐదేండ్లలోనే వడ్ల ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లిన తెలంగాణ రైతుల సామర్థ్యాన్ని ఈ ప్రపంచం చూసింది. నిజానికి తెలంగాణ రైతులు వరి సాగు చేయకుండా నిరుత్సాహపరచాలని కొంతమంది మేధావులుగా చెప్పుకొనేవారు ప్రయత్నించారు. డయాబెటిస్ కారణంగా ప్రజలు అన్నం తినడం లేదని, అందువల్ల తెలంగాణ రైతులకు సాగునీరు అందించే ప్రయత్నాలు అనవసరమని ప్రచారం చేశారు. ప్రధాన మీడియా సంస్థల మద్దతు ఉంటే ఎలాంటి నెరేటివ్‌ను అయినా సులువుగా ప్రచారం చేయవచ్చని అనడానికి ఇదే నిదర్శనం. పండించిన ధాన్యాన్ని పూర్తిగా వినియోగించే ఇతర మార్గాలను ప్రభుత్వం వెతకాలే తప్ప, వరి సాగు చేయవద్దని చెప్తారా? అని తెలంగాణ రైతులు ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. పప్పు, కూరగాయలు, పండ్ల వంటి పంటలకూ వరికి ఇచ్చినట్టే మద్దతిస్తే, రైతులు ఇతర పంటలు పండించేందుకు సంకోచించరు.

ఇక అసలు విషయానికి వస్తే, ఏపీలో సాగు నీటి కోసం అక్కడి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, తొలి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలకు మధ్య వ్యత్యాసాలేమీ లేవు. ఈ రెండు రాష్ట్రాలు కరువు పీడిత ప్రాంతాలకు నీళ్లను తీసుకెళ్లేందుకు కష్టపడుతున్నాయి. అయితే, ఈ సారూప్యత ఇక్కడితోనే ముగుస్తుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రైతులు మూడు కీలకమైన అంశాలను లేవనెత్తుతున్నారు. మొదటిది, తమ రాష్ట్రంలోని ప్రాజెక్టుల కోసం శ్రీశైలం జలాశయం నుంచి 'వరద లేదా మిగులు' జలాలను ఉపయోగిస్తున్నామని ఏపీ చెప్తున్నది. కానీ, తెలంగాణ రైతులు ఈ వాదనను ఖండిస్తున్నారు. కృష్ణా బేసిన్‌లోని మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ తదితర జిల్లాలు సాగు, తాగునీటి కోసం తండ్లాడుతున్నాయని, అలాంటప్పుడు 'మిగులు' అనే మాటెక్కడిదని, వాస్తవ పరిస్థితులను విస్మరిస్తూ 'మిగులు, వరద జలాలు' అనే మాట ఎత్తుకున్నారని తెలంగాణ రైతులు చెప్తున్నారు. రెండవది, క్షుణ్నంగా పరిశీలిస్తే ఏపీలోని హంద్రీ-నీవా సుజల స్రవంతి, గాలేరు-నగరి సుజల స్రవంతి పథకాలు; తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలేనన్నది సుస్పష్టం. కానీ, వీటిని చూసే, ప్రచారం చేసే కోణం మాత్రం భిన్నం. ఏపీలో వీటిని 'సుజల స్రవంతి' పథకాలని కవితాత్మకంగా పిలుస్తున్నారు. దాంతో సామాన్య పాఠకుల్లో సానుకూల వైఖరి కలుగుతున్నది. తెలంగాణలో మాత్రం 'లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు'గా అంటున్నారు. దీంతో ఇవి ఆర్థిక భారాన్ని మోపే ప్రాజెక్టులనే సందేశం ప్రజల్లోకి వెళ్తున్నది. మూడవది, తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టు అనేక ప్రాంతాలకు సాగునీరు అందించినప్పటికీ.. ఏపీలోని కుప్పం ప్రాంతానికి జలాలు చేరినప్పుడు కనిపించిన 'జలహారతి' దృశ్యాలు, అలాంటి ఉత్సాహభరిత వాతావరణం, సానుకూలత చాలా అరుదుగా కాళేశ్వరం విషయంలో కనిపిస్తుంది.

నీళ్లు - నిప్పు

(వ్యాసకర్త: ప్రొఫెసర్, సోషియాలజీ విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం)

(తరువాయి రేపటి సంచికలో..)

కాంగ్రెస్ క్షీణ దశ ప్రతినిధులు



టంకశాల అశోక్

140 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ క్షీణస్థితికి రాహుల్‌గాంధీ, హీనస్థితికి రేవంత్ రెడ్డి సంకేతాలుగా నిలుస్తున్నారు. ఒక సంస్థ గొప్పగా వెలిగిన దశలో ఆ కాలపు నాయకులు కూడా గొప్పగా ఉంటారు. ఆ సంస్థ కాలక్రమంలో క్షీణించటం మొదలైన తర్వాత, ఒక్కోసారి సమర్థులైనవారు రంగంలోకి వచ్చి సంస్థను తిరిగి గొప్పదిగా తీర్చిదిద్దగలరు. అట్లా కానప్పుడు సంస్థ క్షీణత కొనసాగి తాము ఆ క్షీణత్వానికి సంకేతాలుగా మిగులుతారు. రాహుల్‌గాంధీ పరిస్థితి ఆ విధంగా ఉంది. మరొకవైపు, క్షీణత్వం హీనత్వంగా మారేందుకు ఎక్కువ సమయం పట్టదు. అటువంటి హీనత్వానికి సంకేతంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలుస్తున్నారు.

వీరిద్దరి క్షీణత, హీనతలు ఏ విధంగా కనిపిస్తున్నాయో చర్చించేందుకు ముందు, కాంగ్రెస్ పార్టీ క్రమంగా ఈ దశకు ఎందువల్ల చేరిందో అర్థం చేసుకోవటం అవసరం. రాహుల్, రేవంత్‌లను ఎంత విమర్శించినా మనం ముందుగా కొన్ని విషయాలు తెలుసుకోవాలి. 140 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ క్షీణత గాని, హీనత గాని వీరితో మొదలుకాలేదు. ఆశ్చర్యం కలగవచ్చు గాని, అందుకు ఆరంభం మొదటి ప్రధానమంత్రి నెహ్రూ ప్రగతిశీల విధానాలను అప్పటి దేశవ్యాప్త ఫ్యూడల్ శక్తులు అడుగడుగునా విఫలం చేయటంతో జరిగింది. తన భూ సంస్కరణలు, పంచాయతీరాజ్, సహకార విధానం, రిజర్వేషన్లు, బ్యాంకుల పరపతి విధానం, పంచవర్ష ప్రణాళికల వంటివి ఆ శక్తుల మూలంగా విఫలం కానట్టయితే, ఒకవైపు గ్రామ సీమల నుంచి మొదలుకొని దేశం అభివృద్ధి చెందటం, మరొకవైపు తన నాయకత్వాన కొత్త శక్తులు కాంగ్రెస్‌లోకి ప్రవేశించి పార్టీ తన భవిష్యత్తు కోసం కూడా బలపడటం జరిగేవి. కానీ అది జరిగే సూచనలు కనిపించకపోవటంతో, 1952 నాటి మొదటి ఎన్నికల తర్వాత 1957లో రెండవ ఎన్నికలు వచ్చేసరికే పార్టీ అనేక రాష్ట్రాలలో ఓట్లు, సీట్లు కోల్పోయింది. కేరళలో అధికారం సైతం పోగొట్టుకుంది.

> **తర్వాత 1960లలో ఇటు పట్టణాలలో ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగ యువకుల నుంచి, అటు గ్రామాలలో రైతులు, కూలీల నుంచి ఆందోళనలు ఉధృతంగా సాగాయి. 1967 ఎన్నికలలో కాంగ్రెస్ లోక్‌సభ స్థానాలు 361 నుంచి 284కు పడిపోగా, 9 రాష్ట్రాలలో అధికారం కోల్పోయింది. అదే సంవత్సరం నక్సలైట్ ఉద్యమం మొదలైంది.**

ఇంకా వివరాలలోకి వెళ్లనక్కరలేదు గాని, అదే ధోరణి అటు ఇటుగా అప్పటినుంచి కొనసాగుతూ వస్తున్నది. ఈ రోజున కాంగ్రెస్ పార్టీ వరుసగా మూడవసారి కేంద్రంలో అధికారానికి రాలేకపోయింది. కేవలం మూడు రాష్ట్రాలలోనే ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలిగింది. ఈ మధ్యకాలపు ఎన్నికల వివరాలను అటుంచితే, ఒక ముఖ్యమైన మాట చెప్పుకోవాలి. 1957 ఎన్నికల పరాజయాలతో కాంగ్రెస్ నాయకులు దిగ్భ్రాంతికి గురికాగా, ఆ ఫలితాలను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలలో సమీక్షించిన నెహ్రూ ఒక విలువైన హెచ్చరిక చేశారు. ప్రజలు చైతన్యవంతులవుతున్నారని, దానితో పాటు వారికి ఓటు అనే ఆయుధం ఉందని, పరిస్థితులు అప్పటి వలెనే కొనసాగితే ఆ చైతన్యవంతులు తమ ఓటును వినియోగించి మనను పక్కకు తోసివేసి తమ దారిలో తాము ముందుకుపోగలరని అన్నారాయన. కానీ, ఆ హితవు కాంగ్రెస్‌ను ఆ స్థితికి తెచ్చిన శక్తుల చెవికెక్కలేదు. ఫలితం ఏమైందో పైన చెప్పుకొన్నాం. ఆ తర్వాత ఇందిరాగాంధీ తన అధికార పరిరక్షణ కోసం కొన్ని రాడికల్ నటనలు చేశారు గానీ, మౌలిక పరిస్థితులు మాత్రం నెహ్రూ ఆశించిన రీతిగా మారనందున కాంగ్రెస్ పతనావస్థ ఎప్పటివలెనే కొనసాగింది.



ఆ క్షీణస్థితి ఏయే రూపాలు తీసుకుంటూ వస్తున్నదో ఇక్కడ రాసుకోలేము గాని, కాంగ్రెస్‌ను నిజమైన అర్థంలో పునరుద్ధరించిన వారు ఎవరూ లేకపోయారు. నెహ్రూ ఆలోచించినట్టుగా ఫ్యూడల్ వ్యవస్థను, దాని బలిమిని నిర్మూలించకపోవటం కాంగ్రెస్‌కు ఒక పెద్ద ఎదురుదెబ్బ కాగా, 1990ల ఆర్థిక సంస్కరణలను విచక్షణారహితంగా భుజానికి ఎత్తుకోవటంతో మొదలైన దశ, దాని ప్రభావాలు మరొక పెద్ద ఎదురుదెబ్బగా మారాయి. ఆ రెండు దశలలో కలిపి అనేక సామాజిక వర్గాలు పార్టీకి దూరమయ్యాయి. నెహ్రూ వంటి సమగ్ర దార్శనికులు గల నాయకత్వం ఇక పార్టీకి ఎప్పుడూ రాలేదు. దృష్టి యావత్తూ ఎప్పటికప్పుడు అధికార రాజకీయాల చుట్టూ తిరిగే దశలోకి ప్రవేశించింది. అధికారానికి హామీ లేని స్థితి పెరిగిన కొద్దీ, అధికారం కోసమే సమస్త శక్తియుక్తులు ఒడ్డే స్థితి కూడా పెరుగుతూ పోయింది. ఒక గొప్ప చారిత్రక పాత్ర నిర్వహించిన కాంగ్రెస్ పార్టీకి ఇదంతా క్షీణ స్థితే. దేశ నిర్మాణం కోసం ఒక గొప్ప దార్శనికత ఉండిన పార్టీకి ఇది నిస్సందేహకరమైన క్షీణస్థితే.

మొదట ఒక మాట అనుకున్నాము. ఒక సంస్థ కాలక్రమంలో క్షీణించటం మొదలైన తర్వాత ఒక్కోసారి సమర్థులైనవారు రంగంలోకి వచ్చి సంస్థను తిరిగి గొప్పదిగా తీర్చిదిద్దగలరు. అట్లా కానప్పుడు సంస్థ క్షీణత కొనసాగి తాము ఆ క్షీణత్వానికి సంకేతాలుగా మిగులుతారని. ఇప్పుడు మనకు కాంగ్రెస్ విషయంలో గానీ, దానికి మకుటం లేని మహారాజుగా కేవలం ఆ వంశంలో తన పుట్టుక కారణంగా చెలామణి అవుతున్న రాహుల్‌గాంధీ విషయంలో గానీ కనిపిస్తున్నది సరిగా అదే. అవును సరిగా అదే. కాంగ్రెస్ పార్టీ ఇక తిరుగులేని విధంగా క్షీణదశలో ప్రవేశించింది. రాహుల్‌గాంధీ నిస్సందేహకరమైన రీతిలో దానికి క్షీణ సంకేతంగా మారారు. ఈ క్షీణతకు ఆరంభం తాను అనటం లేదు. కాని, వర్తమానంలో కొనసాగుదలకు మాత్రం తానే కారణం. ఎందుకంటే, ఆయనను 2004లో ప్రత్యక్ష రాజకీయాలలోకి ప్రవేశించినప్పటి నుంచి గమనిస్తున్నాం. ఇప్పటికి 21 సంవత్సరాలు. పూర్తిగా ఒక్క కొత్త తరం ఉనికిలోకి వచ్చిన సమయం. కాని ఆయనకు ఈ సుదీర్ఘ సమయంలో ఈ దేశం గురించి, సమాజం గురించి, ఆర్థిక-సామాజిక-రాజకీయ పరిస్థితుల గురించి, చరిత్ర గురించి, భవిష్యత్తు గురించి, కాంగ్రెస్ పార్టీ గురించి, దాని క్షీణత గురించి, పునర్నిర్మాణ వ్యూహం గురించి తగిన అవగాహనలు ఉన్నాయనే అభిప్రాయం ఎప్పుడూ కలగలేదు. అవసరమైన సమర్థతలు ఉన్నట్టు అంతకన్నా అనిపించలేదు. పార్టీలో తన మాటకు ఎంతమాత్రం ఎదురులేని ఒక వ్యక్తి పరిస్థితి 21 సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా ఇట్లా ఉన్నప్పుడు, ఇక ముమ్ముందు సమర్థునిగా మారవచ్చునేమో అన్న ఆలోచనే పెద్ద అవివేకం.

> **పోనీ కాంగ్రెస్‌ను అట్లా సరిదిద్దగలవారు మరెవరైనా ఉన్నారా? ఆ వంశంలో లేరు. వంశానికి బయట లేరు. ఉన్నా ఆ వంశం, దాని భక్తులు నిలవనివ్వరు. అదొక బందీ పార్టీ. దానిని బట్టి అంతిమంగా తేలుతున్నది, పార్టీకి ఈ క్షీణత ఒక స్థిరపడిన వాస్తవం. రాహుల్‌గాంధీ క్షీణ నాయకత్వం మరొక స్థిరపడిన వాస్తవం.**

ఇక్కడ ఒక ఆలోచన రావచ్చు. అది, ఐక్య సంఘటనల విషయం. ఒక పెద్ద పార్టీ క్షీణించి స్వీయశక్తిని కోల్పోయినప్పుడు ఇతర పార్టీలతో ఐక్య సంఘటనలు ఏర్పాటు చేసుకోవటం సర్వసాధారణం. కాంగ్రెస్ ఆ పని పలుమార్లు చేసింది. గెలిచినా, ఓడినా వాటిని నిలబెట్టుకున్నది. కానీ, రాహుల్‌గాంధీ నాయకత్వం మొదలైనాక ఆ విషయంలోనూ క్షీణదశ ఆరంభం కావటం గమనించదగినది. ప్రస్తుతం 'ఇండియా' కూటమి పరిస్థితినే గమనించండి. గత ఎన్నికలలో ఆ కూటమికి, దానితోపాటు కాంగ్రెస్‌కు మంచి ఫలితాలైతే వచ్చాయి గాని, కేవలం రాహుల్ అసమర్థత కారణంగా తర్వాత నుంచి కూటమి గందరగోళంగా మారింది. ఆయన తీరు పట్ల అసంతృప్తి ప్రకటించని పార్టీ ఒక్కటైనా లేకపోయింది. ఒకరు కూటమి నుంచి పూర్తిగా బయటకుపోగా, కొందరు ఆ మాట అనకున్నా సొంతంగా పోటీ చేస్తున్నారు. మామూలుగానైతే ఎక్కువ మాట్లాడని సీపీఎం వంటి పార్టీ గత ప్రధాన కార్యదర్శి, ఇప్పుడిక 'ఇండియా' కూటమి అనేదే లేదన్నారు. గత ఎన్నికల తర్వాత కూటమి ఒక్కసారైనా సమావేశం కాలేదని, దాని అజెండా ఏమిటో బోధపడటం లేదని ఎత్తిచూపారు. ఇన్నిన్ని జరుగుతున్నా రాహుల్‌గాంధీ నోరు విప్పటం లేదు. మరింత విచిత్రంగా, క్షేత్రస్థాయిలో ప్రజలకు పట్టని, వారి జీవిత సమస్యలతో నిమిత్తం లేని నినాదాలు ఏవో ఎత్తుకొని, భూమ్యాకాశాలను ఒకటి చేసే హంగామాలు సాగిస్తున్నారు. ఆయన గతంలోనూ ఇదే చేశారు. కాలానుగుణమైన ఒక నిర్దిష్ట ప్రణాళిక ఆయన నాయకత్వాన కాంగ్రెస్‌కు గాని, ఇండియా కూటమికి గాని నేటికీ లేదు. తనను ఆ 140 ఏండ్ల పార్టీ క్షీణ దశ ప్రతినిధి అనటం అందువల్లనే.

రేవంత్‌రెడ్డి విషయానికి వస్తే, ఒక క్షీణస్థితి హీనస్థితిగా పతనం కావటం గాని, క్షీణ నాయకుల అనుయాయులుగా హీన నాయకులు చెలామణిలోకి రావటం గాని ఒక తార్కికమైన సహజ పరిణామం. ఇటువంటి పరిణామాలు చోటుచేసుకున్నప్పుడు ఎవరో ఒకరు, లేదా ఎందరో కొందరు ఆ పతన స్థితికి హీన సంకేతాలుగా, ప్రతినిధులుగా రూపొందుతారు. ఆ విధంగా ప్రస్తుతం మనకు కనిపిస్తున్న ప్రముఖ పాత్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. తన తీరుతెన్నులలో ఈ క్షీణతలు, హీనతలు ఏ విధంగా ప్రతిఫలిస్తున్నాయో ప్రజలు అనునిత్యం గమనిస్తున్నదే. ఏవగించుకుంటున్నదే. ఆ విషయం తను గ్రహించలేనిది కాదు. కానీ, తనకు గతం నుంచి అబ్బిన సంస్కారం వల్ల కొంత కాగా, కాంగ్రెస్ క్షీణతకు ఫలితమైన హీనత తనలో కలగలిసి పోవటం వల్ల మరి కొంతగా ఆయన ఆ లక్షణాలకు బందీగా మారారు. ఆ హైన్యాన్ని అనుభవించి ఆనందిస్తున్నారు. క్షీణతలో స్వయంగా బందీ అయిన రాహుల్‌గాంధీ, ఈ హీనతను సరిదిద్దగల పరిస్థితి లేదు.

మొత్తంగా చూసినప్పుడు ఆ స్థాయిలో రాహుల్‌గాంధీ, ఈ స్థాయిలో రేవంత్‌రెడ్డిలు కలిసి, 140 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ క్షీణతకు, హీనతకు ప్రతినిధులుగా, సంకేతాలుగా ఇంకా చెప్పాలంటే పరిణామ కారకులుగా మారారు. ఆ విధంగా ఇది ఆ పార్టీ పతన చరిత్రలో ఒక సహజ, అనివార్య అధ్యాయం అవుతున్నది.



ఫిరాయింపులు.. పిల్లి మొగ్గలు!



డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238

> **పార్టీ ఫిరాయించిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విషయంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సుప్రీం కోర్టు విధించిన మూడు నెలల కౌంట్‌డౌన్ ఆగస్టు 1 నుంచి ప్రారంభమైంది. సదరు సభ్యులకు ఇటీవల స్పీకర్ నోటీసులు జారీచేశారు. పొంచి ఉన్న అనర్హత వేటును తప్పించుకోవడానికి 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలు సరికొత్త నాటకాలకు తెరలేపుతున్నారు. డొంక తిరుగుడు సమాధానాలతో తప్పించుకోవాలని చూస్తున్నారు. కానీ, వారిపై అనర్హత వేటు ఖాయమని ప్రజలు భావిస్తున్నారు.**

రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించడంలో, ప్రజాస్వామ్య సంప్రదాయాలను పాతాళానికి తొక్కడంలో ఆరితేరిన కాంగ్రెస్ తెలంగాణలో పచ్చి అబద్ధాలకు తెగబడుతున్నది. కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయమై స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో బీఆర్ఎస్ తొలుత హైకోర్టు, ఆపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. స్పీకర్ తన విచక్షణాధికారాలతో నిరవధిక కాలయాపన చేయడానికి వీల్లేదని, నిర్ణయాన్ని ఒక నియమిత కాల పరిధిలో ప్రకటించాల్సి ఉంటుందని, ఫిరాయింపు వ్యవహారం మూడు నెలల్లో తేల్చాలని సుప్రీం ఆదేశించింది. పర్యవసానంగా ఫిరాయించిన ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. దాంతో అసలు కథ రసకందాయంలో పడింది. ఆ 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరి కండువాలు కప్పుకొన్న దృశ్యాలను ప్రజలు చూశారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ రాజకీయ వేదికలపై వారు ప్రత్యక్షమయ్యారు. కరడుగట్టిన కాంగ్రెస్ నాయకులను తలదన్నేలా కాంగ్రెస్ అధిష్ఠానం పట్ల వినయ, విధేయతలు ప్రదర్శించారు. ఈ తతంగమంతా చూస్తున్న ప్రజలు వారంతా కాంగ్రెస్‌లో చేరారని నిర్ధారణకు ఎప్పుడో వచ్చారు. కానీ, ఫిరాయింపు ఎమ్మెల్యేలు నోటీసులు అందుకున్న తర్వాత బీఆర్ఎస్‌లోనే ఉన్నామని బుకాయిస్తూ నయవంచనకు పాల్పడుతున్నారు.

ఏం కాదులే అనుకున్న ఎమ్మెల్యేలంతా వ్యవహారం న్యాయస్థానాల దాకా వెళ్లడంతో మాట మార్చడం మొదలుపెట్టారు. 'తమ నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిని కలిశాం' అని, 'కప్పింది కాంగ్రెస్ కండువా కాదు శేష వస్త్రం' అని, 'కప్పింది జాతీయజెండా' అని, 'ముఖ్యమంత్రి కండువా కప్పితే కాదనగలమా' అని, 'అనుమతి లేకుండా కాంగ్రెస్ పార్టీ తన ఫొటోలు ఫ్లెక్సీల్లో పెట్టినందుకు పోలీస్ కంప్లైంట్ కూడా ఇచ్చాం' అని, ఏ పార్టీలో ఉన్నారని మీడియా అడిగితే 'ఏ పార్టీలో ఉండాలో ఆ పార్టీలోనే ఉన్నాను' అని, 'తమ ఇంట్లో కేసీఆర్ ఫొటో ఉంది' అని ఇలా రకరకాల పిల్లిమొగ్గలు వేస్తూ సభ్య సమాజాన్ని మభ్యపెట్టాలని చూస్తున్నారు. పదవి నిలుపుకోవాలన్న వారి తాపత్రయం వెనుక భయం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఇంతకాలం ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లోని తమ ఖాతాల్లో దర్జాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కండువా కప్పుతున్న ఫొటోలు, వీడియోలను పెట్టుకున్న వీరు ఆదరా బాదరాగా ఇప్పుడు వాటిని తొలగిస్తున్నారు. అసెంబ్లీ లెక్కల్లో బీఆర్ఎస్ సభ్యులు 38గా నమోదైందని, తమ జీతాల నుంచి నెలకు రూ. 5 వేల చొప్పున బీఆర్ఎస్ ఖాతాలో జమవుతున్నాయని మరో కొత్తవాదన ముందుకుతెచ్చారు. ఇంకా నయం 'మా ఇంట్లో గులాబీ మొక్కలున్నాయి కాబట్టి, మేం బీఆర్ఎస్' అని, 'కార్లలో తిరుగుతున్నాం కాబట్టి మాది కారు గుర్తు' అని అనడం లేదు. ఈ 10 మంది మాత్రమే తాము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమే అని చెప్పుకోవడానికి ఇన్ని సర్కస్ ఫీట్లు ఎందుకు చేయాల్సి వస్తుందంటే.. అనర్హత ప్రమాద ఘంటికలు వారి చెవుల్లో మార్మోగుతున్నాయి కాబట్టి.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎవరికి ఏమీ కాదు, ఉప ఎన్నికలు రావు' అని ఫిరాయింపు ఎమ్మెల్యేలకు భరోసా ఇచ్చినప్పుడే, అవును వారంతా మా పార్టీలో చేరారని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ధ్రువీకరించినప్పుడే ఫిరాయింపు ఎమ్మెల్యేలు అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి ఏదో కపట మంత్రాంగం సిద్ధమైనట్టు విదితమైంది. అధినేతలు పాలన గాలికి వదిలేసి అదే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహానికి కేటాయించిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని నెలకొల్పి స్వామి భక్తిని చాటుకున్న రేవంత్ నిరంతర రాజీవ్ భజనలో తరిస్తూ ప్రధానిగా అదే రాజీవ్‌గాంధీ తెచ్చిన ఫిరాయింపు నిరోధక చట్టానికి తూట్లు పొడవడం విషాదం. గత అసెంబ్లీ ఎన్నికల సభలో 'ఫిరాయింపుదారులను రాళ్లతో కొట్టండి మీ వెంట నేనుంటా' అన్న రేవంత్‌రెడ్డి ఆ మాట మర్చిపోయారనుకోవాలా? రాహుల్‌గాంధీకి ఇదంతా తెలియదనుకోవాలా? లేక ఆయన కూడా తన తండ్రి ఆశయాలను అటకెక్కించారనుకోవాలా? 20 నెలలుగా జరుగుతున్న ఫిరాయింపుల వ్యవహారం వివాదం ఆసాంతం స్పీకర్‌కు తెలిసిందే. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా చరిత్రలో నిలిచిపోతుంది. అయితే అదెలా ఉండబోతున్నదన్నదే శేష ప్రశ్న. ఫిరాయింపుదారులపై స్పీకర్ అనర్హత వేటు వేసినా లేక రాహుల్‌గాంధీ వారిని వెంటనే పదవులకు రాజీనామా చేయాలని ఆదేశించినా కథ సుఖాంతమవుతుంది. గతంలో ఇలాంటి వివాదాలెన్నో తలెత్తినా సుప్రీంకోర్టు కన్నెర్ర చేసేంత తీవ్రస్థాయికి వెళ్లలేదు. రాజ్యాంగవేత్తలు, న్యాయశాస్త్ర కోవిదులు, చట్టసభల సభ్యులు, ప్రజాస్వామికవాదులు, బుద్ధిజీవులు వెరసి దేశం యావత్తు ఆసక్తిగా ఎదురుచూస్తున్న పతాక సన్నివేశం ఇది.



సకల జనుల సమరం





సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి హరీశ్‌రావును కలిసిన కొండాపూర్ మండలానికి చెందిన ట్రిపుల్ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులు

ట్రిపుల్ఆర్ రేవంత్ ఇంటి వ్యవహారం కాదు

- అలైన్‌మెంట్ మార్పుపై సమగ్ర విచారణ జరిపించాలి
- హరీశ్‌రావు డిమాండ్
- అలైన్‌మెంట్‌ను మార్చి మా కడుపు కొడుతున్నరు
- భూములు కోల్పోకుండా మాకు న్యాయం జరిపించండి
- హరీశ్‌రావుకు కొండాపూర్ మండల రైతుల వినతి

సంగారెడ్డి, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి వ్యవహారం కాదని రైతుల ప్రయోజనాలు దెబ్బతీసే చర్యలు ఆపకపోతే బీఆర్ఎస్ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు హెచ్చరించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న కొండాపూర్ మండలం రైతులు సోమవారం హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను ఇష్టారాజ్యంగా మారుస్తూ తమ కడుపుకొట్టే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో తాము భూములు కోల్పోకుండా అలైన్‌మెంట్‌లో మార్పులు చేసే విధంగా తమ పక్షాన రేవంత్ సర్కార్‌ను నిలదీయాలని కోరారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. ట్రిపుల్ ఆర్ కోసం భూసేకరణ విషయంలో కొండాపూర్ రైతులు ఆందోళన చెందవద్దని, రైతులు భూములు కోల్పోకుండా బీఆర్ఎస్ పార్టీ, తాను అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను ఇష్టారాజ్యంగా మారుస్తూ రైతుల పొట్టకొట్టడం దుర్మార్గం అని అన్నారు. కాంగ్రెస్ అనాలోచిత చర్యలవల్ల రైతులు పంట భూములను కోల్పోయే పరిస్థితి నెలకొందని చెప్పారు. ఉత్తరభాగాన ఆలైన్‌మెంట్ మార్పు వల్ల కొండాపూర్ మండలంలోని గిర్మాపూర్, తుమ్మరపల్లి, ఆలియాబాద్, మారేపల్లి, రాండాపూర్‌తండా, గొటీలగుట్టతండా, మాచేపల్లితండా, శివన్నగూడెం, గంగారం గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్టు చెప్పారు. గంగారం, శివన్నగూడెం గ్రామాల్లోని రైతులు మొత్తం భూములను కోల్పోతున్నారని తెలిపారు. ట్రిపుల్ఆర్ ఆలైన్‌మెంట్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం చేవెళ్ల –గిర్మాపూర్ మీదుగా ప్రతిపాదించిందని గుర్తుచేశారు. కానీ రేవంత్‌రెడ్డి తన స్వలాభం కోసం వికారాబాద్, పరిగి, కొడంగల్ మీదుగా ట్రిపుల్ ఆర్ మార్గాన్ని అష్టవంకరలుగా తిప్పుతూ పచ్చటి పొలాలను మాయం చేసే కుట్రకు తెరలేపారని మండిపడ్డారు. ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్‌కు మధ్య 40 కిలోమీటర్ల దూరం ఉండాలని, కానీ 23 కిలోమీటర్ల దూరంలోనే ప్రతిపాదిస్తున్నారని చెప్పారు. సొంతభూములకు మేలు కలిగేలా సీఎం అలైన్‌మెంట్‌ను అడ్డగోలుగా మార్చారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ కండ్లు తెరిచి ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టుపై రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఆలైన్‌మెంట్ మార్పుపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. హరీశ్‌రావును కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, ఎంఏ హకీం, ఎం విఠల్, శ్రీధర్‌రెడ్డి, మల్లేశం, గోవర్ధన్‌రెడ్డి, వినోద్, చంద్రయ్య, ఆంజనేయులు, మాణిక్యప్రభు, పరమేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో 'డంబెల్' మోత!

- చౌటుప్పల్‌లో జంక్షన్ డబుల్
- పాత అలైన్‌మెంట్‌లో మార్పు
- 181 ఎకరాలకు పెరిగిన జంక్షన్
- దీంతో భూబాధితులు రెట్టింపు
- దక్షిణభాగం పైనా 'పెద్దల' జోక్యం
- ప్రభుత్వ తీరుపై ట్రిపుల్ ఆర్ బాధితుల్లో ఆగ్రహజ్వాలలు



నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌లో రోజుకో కొత్త కోణం వెలుగులోకి వస్తున్నది. ఉత్తరభాగంలోని పలుచోట్ల కేంద్రం రూపొందించిన అలైన్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తమకు అనుకూలంగా మార్చుకున్నారన్న ఆరోపణలు ఇప్పటికే ఉండగా, తాజాగా ప్రకటించిన దక్షిణభాగం అలైన్‌మెంట్‌లోనూ ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకున్నట్టు తెలిసింది. చౌటుప్పల్ నుంచి మొదలయ్యే దక్షిణభాగంలో ఇప్పటికే సర్వే చేసిన రూట్లలో కాకుండా మరో రూట్‌లో అలైన్‌మెంట్‌ను ఖరారు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ ప్రాంత రైతుల్లో ఆందోళన మొదలైంది. గత నెల 30న ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను విడుదల చేస్తూ హెచ్ఎండీఏ ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీచేసింది. దీనిపై ఈ నెల 15వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్టు ప్రకటించింది. బాధిత రైతులు దీనిని తమ ఆందోళనకు వేదికగా మార్చుకోవడంతో అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయం రైతుల ఆందోళనతో అట్టుడుకుతున్నది. చౌటుప్పల్‌ను ఆనుకుని తూర్పున హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై రీజినల్ రింగ్‌రోడ్డులో ఉత్తర, దక్షిణ భాగాలు కలిపే జంక్షన్‌ను ప్రతిపాదించారు. ఈ జంక్షన్ చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోనే ఏర్పాటు కానుంది. గతంలో ఉత్తర భాగం అలైన్‌మెంట్ ఖరారు చేసే క్రమంలో కేంద్రం ఇక్కడ జంక్షన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాహనాల ఇంటర్‌చేంజ్ వ్యవస్థ కోసం, సర్వీసు రోడ్లు తదితర అవసరాల కోసం 78 ఎకరాల భూమి అవసరం అవుతుందని ప్రకటించింది. దానికి అనుగుణంగా అప్పట్లో సర్వే బృందాలు మార్కింగ్ చేసి స్థానికులకు చెప్పాయి. ఈ అలైన్‌మెంట్‌తో కొన్ని వ్యవసాయ భూములతోపాటు ప్లాట్లు, ఇండ్లు పోతున్నాయి. ఇందులో భూములు, ప్లాట్లు పోతున్నవారిలో కొందరు ప్రతిపాదిత జంక్షన్ ఏరియా దాటి ఇండ్ల కోసం ప్లాట్లు కొనుగోలు చేసి ఇండ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.

ఉన్నట్టుండి రెండింతలు పెరిగిన జంక్షన్

జంక్షన్‌ను 78 ఎకరాల్లో నిర్మించాలని తొలుత నిర్ణయించగా, ఇక్కడ డంబెల్ ఆకారంలో 181 ఎకరాల్లో జంక్షన్ నిర్మించాలని నిరుడు ఆగస్టులో ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. దీంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ ట్రిపుల్ ఆర్ తూర్పు, పడమర భాగాలుగా చీలిపోనుంది. 1,2,3 వార్డుల పరిధిలోని లింగారెడ్డిగూడెం, తాళ్లసింగారం, లింగోజీగూడెం ట్రిపుల్ఆర్ మరోవైపునకు వెళ్లనున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో చౌటుప్పల్ జంక్షన్‌ను హైవేకు ఇరువైపులా 1,350 మీటర్ల పొడవుతో డంబెల్ ఆకారంలో నిర్మించనున్నారు. దీనివల్ల ఇరువైపులా కలిపి రైతుల నుంచి అదనంగా 103 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుంది. ఈ కారణంగా బాధితుల సంఖ్య భారీగా పెరిగింది. పాత అలైన్‌మెంట్ ప్రకారం భూములు తీసుకుంటే తమకు కొన్నైనా మిగిలేవని, కానీ, ఇప్పుడు కొత్త అలైన్‌మెంట్‌తో భూములన్నీ పోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ జోక్యంతోనే..

గత ప్రభుత్వ హయాంలో దక్షిణభాగం అలైన్‌మెంట్‌ను కేంద్రం ఫైనల్ చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పెద్దలు ఇందులో జోక్యం చేసుకోవడం మొదలుపెట్టారు. చౌటుప్పల్ నుంచి చేవెళ్ల మీదుగా కంది వరకు గల దక్షిణభాగంలోనూ గతంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రాథమిక సర్వే జరిపి అలైన్‌మెంట్‌ను సిద్ధం చేశారు. అయితే దీన్ని కాదంటూ రాష్ట్ర ప్రభుత్వం 'సొంత' అవసరాల పేరిట అలైన్‌మెంట్‌లో ఇష్టారాజ్యంగా మార్పులకు సిద్ధపడింది. అందులో భాగమే చౌటుప్పల వద్ద జంక్షన్ విస్తరణ అని తెలిసింది. దీనికి అనుబంధంగా తాజాగా హెచ్ఎండీఏ ప్రకటించిన దక్షిణభాగం అలైన్‌మెంట్ కూడా ఇందులో భాగమేనన్న చర్చ జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వ జోక్యంతో అలైన్‌మెంట్ పలుచోట్ల ప్రభుత్వ పెద్దలకు అనుగుణంగా వంకర్లు తిరిగినట్టు అనుమానాలు వ్యక్తమువుతున్నాయి. చాలా చోట్ల ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ట్రిపులార్‌కు 35 నుంచి 40 కిలోమీటర్ల దూరం ఉంటే చౌటుప్పల్‌తో పాటు దక్షిణ భాగంలో పలు చోట్ల 27–35 కిలోమీటర్లకే కుదించుకుపోయిందని అలైన్‌మెంట్‌ను పరిశీలిస్తే అర్థం అవుతుంది. ఇదే అంశం బాధిత రైతుల్లో ఆగ్రహావేశాలకు కారణం అవుతున్నది. అందుకే నిత్యం రోడ్లెక్కుతున్నారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే ట్రిపుల్ఆర్ నిర్మాణం చేపట్టాలని, లేదంటే మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు రూ. 60 లక్షల నుంచి కోటి రూపాయల వరకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

'పెద్దల కమాల్'పై అన్నదాత ఆగ్రహం

- ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పుపై పోరుకు రైతులు సిద్ధం
- ఆమనగల్లు జేఏసీ విచ్ఛిన్నానికి కుట్ర
- ప్రకంపనలు సృష్టించిన 'నమస్తే తెలంగాణ' కథనం
- కందుకూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన



కందుకూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/రంగారెడ్డి, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లాలో రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పుపై బాధిత గ్రామాల రైతులు భగ్గుమంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పెద్దలు కొందరు తమ ప్రయోజనాల కోసం మార్చడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చడం వల్ల సన్న, చిన్నకారు రైతులు ఉన్న ఒకట్రెండెకరాల భూమిని కోల్పోతున్నారు. ఈ క్రమంలో సర్కారు పెద్దల కమాల్‌పై సోమవారం 'నమస్తే తెలంగాణ' 'పెద్దల కమాల్.. పేద రైతుల భూములు ఢమాల్' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. ఈ కథనంపై గ్రామాల్లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. మార్చి న అలైన్‌మెంట్‌ను ఉపసంహరించుకొని, పాత అలైన్‌మెంట్‌ను కొనసాగించాలని బాధిత గ్రామాల రైతులు, ఆయా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల ముందు ఆందోళన చేపట్టారు. మరి కొందరు రైతులు నగరంలోని హెచ్ఎండీఏ కార్యాలయానికి వెళ్లి నిరసన వ్యక్తంచేశారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి త్వరలోనే జేఏసీని ఏర్పాటు చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు.

బయటపెట్టిన 'నమస్తే తెలంగాణ'

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు వెనుక ఉన్న అనేక కుట్ర కోణాలను 'నమస్తే తెలంగాణ' బయటపెట్టింది. ప్రధానంగా 'ముఖ్య' నేత బంధువులతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేల భూముల్ని కాపాడేందుకు పేద రైతుల భూముల్లో నుంచి అలైన్‌మెంట్‌ను మార్చినట్టు బయటపెట్టింది. దీంతో బాధిత రైతులు కాంగ్రెస్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రధానంగా ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల ప్రాంతాల్లో బాధితులంతా సన్న, చిన్నకారు రైతులే. ప్రభుత్వ పెద్దల కోసం తమకు జీవనాధారంగా ఉన్న భూముల్ని ఎలా గుంజుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో తమ భూముల్ని కాపాడుకునేందుకు ఉమ్మడిగా పోరాడేందుకు సిద్ధమవుతున్నారు.

కందుకూరు ఆర్డీవోకు వినతిపత్రం

ట్రిపుల్ ఆర్ కొత్త అలైన్‌మెంట్‌ను మార్చాలని తలకొండపల్లి మండలం చంద్రదాన, కేశంపేట మండలంలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన అనేకమంది రైతులు కందుకూరు ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. కొత్త అలైన్‌మెంట్‌ను ఉపసంహరించుకుని పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలిసొచ్చే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



పెద్దపల్లిలో ఏడీఈ అన్నపూర్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు

నేటి నుంచి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల సమ్మె

జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

పెద్దపల్లి, సెప్టెంబర్ 15: టీజీఎన్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్తు మరమ్మతు పనులు చేసే ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు మంగళవారం నుంచి సమ్మె బాట పట్టనున్నారు. స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్ (ఎస్ఎస్ఆర్) పెంచాలని డిమాండ్ చేస్తూ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టే సమ్మెతో ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 విద్యుత్తు సర్కిళ్లలో విద్యుత్తు మరమ్మతు పనులు నిలిచిపోనున్నాయి. దీంతో విద్యుత్తు సరఫరాలో సమస్యలు తలెత్తనున్నాయి. ఎస్ఎస్ఆర్ రేట్లు పెంచాలని ఎన్పీడీసీఎల్ సీఎండీకి వినతిపత్రాలు అందించి, చర్చించినా ఫలితం లేకపోవడంతో సమ్మెలోకి వెళ్తున్నామని అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అలుగుబెల్లి కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం పెద్దపల్లి సర్కిల్ ఆఫీస్‌లో ఏడీఈ (టెక్నికల్) అన్నపూర్ణకు వినతిపత్రం అందజేశారు.



ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ నారాయణపురం మండలంలోని దేవిరెడ్డి బంగ్లావద్ద భూములు కోల్పోతున్న రైతుల రాస్తారోకో

రాజుకున్న ట్రిపుల్ ఆర్ నిప్పు

మూడోపేజీ తరువాయి...

ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు నిర్మాణం జరగాలని వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. అధికారులు తమ గోడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పాత అలైన్‌మెంట్ విధానంలోనే భూసేకరణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దరఖాస్తులను కనీసం పరిశీలించడంలేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ సర్కారు తమ పొట్ట కొడుతున్నదని వాపోతున్నారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు కారణంగా చిన్న, సన్న కారు రైతులకే ఎక్కువ నష్టం ఉందని, ఉన్న కొద్దిపాటి భూమిని లాక్కుంటే జీవనోపాధి కోల్పోతామని కంటతడి పెడుతున్నారు.

దళితుల భూములే లక్ష్యమా?

దళితులు, బడుగు, బలహీనవర్గాల వ్యవసాయ భూములను లాక్కోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కారు ఆలైన్‌మెంట్ మార్పులు చేసిందని రైతులు మండిపడుతున్నారు. సంగారెడ్డి జిల్లా నుంచి వచ్చిన రైతులు పాత ఆలైన్‌మెంట్ ద్వారా కేవలం సర్కారు భూములు మాత్రమే ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టులో కలుస్తుండేవని, ఆలైన్‌మెంట్ మార్చడంతో జిల్లా పరిధిలోని 5 మండలాల పరిధిలో కేవలం దళితులకు కేటాయించిన, సాగుపై జీవనోపాధినిచ్చే భూములు మాత్రమే ప్రాజెక్టులో పోతున్నాయంటూ సంగారెడ్డి జిల్లాకు చెందిన రైతులు మండిపడ్డారు. నిజానికి కాంగ్రెస్ సర్కారు ఆలైన్‌మెంట్‌లో మార్పులు చేయకపోతే వేలాది మంది చిన్న, సన్నకారు రైతుల భూములకు విలువతో పాటు, సాగు చేసుకునే అవకాశం ఉండేదని చెప్పారు. కానీ ఉద్దేశపూర్వకంగా చేసిన మార్పులతో తమకు జీవనాధారమే లేకుండా పోతుందని విలపిస్తున్నారు. చౌటుప్పల్ సమీపంలోని మర్రిగూడెం నుంచి వచ్చిన ఓ రైతు ఉదయాన్నే హెచ్ఎండీఏ కార్యాలయానికి వస్తే... సాయంత్రం వరకు అధికారులను కలిసేందుకు అనుమతించలేదు. వందలాది మంది రైతుల నుంచి తీసుకుంటున్న వినతి పత్రాలకు కనీస రక్షణ లేకుండా పోయిందని రైతులు చెప్తున్నారు. హెచ్ఎండీఏ స్టాంప్ వేసి పంపిస్తున్నారని, కనీస వివరాలు కూడా అందించడం లేదని వాపోతున్నారు. మరోవైపు, వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని చిట్టిగిద్ద, చంచల్‌పేట, దాదాపూర్, యావాపూర్ తదితర గ్రామాల ప్రజలు స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన తెలిపి ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ నిర్మాణం వల్ల నిరుపేదలు సాగుభూములు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

చెరువులపై మా హక్కులు కాపాడండి

జగిత్యాల ప్రజావాణిలో పెట్రోల్ డబ్బాలతో నిరసన

జగిత్యాల, సెప్టెంబర్ 15: చెరువులపై ఆధారపడి జీవించే తమ హక్కులను కాపాడాలని జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం కోనరావుపేట, కొండ్రికర్లకు చెందిన గంగపుత్రులు సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి ఎదుట పెట్రోల్ డబ్బాలతో ఆందోళన చేశారు. గమనించిన పోలీస్ సిబ్బంది వారి నుంచి పెట్రోల్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. టౌన్ సీఐ కరుణాకర్ వచ్చి ఆందోళన విరమింపజేశారు. గంగపుత్రులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి తమ గోడు వెల్లబోసుకున్నారు.



జగిత్యాల కలెక్టరేట్‌లో ధర్నా చేస్తున్న గంగపుత్రులు

మీ చుట్టూ ఇంకెన్నాళ్లు తిప్పుకుంటరు?

- కరీంనగర్ ప్రజావాణిలో మహిళ బైఠాయింపు
- బలవంతంగా ఎత్తుకెళ్లిన పోలీసులు



కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియం నుంచి బయటకు ఎత్తుకెళ్తున్న మహిళా పోలీసులు

కరీంనగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 15 : 'మీ చుట్టూ ఇంకెన్నాళ్లు తిప్పుకుంటరు.. ఏదో ఒకటి తేల్చండి.. లేకపోతే ఇక్కడి నుంచి కదిలేదు లేదు' అంటూ సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ప్రజావాణిలో ఓ మహిళ బైఠాయించింది. రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల తీరుపై శాపనార్థాలు పెట్టగా, ఆమెను పోలీసులు బలవంతంగా ఎత్తుకెళ్లి బయట వదిలిపెట్టారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం పోచంపల్లికి చెందిన పిల్లి భారతి కుటుంబానికి గ్రామంలో మూడెకరాలు ఉండగా, ఊరి చెరువు వెడల్పులో ఆ భూమి అందులో కలిసింది. దీంతో ఉన్నతాధికారులను కలిసి వేడుకోవడంతో నగరంలోని హస్నాపూర్‌కాలనీలో మూడు గుంటల ఇంటి స్థలంతోపాటు భారతికి కలెక్టరేట్‌లో ఉద్యోగం కల్పిస్తూ, అప్పటి అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. అధికారులు ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకోగా, నెల రోజులపాటు మాత్రమే ఉద్యోగం చేసి, అనంతరం అనారోగ్య కారణాలతో మానేసింది. తన కొడుకు ఎదిగిరావడంతో అతడికి తన ఉద్యోగం ఇప్పించాలని కొన్ని నెలల క్రితం కలెక్టర్‌ను కోరింది. నీటిపారుదల శాఖలో అవకాశం కల్పించాలంటూ కలెక్టర్ ఆదేశించినా అధికారులు పట్టించుకోలేదు. మరోవైపు తనకిచ్చిన ఇంటి స్థలంలో కట్టుకున్న ఇల్లు కూల్చివేస్తామంటూ అధికారులు నోటీసులిచ్చారని సోమవారం ప్రజావాణిలో మరోసారి ఫిర్యాదు చేసింది. విచారిస్తానంటూ కలెక్టర్ చెప్పగా , తాను నెలల తరబడి తిరుగుతున్నానని, సీఎంకు కూడా ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని వాపోయింది.

రైతు ఆక్రోశం

- తన భూమి ఓఆర్సీ చేయడం లేదని మనస్తాపం
- పాలమూరులో ఆటోకు నిప్పంటించి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన బాధిత రైతు. చిత్రంలో ఆయన భార్య, కుమార్తె

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 15: తన భూమిని తహసీల్దార్, ఆర్ఐ రిజిస్ట్రేషన్ చేయకపోగా, డబ్బుల కోసం ఇబ్బందులకు గురిచేయడంతో మనస్తాపం చెందిన రైతు తన ఆటోకు నిప్పంటించి కటుంబం సహా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పాలమూరు జిల్లాలో చోటు చేసుకున్నది. దేవరకద్ర మండలం బస్వాయిపల్లికి చెందిన రైతు శంకర్ వారసత్వంగా ఉన్న భూమిని ఓఆర్సీ కోసం జూలైలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. ఆర్డీవో కార్యాలయంలో సంప్రదించగా తన దరఖాస్తు వచ్చిందని, మాన్యువల్‌గా తీసుకురావాలని అధికారులు సూచించారు. దీంతో దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సిఫారసు చేసిన కాగితాలు ఇవ్వాలని కోరగా అధికారులు స్పందించలేదు. దీంతో విసుగుచెంది భార్య, ముగ్గురు ఆడపిల్లలతో కలిసి మహబూబ్‌నగర్ అంబేద్కర్ చౌరస్తాకు చేరుకొని తన ఆటోపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అనంతరం తనపై కూడా పెట్రోల్ పోసుకొని, కుటుంబసభ్యులపై పోయడానికి యత్నించగా వారు అరవడంతో స్థానికులు అడ్డుకుని రైతు కుటుంబాన్ని రక్షించారు. ఈ ఘటనలో ఆటో మంటల్లో కాలిపోయింది.



సకల జనుల సమరం



• ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి వాహనం అడ్డగింత



ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు దివ్యాంగుల పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీకి వచ్చిన పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి వాహనాన్ని వారు అడ్డగించారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసి, తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. - తొర్రూరు



జగిత్యాల కలెక్టరేట్‌లో ధర్నా చేస్తున్న కొండ్రికర్ల, కోనరావుపేట గంగపుత్రులు

చెరువులపై మా హక్కులు కాపాడండి

- కొండ్రికర్ల, కోనరావుపేట గంగపుత్రుల వేడుకోలు
- జగిత్యాల ప్రజావాణిలో పెట్రోల్ డబ్బాలతో నిరసన

జగిత్యాల, సెప్టెంబర్ 15: చెరువులపై ఆధారపడి జీవించే తమ హక్కులను కాపాడాలని జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం కోనరావుపేట, కొండ్రికర్లకు చెందిన గంగపుత్రులు సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి ఎదుట పెట్రోల్ డబ్బాలతో ఆందోళన చేశారు. గమనించిన పోలీస్ సిబ్బంది వారి నుంచి పెట్రోల్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. టౌన్ సీఐ కరుణాకర్ వచ్చి ఆందోళన విరమింపజేశారు. గంగపుత్రులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి తమ గోడు వెల్లబోసుకున్నారు.

పింఛన్లు పెంచండి

- దివ్యాంగుల నిరసనలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 15: శాసనసభ ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలను ముట్టడించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా మాగనూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. రంగారెడ్డి జిల్లా యాచారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట దివ్యాంగులు, వృద్ధులు బైఠాయించారు.

నేటినుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

- ఇప్పటికీ సర్కారుతో కొలిక్కిరాని దవాఖానల చర్చలు
- ఆర్థిక శాఖ వద్ద డబ్బుల్లేవంటూ తేల్చిచెబుతున్న అధికారులు
- 1400 కోట్ల చెల్లింపులో కాంగ్రెస్ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం
- ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో బకాయిలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఒకవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు కాలేజీలు బంద్ పాటిస్తున్నాయి. అదే దారిలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ దవాఖానలు సైతం మంగళవారం అర్ధరాత్రి (11.59) నుంచి ఆరోగ్యశ్రీ సేవలను బంద్ చేయనున్నట్టు ప్రకటించాయి. 'ఆరోగ్యశ్రీ' కాంగ్రెస్ బ్రాండ్‌స్కీం అని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో గొప్పగా చెప్పుకున్నా.. నిధుల విడుదల్లో మాత్రం ప్రభుత్వం జాప్యం చేస్తున్నది. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ దవాఖానాలకు ప్రభుత్వం ఎనిమిది నెలలుగా రూ.1,400 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్), జర్నలిస్టుల ఆరోగ్య పథకం (జేహెచ్ఎస్) కింద అందిస్తున్న సేవలకుగాను చెల్లింపులు జరపకపోవడంతో దవాఖానల నిర్వహణ భారంగా మారిందని నెట్‌వర్క్ దవాఖానలు ఇప్పటికే ప్రభుత్వానికి పలుమార్లు మొరపెట్టుకున్నాయి. జనవరిలో రూ.1,100 కోట్ల బకాయిలు చెల్లించాలని నెట్‌వర్క్ దవాఖానలు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయగా.. రెండు నెలల్లో సమస్యను పరిష్కరిస్తామని ఆరోగ్య శాఖ మంత్రి, హెల్త్ సెక్రటరీ, ఆరోగ్యశ్రీ సీఈవో హామీ ఇవ్వడంతో సేవలను కొనసాగించారు. గ్రీన్‌చానల్ ద్వారా ప్రతి నెలా ఆరోగ్యశ్రీకి రూ.200 కోట్ల నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదు. 8 నెలలు గడిచినా.. ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆగస్టు 31న సేవలు బంద్ చేస్తామని అసోసియేషన్ మరోమారు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఒకవైపు అసెంబ్లీ జరుగుతుండగానే ఆరోగ్యశాఖ అధికారులు నెట్‌వర్క్ దవాఖానల అధ్యక్షుడికి ఫోన్ చేసి మరోసారి చర్చలకు రావాలని ఆహ్వానించారు. బకాయిల విషయంలో తమకు న్యాయంచేస్తారని నెట్‌వర్క్ దవాఖానల అసోసియేషన్ భావించగా.. ప్రభుత్వం చర్చల పేరిట రెండు వారాలకుపైగా కాలయాపన చేసింది. చర్చల్లో ఎలాంటి ముందడుగు పడకపోవడంతో 'ఆరోగ్యశ్రీ' సేవలను మంగళవారం అర్ధరాత్రి నుంచి బంద్ చేయాలని నెట్‌వర్క్ దవాఖానల అసోసియేషన్ నిర్ణయించింది. చర్చల సందర్భంగా ఉన్నతాధికారులు ఆర్థిక శాఖ డబ్బులు ఇవ్వకపోతే తామేం చేయాలని ప్రశ్నిస్తున్నారని అసోసియేషన్ ప్రతినిధులు వాపోయారు. ఇంకా అప్పులు తీసుకొచ్చి 'ఆరోగ్యశ్రీ' కోసం వెచ్చించలేమని చెప్తున్నారు. పెండింగ్ బకాయిల చెల్లింపులో కాంగ్రెస్ ప్రభుత్వం సాగదీత ధోరణి కారణంగా 'ఆరోగ్యశ్రీ' సేవలు నిలిచిపోతే ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారుతుందని వైద్య రంగ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

20 రోజులుగా సీఈవోతో చర్చలు

రాష్ట్రవ్యాప్తంగా 'ఆరోగ్యశ్రీ' సేవలను మంగళవారం అర్ధరాత్రి నుంచి నిలిపివేయనున్నట్టు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ దవాఖానల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డిరాజు రాకేశ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత 20 రోజులుగా ఆరోగ్యశాఖ మంత్రి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోతో చర్చలు జరుపుతున్న ట్టు తెలిపారు. తమ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ నెట్‌వర్క్ దవాఖానల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్టు వెల్లడించారు. సేవల నిలిపివేత కారణంగా ప్రజలకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నట్టు పేర్కొన్నారు.

నాన్ లోకల్ నిబంధన.. తెలంగాణ విద్యార్థినికి నష్టం

- నిబంధన తీసివేసి న్యాయం చేయాలని వేడుకోలు

కాసిపేట, సెప్టెంబర్ 15 : మెడిసిన్ సీట్‌లో నాన్ లోకల్ సమస్యలతో నష్టం జరుగుతున్నదని మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం సోమగూడెంకు చెందిన గొడిశెల లాస్య, ఆమె తల్లిదండ్రులు అంటున్నారు. లాస్య కుటుంబం తాతల కాలం నుంచి మంచిర్యాల జిల్లాలోనే నివసిస్తున్నది. ఇక్కడే 10వ తరగతి వరకు చదివి, ఇంటర్ రెండేండ్లు ఏపీలోని విజయవాడలో చదివింది. నీట్‌లో 408 సాధించింది. ఎస్సీ విభాగంలో మెడిసిన్‌లో సీటు వచ్చే అవకాశం ఉండగా, ఇంటర్ ఏపీలో చదవడంతో నీట్ రాష్ట్ర కౌన్సిలింగ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే నాన్ లోకల్‌గా చూపిస్తున్నదన్నారు. తెలంగాణాలో జీవిస్తూ 10వ తరగతి వరకు ఇక్కడే చదివి కేవలం ఇంటర్ రెండేళ్లు బయటకు వెళ్లి వస్తే నాన్ లోకల్‌గా పరిగణిస్తే తమ భవిష్యత్తు ఏం కావాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

సమ్మె దిశగా రేషన్ డీలర్లు

- అక్టోబర్ 1 నుంచి దుకాణాల బంద్!
- సివిల్ సప్లయ్‌కు సమ్మె నోటీస్
- పేరుకుపోయిన కోట్ల బకాయిలు
- తన వాటా నిధులు విడుదల చేసిన కేంద్రం.. రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో పెండింగ్



హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): బకాయిల విడుదల కోసం ప్రభుత్వానికి విన్నపాలు చేసీచేసి విసిగిపోయిన రేషన్ డీలర్లు సమ్మె దిశగా అడుగులు వేస్తున్నారు. అక్టోబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాలను బంద్ చేస్తామని పేర్కొంటూ పౌరసరఫరాల శాఖకు సమ్మె నోటీసు కూడా ఇచ్చారు. అలాగే, అక్టోబర్ నెలకు సంబంధించి ప్రభుత్వం పంపించే బియ్యం స్టాక్‌ను దించుకునేది లేదని తేల్చి చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 6 నెలల బకాయిలు రూ. 100 కోట్లు వరకు చెల్లించాల్సి ఉంది. వీటిని చెల్లించాలని రేషన్ డీలర్లు పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రతినెల సొంత ఖర్చులతో బియ్యం పంపిణీ చేయాల్సి వస్తున్నదని, తమకు రావాల్సిన కమీషన్ రాకపోవడంతో అద్దె, కూలీలు, హమాలీ, ఇతర ఖర్చుల కోసం ఇబ్బంది ఉందని వాపోతున్నారు.

కేంద్రం ఇచ్చింది.. రాష్ట్రం ఇస్తలేదు

రేషన్ డీలర్ల కమీషన్‌కు సంబంధించిన నిధులను కేంద్రం విడుదల చేసినా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన వాటా నిధులను విడుదల చేయలేదని తెలిసింది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రూ. 75 కోట్లు, సెప్టెంబర్ నెలకు సంబంధించి రూ. 25 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్టు రేషన్ డీలర్లు తెలిపారు. రూ. 75 కోట్లలో కేంద్రం తన వాటా కింద రూ. రూ. 37.5 కోట్లను విడుదల చేసినట్టు తెలిసింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ. 37.5 కోట్లు విడుదల చేయాల్సి ఉంటుంది. కేంద్ర నిధులకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు జమ చేస్తేనే మొత్తం నిధులు విడుదలవుతాయి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇవ్వకపోవడంతో మొత్తం పెండింగ్‌లో పడినట్టు తెలిసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై రేషన్ డీలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం వద్ద రూ. 37.5 కోట్లు కూడా లేవా అని నిలదీస్తున్నారు. తమకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అటకెక్కించిందని మండిపడుతున్నారు. గౌరవ వేతనం రూ. 5 వేలు, కమీషన్‌ను రూ. 300 పెంచుతామనే హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నారు.

ఆర్టీసీ సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయండి

- ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీని నెరవేర్చండి
- సీఎంకు ఎంప్లాయీస్ యూనియన్ లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లపై ఉన్న ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మెయిల్ ద్వారా లేఖ పంపింది. ఆర్టీసీలో ఉద్యోగ సంఘాల రద్దుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగులు దశలవారీ పోరాటాలు సాగించారని యూనియన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు ఎస్ బాబు, ఈదురు వెంకన్న పేర్కొన్నారు. ఆర్టీసీ సంఘాలపై ఆంక్షలను ఎత్తివేస్తామని చెప్పి.. రెండేండ్లు గడుస్తున్నా, ఆ ఊసే ఎత్తడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రద్దయిన 9 ఉద్యోగ సంఘాలకు తిరిగి గుర్తింపునిస్తూ ఈ నెల 9న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి, అందులో ఆర్టీసీ సంఘాల గుర్తింపును విస్మరించడం పట్ల.. కార్మికవర్గం తీవ్ర అసహనానికి గురైందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపార్టుమెంట్లతోపాటు సింగరేణి, విద్యుత్తుశాఖ, వివిధ కార్పొరేషన్లలో సంఘాలను అనుమతిస్తూ.. ఆర్టీసీ సంఘాలను విస్మరించడం, డిపోలలో అధికారుల వేధింపులు, అణచివేతల వల్ల కార్మికవర్గం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని వాపోయారు. ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోకుండా కార్మిక సంఘాలపై వివక్ష చూపెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాబట్టి ఆర్టీసీ సంస్థకు ఒక్క పైసా కూడా ఖర్చు లేని, ఆర్థిక భారం అసలే లేని కార్మిక సంఘాలపై ఆంక్షలను వెంటనే ఎత్తివేసి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు.

రోజుకో కార్యక్రమం.. పూటకో శిక్షణ

- ఇలా అయితే పాఠాలు చెప్పేదెప్పుడు?
- ఆందోళన వ్యక్తంచేస్తున్న టీచర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని సర్కారు బడులు గాడితప్పుతున్నాయి. వరుసగా పాఠశాలల్లో ఏదో ఒక కార్యక్రమం నిర్వహించాల్సి రావడమే ఇందుకు కారణం. రోజుకో కార్యక్రమం.. పూటకో శిక్షణ అన్నట్టు.. రాష్ట్రంలోని బడుల పరిస్థితి తయారైంది. నెలలో ఆరేడు రోజులు సెలవులే ఉంటున్నాయి. ఈ క్రమంలో ఇది చేయండి.. అది చేయండి అంటూ ఆదేశాలు. దీంతో తాము చదువు చెప్పేదెప్పుడు.. విద్యార్థులు నేర్చుకునేదెప్పుడు? అని టీచర్లు ప్రశ్నిస్తున్నారు. ఆగస్టు నెలంతా వర్షాలు, వరదలు, వైరల్ ఫీవర్ సెలవులతోనే గడిచిపోయింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటపోటీలు, పాఠశాలల్లో మొక్కలు నాటడం, హిందీ దినోత్సవం, హౌజ్‌సిస్టం, స్టూడెంట్ కౌన్సిల్, ఇన్‌స్పైర్ నామినేషన్లు, హరిత విద్యాలయ రేటింగ్స్ వంటివి అంటగట్టారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు విద్యాబోధనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

డీఎల్ శిక్షణను వాయిదావేయండి : ఎస్టీయూ

రాష్ట్ర విద్యాశాఖ అధికారులు కార్యక్రమాలు, శిక్షణల పేరిట సమయాన్ని వృథా చేస్తున్నారని ఎస్టీయూ ఆరోపించింది. ఇలాంటి వాటికి ముగింపు పలకాలని కోరింది. సెప్టెంబర్‌లో ఇప్పటికే విలువైన కాలం గడిచిపోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎఫ్‌ఏ-1 పరీక్షలు, స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లున్నందున డిజిటల్ లెర్నింగ్(డీఎల్)శిక్షణ కార్యక్రమాన్ని వాయిదావేయాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు భీమనాథుని రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

317జీవో అమల్లో లోపాలను సవరిస్తాం : లక్ష్మణ్



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఎస్సీ గురుకుల సొసైటీలో 317 జీవో అమలు సందర్భంగా జరిగిన లోపాలను సవరిస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హామీ ఇచ్చినట్టు టిగారియా యూనియన్ నేతలు వెల్లడించారు. సోమవారం అడ్లూరి లక్ష్మణ్‌ను టిగారియా నేతలు కలిశారు. 317 జీవో అమలులో జరిగిన అవకతవకలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



ఖమ్మం నగరంలో గుత్తేదారులను అరెస్టు చేసిన పోలీసులు

గుత్తేదారుల ముందస్తు అరెస్టు

- హైదరాబాద్‌కు వెళ్తుండగా అదుపులోకి..

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 15 : హైదరాబాద్‌లో సోమవారం చేపట్టిన ధర్నాకు వెళ్తున్న పలువురు గుత్తేదారులను ఖమ్మం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు వెంటనే నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గుత్తేదారులు సోమవారం హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించారు. ఇందులో పాల్గొనేందుకు బయలుదేరిన కాంట్రాక్టర్లను ఖమ్మం నగరంలో అదుపులోకి తీసుకుని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు అదుపులో ఉంచుకొని ఆ తరువాత వ్యక్తిగత పూచీకత్తుపై వదిలి పెట్టారు.

నిరుద్యోగులతో పెట్టుకుంటే ఖబడ్దార్!

- మరో తెలంగాణ ఉద్యమం తప్పదు
- నోటిఫికేషన్లు వద్దంటూ ధర్నా ఎప్పుడు చేశాం?
- 20 వేల పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ తప్పనిసరిగా ఇవ్వాలి
- రిక్రూట్‌మెంట్ చూసే ఆంధ్రా అధికారిని తొలగించాలి
- మీడియాతో పోలీసు నిరుద్యోగుల జేఏసీ డిమాండ్



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పోలీసు నిరుద్యోగుల జేఏసీ నాయకులు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటే ఖబడ్దార్.. అంటూ పోలీసు నిరుద్యోగ జేఏసీ హెచ్చరించింది. కాంగ్రెస్ నేతల హామీలు నమ్మి ఒక ప్రభుత్వాన్ని పడగొట్టిన తమకు.. ఈ ప్రభుత్వాన్ని కూడా పడగొట్టడం పెద్ద విషయం కాదని హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పోలీసు నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి నోటిఫికేషన్లు వద్దంటూ నిరుద్యోగులు ధర్నా చేస్తున్నారని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'ఇన్నేండ్లలో ఎవరు అలా చేశారు? మీ స్థాయికి అవి తగిన వ్యాఖ్యలేనా?' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు అవుతున్నా.. ఒక్క భారీ ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానంతో ఇప్పుడు నాలుగేండ్లు తెలంగాణలో చదివిన వారు స్థానికులవుతారని, ఇప్పటికే మన ఉద్యోగాలు ఆంధ్రోళ్లకు వెళ్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా ఉన్న ఆంధ్రప్రాంత ఐపీఎస్ వీవీ శ్రీనివాసరావును అక్కడే కొనసాగించడం వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని చెప్పారు. జీవో-46 విషయంలో గత ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి.. తమను హైకోర్టు, సుప్రీంకోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఫేక్ సర్టిఫికెట్లు సమర్పించిన వారిని పోలీసు ఉద్యోగాలకు ఎంపికచేసిన బోర్డు చైర్మన్‌ను తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన ఎన్ని పోస్టులు అమ్ముకున్నారో విచారణ చేయించాలని కోరారు. తెలంగాణ ఉద్యోగాల్లో ఆంధ్రా అధికారుల పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. పరిస్థితి ఇలాగే ఉంటే తెలంగాణ బిడ్డలు ఉద్యోగాల కోసం తెలంగాణ ఉద్యమం తరహాలో మరో పోరాటం చేస్తామని హెచ్చరించారు. జీవో-46ను రద్దు చేస్తామని తమకు హామీ ఇచ్చిన కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, మల్లు రవి, అద్దంకి దయాకర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న, రియాజ్, ప్రొఫెసర్ కోదండరామ్, ఆకునూరి మురళి వంటి వారు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. జీవో-46 రద్దు కోసం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ ఏమైందని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను సుప్రీంకోర్టు మెట్లు ఎక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తమ తరఫున న్యాయవాదిని పెట్టాలని డిమాండ్ చేశారు.

20వేల పోలీసు ఉద్యోగాలివ్వాలి

తక్షణం 20 వేల పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని పోలీసు నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. వచ్చే నోటిఫికేషన్లలో జీవో-46ను టీజీఎస్పీ నుంచి మినహాయిస్తున్నట్టు ప్రకటించాలని కోరారు. పోలీసు ఫిజికల్ ఈవెంట్లలో మార్పులు చేయాలని, కొలతలు, ఎన్‌సీసీ, డ్రైవింగ్ వంటి విషయాల్లో ముందే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసు ఉద్యోగాలకు గరిష్ఠ వయో పరిమితిని 35 ఏండ్లకు పెంచాలని, తక్షణం పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌ను తొలగించాలని కోరారు. ముఖ్యంగా స్థానికతను 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పరిగణించాలని కోరారు. ఈ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు ఆకాశ్, శంకర్, నవీన్‌పట్నాయక్, వంశీ, శింబునాయక్, రాజు, వెంకట్, రవిప్రకాశ్, చంద్రశేఖర్, శ్రీనివాస్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీన్యూస్ జర్నలిస్టుపై కేసులు ఎత్తివేయండి

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్
- మంత్రి పొంగులేటి, డీజీపీ, అంబేద్కర్ విగ్రహానికి వినతి
- కేసులు ఎత్తివేయకపోతే ఐక్య పోరాటాలకు సిద్ధమని హెచ్చరిక



డీజీపీ జితేందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్ తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్న జర్నలిస్టులపై కక్షపూరితంగా కేసులు పెట్టడం దుర్మార్గమని, ఖమ్మం న్యూస్ ప్రతినిధి సాంబశివరావుపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్ డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్19(1) ఏ మీడియా స్వేచ్ఛ హక్కును హరించేలా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు సోమవారం తెమ్జూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ రమణకుమార్, కార్యవర్గంతో కలిసి లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని మినీ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డీజీపీ జితేందర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మారుతీసాగర్, రమణకుమార్ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను రిపోర్టు చేస్తున్న టీన్యూస్ బ్యూరో చీఫ్ సాంబశివరావుపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసు వివరాలు తెలుసుకొని సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని డీజీపీ తనను కలిసిన జర్నలిస్టు నాయకులకు హామీ ఇచ్చారు.

కేసులు తొలగించకపోతే ఐక్యపోరాటాలు

అనంతరం మారుతీసాగర్ మీడియాతో మాట్లాడుతూ.. జర్నలిస్టులపై కక్షపూరితంగా కేసులు పెట్టడం సిగ్గుచేటని మండిపడ్డారు. సాంబశివరావుపై కేసులు ఎత్తివేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి యోగానంద్, నవీన్‌కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాకేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్, కోశాధికారి బాబురావు, రాష్ట్ర నాయకులు సూరజ్ భరద్వాజ్, శివారెడ్డి, శ్రీధర్‌ప్రసాద్, భాస్కర్, చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

- టీయూడబ్ల్యూజే నాయకుల నిరసన

ఖమ్మం/ కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 15: ఖమ్మం జిల్లా కొణిజర్ల సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్న టీ న్యూస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి సాంబశివరావు, కెమెరామన్ నాగరాజుపై ప్రభుత్వం ఇటీవల పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. టీ న్యూస్ జర్నలిస్టులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) నాయకులు, ప్రెస్‌క్లబ్‌ల బాధ్యులు ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఖమ్మంలో టీజేఎఫ్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి, నల్ల జెండాలతో ర్యాలీ నిర్వహించారు. జడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. కొత్తగూడెంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తల్లాడ, కారేపల్లి ప్రెస్‌క్లబ్‌ల ఆధ్వర్యంలోనూ ఆయా మండలాల్లో అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందించి నిరసన తెలిపారు.



జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్), (ఐజేయూ) నాయకులు

టీన్యూస్ ప్రతినిధి కుటుంబానికి తాతా, సండ్ర పరామర్శ

టీ న్యూస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి సాంబశివరావు కుటుంబాన్ని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. ఖమ్మంలోని సాంబశివరావు ఇంటికి సోమవారం వెళ్లిన నేతలు.. కుటుంబ సభ్యులకు ధైర్యంచెప్పి, సాంబశివరావుపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్షకుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే యత్నం చేస్తున్న రైతు సంఘాల నాయకులు, జర్నలిస్టులపై ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయిస్తూ నిర్బంధించడం విచారకరమని చెప్పారు. సాంబశివరావుపై పెట్టిన కేసును తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.



సకల జనుల సమరం



• నిరసనకు దిగితే నిర్బంధమా?



కరీంనగర్ జిల్లా దుర్శేడులో రాజీవ్ రహదారిపై రైతులతో కలిసి ధర్నా చేసిన మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను అరెస్ట్ చేసి బలవంతంగా తరలిస్తున్న పోలీసులు



యూరియా కోసం కరీంనగర్ జిల్లా దుర్శేడులో సోమవారం బతుకమ్మ ఆటలు ఆడి వినూత్న నిరసన తెలిపిన మహిళలు. వీరికి మాజీ మంత్రి గంగుల కమలాకర్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మద్దతుగా నిలిచారు.

• నిరీక్షించి.. నీరసించి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు సొసైటీ వద్ద యూరియా కోసం బారులు తీరి, కార్యాలయంలోకి చొచ్చుకొచ్చిన రైతులు

యూరియా యూరియా.. ఇయ్యాలో!

అగ్రి సొసైటీల ముందు రైతుల పడిగాపులు

ఎక్కడికక్కడ ఆందోళనలు చేసిన రైతన్నలు

కాంగ్రెస్ సర్కారు తీరుపై నిరసనల వెల్లువ

జోరుగా సాగుతున్న బ్లాక్ మార్కెట్ దందా

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 15: పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన రైతులు... ఇంటిల్లిపాది యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి రాష్ట్రంలో నెలకొన్నది. అదనుదాటితే ఎరువు వేసినా ప్రయోజనం ఉండదని, దిగుబడి భారీగా తగ్గిపోతుందని కర్షకులు కన్నీటి పర్యంతమవుతున్నారు. యూరియా దొరుకుతుందన్న ఆశతో తెల్లవారగానే రైతువేదికలు, పీఏసీఎస్ కేంద్రాల వద్దకు పరుగులు తీస్తున్నారు. యూరియా రాలేదంటూ అధికారులు టోకెన్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. రమ్మన్న సమయానికి వచ్చినా కూడా ఇంకా లోడ్ రాలేదంటూ ముఖం చాటేస్తున్నారు. మరోవైపు రైతులకు ఇచ్చేందుకు ఎరువు కరువైందని ప్రభుత్వం చెప్తుంటే.. లారీలకు లారీల లోడ్ బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. యూరియా కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. వినూత్న రీతిలో నిరసనలు నిర్వహిస్తూ సర్కారుకు కనువిప్పు కలిగించేలా యూరియా సంచులతో బతుకమ్మ ఆడుతున్నారు.

• విసుగెత్తి రోడ్డెక్కిన రైతులు



యూరియా దొరకక అవస్థలు పడుతున్నామంటూ ఆవేదనతో వరంగల్ జిల్లా ఖానాపురంలో నర్సంపేట-మహబూబాబాద్ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించిన రైతులు, భారీగా నిలిచిపోయియిన వాహనాలు



• పడిగాపులే పనయిపాయే

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లోని రైతు వేదిక వద్దకు ఉదయమే పెద్ద సంఖ్యలో తరలివచ్చి యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

• ఆకలితో అన్నదాత పడిగాపులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సొసైటీ కార్యాలయం వద్ద సోమవారం తెల్లవారుజాము నుంచే రైతులు పెద్దసంఖ్యలో బారులుదీరారు. సుదూర ప్రాంతాల నుంచి ఇబ్బందులు పడ్డారు. సొసైటీ వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు కాంపెల్లి కనకేశ్ ఆధ్వర్యంలో రైతులకు భోజనం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అన్నదాతలను ఇబ్బందులు పెట్టొద్దని సూచించారు.

• అట్టుడికిన ఆదిలాబాద్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా సోమవారం యూరియా కోసం రైతులు పంపిణీ కేంద్రాల వద్ద బారులుదీరారు. ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్, బేల, బజార్‌హత్నూర్, భీంపూర్, సోనాల పంపిణీ కేంద్రాల పడిగాపులు కాశారు. భీంపూర్‌లోని ఆదిలాబాద్-మహారాష్ట్ర రోడ్డుపై బైఠాయించారు. లక్షెట్టిపేటలోని అంబేద్కర్ చౌక్ వద్ద మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు.

3 లక్షల మెట్రిక్ టన్నులు ఏమైంది?

బ్లాక్ దందాను ఎందుకు కంట్రోల్ చేయట్లేదు: బండి

కేంద్రం నుంచి యూరియా రాకనే ఇబ్బంది: పొన్నం



కరీంనగర్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రానికి కేంద్రం పంపిన 12 లక్షల టన్నుల యూరియాలో 3లక్షల టన్నుల యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ యూరియా ఏమైందో రాష్ట్ర ప్రభుత్వమే చెప్పాలని అన్నారు. కరీంనగర్‌లో పాస్‌పోర్టు కార్యాలయ ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా పొన్నం మాట్లాడుతూ ఎరువుల తయారీ, ఎరువుల పంపిణీ బాధ్యత కేంద్రానిదేనని, యూరియా కోసం బండి సంజయ్‌కి విజ్ఞప్తి చేశామని తెలిపారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 9లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అడిగితే కేంద్రం పంపిందని, మళ్లీ 3 లక్షల మెట్రిక్ టన్నులు కావాలంటే ఇచ్చిందని తెలిపారు. అదనంగా ఇచ్చిన 3లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఏమైందో చెప్పాలన్నారు. మిర్యాలగూడలో ఎమ్మెల్యే గన్‌మ్యాన్ లారీలోడ్ యూరియాను పక్కదారి పట్టించాడని, దొరకని లోడ్స్ ఎన్ని అని, బ్లాక్‌మార్కెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కంట్రోల్ చేయలేకపోతున్నదని బండి సంజయ్ ప్రశ్నించారు.

• గోడు చెప్పుకుంటే గొడవేంటి?



నారాయణపేట జిల్లా మరికల్‌లో యూరియా కోసం రాస్తారోకో చేస్తున్న అన్నదాతలు, అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదం

• యూరియా కోసం ఆరాటం



సంగారెడ్డి జిల్లా కంది పీఏసీఎస్ వద్దకు భారీగా తరలివచ్చిన రైతులు, రైతులను కట్టడి చేస్తూ వరుసలో నిలబెడుతున్న పోలీసులు

• నిర్లక్ష్యంపై నిరసన జ్వాల



యూరియా సరఫరాలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట తహసీల్దార్ కార్యాలయం గేటు మూసివేసి, బైఠాయించిన రైతులు



కామారెడ్డి జిల్లా రామేశ్వరపల్లిలో గంగారెడ్డి అనే రైతు అరువు తెచ్చుకున్న యూరియా బస్తాను పొలం వద్ద పెట్టి ఇంటికి వెళ్లి వచ్చేలోగా బస్తాను చోరీ చేసిన యువకులు.. మక్క మొక్కలు అడ్డు పెట్టుకొని బైక్‌పై తీసుకెళ్లారు. స్థానిక సీసీ కెమెరాలో చూసి ప్రశ్నించగా వారు యూరియా బస్తాను తిరిగి రైతుకు ఇచ్చారు.

• బారులు తీరి బేజారై



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లోని సహకార సంఘం ముందు యూరియా కోసం బారులు తీరిన రైతులు

• క్యూలో రైతుకు గాయం



జనగామ జిల్లా కొడకండ్లలోని గ్రోమోర్ కేంద్రం వద్ద యూరియా కోసం క్యూలో జరిగిన తోపులాటలో కింద పడటంతో తలకు గాయమై విలవిల్లాడుతున్న కడగుట్ట తండాకు చెందిన ధరావత్ బిచ్చ(75)

మరో 40 వేల టన్నుల యూరియా వస్తున్నది

మంత్రి తుమ్మల వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ) : రాష్ట్రానికి కేంద్రం అదనంగా మరో 40 వేల టన్నుల యూరియా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. త్వరలోనే రాష్ట్రానికి చేరుకుంటుందని చెప్పారు. ఈ మేరకు ఢిల్లీ వెళ్లిన మంత్రి తుమ్మల.. కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శి రజత్‌కుమార్ మిశ్రాతో సమావేశమయ్యారు. వరి, మక్కకు, పత్తి పంటలకు యూరియా అత్యవసరమని చెప్పారు

సకల జనుల సమరం

- వంట పనుల్లో గిరిజన విద్యార్థులు



తిర్యాణి, సెప్టెంబర్ 15 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర వసతి గృహం కార్మికులు సమ్మెలో ఉండగా, తప్పనిసరి పరిస్థితుల్లో వాచ్‌మన్‌తో కలిసి విద్యార్థులే అల్పాహారంతో పాటు అన్నం.. కూరలు వండారు. ఈ ఫోటోలు.. వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ పాఠశాలలో 220 మంది విద్యార్థులు ఉన్నారు. గదులతో పాటు పరిసరాలు శుభ్రం చేయడం తదితర పనులు చేపట్టడం తనతో కావడం లేదని, అందుకే విద్యార్థుల సాయం తీసుకుంటున్నట్టు వాచ్‌మన్ భూంబాయి తెలిపారు.

- ఆకలికి తాళలేక..



ఆకలికి తాళలేక జయశంకర్ భూపాలపల్లి గిరిజన ఆశ్రమ (బాలికల) పాఠశాల విద్యార్థులు సోమవారం వంటచేసుకున్నారు. రాష్ట్రంలో గిరిజన పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలంటూ నిరవధిక సమ్మె చేస్తున్న నేపథ్యంలో వండే వారు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చేసేదేమీ లేక వారే స్వయంగా వండుకొని తింటున్నారు.

- వంట 'మాస్టార్లు'!



ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న వంట సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాలుగు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న క్రమంలో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులే వంట 'మాస్టార్లు'గా మారారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం విద్యార్థుల ఆకలి తీర్చేందుకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులే వంట చేసి వడ్డించారు. ఉపాధ్యాయుల సమయాన్ని వృథా చేయకుండా వంట సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరారు.

- సీఎం నియోజకవర్గం కొడంగల్‌లో..



కొడంగల్‌లోని సీఎం నివాసం ముట్టడికి తరలివచ్చిన అంగన్‌వాడీలను అడ్డుకునేందుకు యత్నిస్తున్న పోలీసులను ప్రతిఘటిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

- మంత్రి వాకిటి శ్రీహరి ఇల్లు ముట్టడి



నారాయణపేట జిల్లా మక్తల్‌లో తన ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను వింటున్న మంత్రి వాకిటి శ్రీహరి

అట్టుడికిన అంగన్‌వాడీల ఆందోళన

- ప్రీ ప్రైమరీని తప్పించడంపై కన్నెర్ర
- మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడించిన అంగన్‌వాడీలు
- కొడంగల్‌లో సీఎం ఇల్లు ముట్టడి
- సమస్యల పరిష్కారానికి డిమాండ్



హనుమకొండలోని మంత్రి కొండా సురేఖ ఇంటి సమీపంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు

నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 15 : అంగన్‌వాడీల ఆందోళన అట్టుడికింది. ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించడంతోపాటు పలు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఆందోళనకు దిగారు. సీఎం ఇంటితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడించారు. ఆందోళనలో భాగంగా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని సీఎం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు, కార్యాలయాన్ని ముట్టడించే ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అయినప్పటికీ 'సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేస్తూ పోలీసులను తప్పించుకొని ముట్టడించేందుకు ప్రయత్నం చేశారు. గ్రేటర్ వరంగల్‌లోని మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించగా, ములుగులోని మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నించారు. పోలీసులు బారికేడ్లను అడ్డుగా పెట్టి అడ్డుకున్నారు. దీంతో అంగన్‌వాడీలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మంత్రి దామోదర రాజనర్సింహ ఇంటిని ముట్టడించారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలోని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించారు. మంత్రి అందుబాటులో లేకపోవడంతో మంత్రి వ్యక్తిగత సహాయకుడి ఫోన్ ద్వారా అంగన్‌వాడీ యూనియన్ నాయకులతో మాట్లాడిన మంత్రి వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ ఇంటి ఎదుట నిరసన తెలిపారు. నారాయణపేట జిల్లా మక్తల్‌లో మంత్రి వాకిటి శ్రీహరి ఇంటిని ముట్టడించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టు రూ.18 వేల వేతనంతోపాటు పీఎఫ్, పెంచిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు ఆలకించిన మంత్రి శ్రీహరి స్పందిస్తూ ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని భరోసానిచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 15 : పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కార్మికులు డిమాండ్ చేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె సోమవారం నాలుగో రోజుకు చేరింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ కార్మికులకు మద్దతుగా సమ్మెలో పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలపై పని భారం తగ్గించాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఏఎన్‌ఎంలు పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, దీన్ని తగ్గించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ డిమాండ్ చేశారు. పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఎన్‌ఎంలు కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేసినపనిని 14 యాప్‌ల ద్వారా అప్‌డేట్ చేయాల్సి వస్తున్నదని చెప్పారు.

సుప్రీంకోర్టు తీర్పు కేంద్రానికి చెంపపెట్టు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): వక్ఫ్ సవరణ చట్టంలోని కీలక నిబంధనలను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. ఢిల్లీలోని ఏపీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'వక్ఫ్ సవరణ చట్టం విషయంలో బీజేపీ ప్రభుత్వ తీరును మొదటి నుంచి ప్రశ్నించాం. చట్టం కాకముందే బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని కోరాం. కానీ బీజేపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. కానీ సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర ఏకపక్ష వైఖరికి చెంపపెట్టులాంటిది' అని పేర్కొన్నారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రకారం ఒక శాతం ఉన్న ప్రజలకు కూడా మతపరమైన హక్కులు ఉన్నాయని నారాయణ చెప్పారు. మణిపూర్ మూడేండ్లుగా మండిపోతున్నా అటువైపు చూడని ప్రధాని మోదీ.. ఇప్పుడు అక్కడికి వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. ఆయన పర్యటనలో నిజాయితీ లేదని తెలిపారు. తెలంగాణ విముక్తి పోరాటంపై గవర్నర్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని నారాయణ విమర్శించారు.

కడుతున్న ఇందిరమ్మ ఇండ్లు 1.29 లక్షలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా 2.15 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, అందులో 1.29 లక్షల ఇండ్లు నిర్మాణంలో ఉన్నట్టు గృహనిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతం వెల్లడించారు. ఇందులో 20వేల ఇండ్లు గోడల వరకు నిర్మాణం కాగా, 8,633 ఇండ్లు స్లాబ్ వరకు వచ్చాయని ప్రకటనలో తెలిపారు. పలు ప్రాంతాల్లో పూర్తయిన ఇండ్ల గృహ ప్రవేశాలు జరుగుతున్నట్టు చెప్పారు. ఇండ్ల నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు లబ్ధిదారులకు రూ.1,435 కోట్లు అందించినట్టు పేర్కొన్నారు. నిర్మాణ పురోగతి ఆధారంగా ప్రతి సోమవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదును జమచేస్తున్నామన్నారు. తాజాగా సోమవారం 13,841 మంది లబ్ధిదారులకు రూ.146.30 కోట్లు విడుదల చేసినట్టు గౌతం వివరించారు. కాగా ప్రభుత్వం మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న విషయం విదితమే. ఇందులో ఇప్పటివరకు కేవలం 1.29 లక్షల ఇండ్లు మాత్రమే పురోగతిలో ఉండడం గమనార్హం.

అప్పల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

జనగామ జిల్లా వీఎస్సార్‌నగర్‌లో విషాదం



అర్జున్ (ఫైల్)

బచ్చన్నపేట, సెప్టెంబర్ 15 : అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం వీఎస్సార్‌నగర్‌లో చోటుచేసుకున్నది. కుటుంబసభ్యులు, ఎస్సై హమీద్ కథనం మేరకు.. వీఎస్సార్‌నగర్‌కు చెందిన చింతల అర్జున్ (33) ఆటో నడుపుకుంటూ భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం ఆటో చెడిపోవడంతో రూ. 3 లక్షలు, అత్తమామల తరపున మరో రూ. 3 లక్షలు, మొత్తం రూ. 6 లక్షల అప్పు చేశాడు. ఆటో సరిగా నడవక, అప్పుతీర్చే మార్గం కనిపించక, కుటుంబ పోషణ భారం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం తెల్లవారుజామున ఆటో తీసుకొని తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో హోంగార్డు ఆత్మహత్య

కూతురి పెండ్లి చేయడంతో అప్పులపాలు

కరీంనగర్ జిల్లాలో విషాదం



కనుకయ్య(ఫైల్)

చొప్పదండి, సెప్టెంబర్ 15 : ఆర్థిక పరిస్థితులు బాగాలేక కరీంనగర్ జిల్లాలో ఓ హోంగార్డు ఆత్మహత్య చేసుకున్నాడు. చొప్పదండి ఎస్సై నరేశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రుక్మాపూర్‌కు చెందిన ముద్దసాని కనుకయ్య (46) కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో హోంగార్డుగా పని చేస్తున్నాడు. ఆయనకు కూతురు, కొడుకు ఉన్నారు. కొడుకు డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. కూతురికి నెల క్రితం పెండ్లి చేశాడు. ఈ క్రమంలో అప్పులు కావడంతో మనస్తాపం చెందాడు. ఆదివారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించే క్రమంలో చనిపోయాడు. కనుకయ్య భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆ ఎమ్మెల్యేలు దొరికిన దొంగలు

▶ మొదటిపేజీ తరువాయి...

చింతా ప్రభాకర్ రీజాయిండర్లు అందజేశారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ... పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో కొంత మంది ఎమ్మెల్యేలు తాము అమాయకులమని, కేసీఆర్‌పై నమ్మకం ఉన్నదని, పార్టీ మారలేదని స్పీకర్‌కు వివరణ ఇచ్చినట్టు పేర్కొన్నారు. దీనిపై తమకు పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాధానాన్ని పంపిస్తూ మూడు రోజుల్లోనే సమాధానం ఇవ్వాలని స్పీకర్ స్పష్టంచేశారని వెల్లడించారు. స్పీకర్ గడువు ఇచ్చిన మూడు రోజుల్లోనే పార్టీ మారిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిన విధానం, ఆ పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తోకలిసి కాంగ్రెస్ పార్టీ సమావేశాల్లో, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం, ఆ పార్టీ గెలుపు కోసం మీడియాలో ప్రకటనలు ఇచ్చిన విధానాలను రిజాయిండర్లలో పేర్కొన్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆడియో, వీడియో, ఫొటో ఆధారాలను సమర్పించినట్టు వివరించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదంటూ స్పీకర్‌కు వివరణ ఇచ్చిన తరువాత కూడా కాంగ్రెస్ పార్టీ సభలు, సమావేశాల్లో పాల్గొన్నారని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. దీనికి ఫిరాయించిన ఎమ్మెల్యేలు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 'నా నియోజకవర్గంలో సమస్యలు ఉన్నాయంటే చర్చించడానికి సీఎం మా ఇంటికి వచ్చారని పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మరి శ్రీనివాస్‌రెడ్డికి కేసీఆర్‌పై నమ్మకం ఉంటే కేసీఆర్ ఫొటో, కేసీఆర్ కండువా ఉండాలి కదా? ఎందుకు లేదు. అభివృద్ధి కోసం సీఎంను కలిసిన పోచారం.. ఆ తర్వాత రాహుల్‌గాంధీ, మహేశ్ కుమార్‌గౌడ్‌ను ఎందుకు కలిశారు?' అని జగదీశ్‌రెడ్డి నిలదీశారు.



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

నియోజకవర్గ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

వ్యక్తిగత ప్రయోజనాల కోసం పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారి ఇప్పుడు బుకాయిస్తున్నారని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. తాము తప్పుచేసి పార్టీ మారామని నియోజకవర్గ ప్రజల ముందు ఒప్పుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాను నియోజకవర్గ అభివృద్ధి కోసం వెళ్తే సడెన్‌గా సీఎం కండువా కప్పారంటూ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ చెప్తున్నారని, మరి ఆ తర్వాత సంజయ్ ఒక దినపత్రికకు ఇచ్చిన ప్రకటనల్లో కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. గాంధీభవన్, కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌ల్లో పాల్గొంటే అభివృద్ధి ఎట్లా అవుతుందని నిలదీశారు. స్పీకర్ నుంచి నోటీసులు వచ్చాక తాము పార్టీ మారలేదంటూ కేసీఆర్ దగ్గరకు వచ్చిన వివరణ ఇవ్వాల్సిన పది మంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గరకు ఎందుకు వెళ్లారని నిలదీశారు. పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యే ఎన్ని బొంకినా, ఎన్ని సుద్దులు చెప్పినా తప్పించుకోలేరని జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. పదిచోట్ల ఉప ఎన్నికలు రావడం ఖాయమని, వారికి రాజకీయ భవిష్యత్తు లేకుండా ప్రజలు బుద్ధిచెప్పడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని తెచ్చేందే కాంగ్రెస్ పార్టీ అని, చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు కోర్టు ఇచ్చిన గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని కోరారు. పది మంది ఎమ్మెల్యేలు గడ్డిపోచను పట్టుకుని వరద నుంచి బయటపడాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. వాళ్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాదని, పార్టీకి ద్రోహం చేశారంటూ పిటిషన్ ఇచ్చామని, పదిమంది ఎమ్మెల్యేలపై చర్యలు త్వరగా తీసుకోవాలని కోరారు.

ఆరుగురి వివరణలకు రిజాయిండర్లు

పార్టీ ఫిరాయించిన మొత్తం పది మంది శాసనసభ్యుల్లో స్పీకర్ నోటీసులకు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ స్పందించకపోవడంతో వారికి రిజాయిండర్లు ఇవ్వలేదని జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్‌పై అనర్హత వేటు వేయాలని పిటిషన్ వేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కే సంజయ్ విదేశాల్లో ఉండటం వల్ల ఆయన తిరిగి రాష్ట్రానికి వచ్చిన తర్వాత మూడు నాలుగు రోజుల్లో వారిద్దరి సమాధానాలపై రిజాయిండర్లు ఇస్తారని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఆ లోపు స్పీకర్ నిర్ణయం ఉంటుందని తాము భావిస్తున్నట్టు చెప్పారు.

పీసీసీ చీఫ్ చెప్పిన మాటలు గుర్తున్నాయా?

పీసీసీ నిర్వహించిన క్రమశిక్షణా కమిటీ సమావేశానికి గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శంషాబాద్‌లో కాంగ్రెస్ తరపున ఎన్నికల ప్రచారంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కాపాడటానికే వీరంతా కాంగ్రెస్‌లో చేరినట్టు పీసీసీ అధ్యక్షుడు చెప్పిన మాటలు మీడియాలో వచ్చాయి. వీటికి ఏమని సమాధానం చెబుతారని బీఆర్‌ఎస్ నేతలు నిలదీస్తున్నారు. కాగా, స్పీకర్ నోటీసులకు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎందుకు సమాధానం ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలూ.. వీటికేదీ సమాధానం?

'స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించండి' అంటూ ఇటీవల పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ తరపున చేసిన ప్రచారంపై మీడియాలో వచ్చిన వార్తను బీఆర్‌ఎస్ నేతలు ప్రస్తావిస్తున్నారు. అభివృద్ధి నిధుల కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిస్తే తప్పేమీ లేదు. కానీ రాహుల్‌గాంధీని, మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఎందుకు కలిశారు? దీనిని ఏమనుకోవాలి? దీనికి ఏం సమాధానం చెబుతారు? అని ప్రశ్నిస్తున్నారు. రాహుల్, మహేశ్‌కుమార్‌ను పోచారం కలిసిన ఫొటోలను విడుదల చేశారు. 'కాంగ్రెస్ పార్టీ గాంధీభవన్‌లో నిర్వహించిన మీటింగ్‌కు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ హాజరయ్యారు. మల్లికార్జునఖర్గే, మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయ్యారు. ఖర్గే మీటింగ్‌కు జగిత్యాల నుంచి బయలు దేరానంటూ బస్సులో వస్తున్న ఫొటోను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. నవ తెలంగాణ పత్రికలో ఫుల్ పేజీ ప్రకటనను సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ, ఖర్గే, భట్టి, ఫొటోలతో ఇచ్చారు. గాంధీభవన్‌లో ఖర్గేతో జరిగిన సమావేశంలో సంజయ్ పాల్గొన్నారు' అని బీఆర్‌ఎస్ నేతలు గుర్తుచేస్తున్నారు.



హనుమకొండలో తాటికొండ రాజయ్య మద్దతుగా వచ్చి నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ధ్యాసం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్, పార్టీ నాయకులు

మాజీ ఎమ్మెల్యే రాజయ్య హౌస్ అరెస్ట్

- పాదయాత్రకు వెళ్లకుండా అడ్డుకోవడంతో ఉద్రిక్తత
- రాజయ్య ఇంటికి తరలివచ్చిన మాజీ ఎమ్మెల్యేలు, శ్రేణులు
- కడియం రాజీనామా చేసేవరకు వదిలేదిలేదు: రాజయ్య
- కడియం రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో గెలువాలి: దాస్యం

హనుమకొండ, సెప్టెంబర్ 15 : పాదయాత్ర నేపథ్యంలో హనుమకొండ సర్క్యూట్ గెస్ట్‌హౌస్ రోడ్డులోని తన ఇంటిలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను సుబేదారి పోలీసులు సోమవారం ఉదయం హౌస్ అరెస్ట్ చేశారు. బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి అక్రమ హౌస్ అరెస్ట్‌ను ఖండించారు. రాజయ్యను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల నుంచి క్లియరెన్స్ వచ్చిన తర్వాత రాజయ్యను వదలిపెట్టగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పాదయాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా తాటికొండ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ జెండాతో గెలిచిన కడియం పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. రైతుల కోసం ఎన్ని అడ్డంకులు వచ్చినా పాదయాత్రను కొనసాగిస్తానని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కడియం శ్రీహరి రాజకీయ పబ్బం గడుపుకునేందుకే పార్టీ మారాడని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ కడియం శ్రీహరి.. కేసీఆర్ భయంతోనే జ్వరం వచ్చి ఇంట్లో పడుకున్నాడని పేర్కొన్నారు.

కడియం 'ఊసరవెల్లి: ఎమ్మెల్యే పల్లా

జనగామ, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : ఊసరవెల్లి సిగ్గుపడేలా..రంగులు మార్చే కడియం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎన్నికల్లో మళ్లీ గెలవాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం రఘునాథపల్లి మండలం కుర్చపల్లి నుంచి రైతులకు సాగునీరు, యూరియా అందించాలనే డిమాండ్‌తో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య చేపట్టిన 'రైతు పాదయాత్ర'ను మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపనేని నరేందర్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు.

రేపటి నుంచి 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్'

ప్రతి జిల్లాలో ఒక మెగా హెల్త్ క్యాంపు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): మహిళలు, పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కేంద్రం 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' పేరుతో దేశవ్యాప్తంగా ప్రత్యేక అభియాన్‌ను ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఈనెల 17నుంచి అక్టోబర్ 2వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు వైద్యారోగ్య వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు రాష్ట్రంలో మొత్తం 20,607 ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ అభియాన్ ప్రారంభం సందర్భంగా ప్రతి జిల్లాలో ఒక మెగా క్యాంపు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రస్థాయిలో హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రారంభించనున్నారు. ఈ శిబిరాల్లో రక్తపోటు, మధుమేహం, బ్రెస్ట్, సర్వికల్ క్యాన్సర్, ట్యూబర్ క్యులోసిస్ తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. గైనకాలజిస్టులు, పీడియాట్రిషన్లు, నేత్ర వైద్యులు, ఈఎన్‌టీ, దంత వైద్యులు, సైకియాట్రిస్టులు వంటి నిపుణులు సేవలు అందించనున్నారు. గర్భిణుల కోసం రక్త పరీక్షలు, పోషకాహార సూచనలు, మాతాశిశు రక్షణ కార్డులను పంపిణీ చేయనున్నారు. లక్ష యూనిట్ల రక్త సేకరణ లక్ష్యంగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు.

సంస్కరణలతో పోలీస్‌శాఖ సామర్థ్యం పెంపు

ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ ఎంఓయూలో డీజీపీ జితేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : పోలీస్‌శాఖలో పారదర్శక పాలనకు సంస్కరణలు అవసరమని, వీటితో పోలీస్‌శాఖ సామర్థ్యం మరింత పెంపొందుతుందని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఇండియన్ పోలీస్ ఫౌండేషన్(ఐపీఎఫ్)తో రాష్ట్ర పోలీస్‌శాఖ ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్ర పోలీస్ చేపట్టిన మీ సేవ, పోలీస్‌స్టేషన్లలో క్యూఆర్ కోడ్ వ్యవస్థ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మహిళల కోసం టీ-సేఫ్ యాప్ వంటి కార్యక్రమాలకు ఈ ఎంఓయూతో మరింత విలువ చేకూరిందని పేర్కొన్నారు. ఐపీఎఫ్ అధ్యక్షుడు ఓంప్రకాశ్ సింగ్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా పరిశోధన, విధాన రూపకల్పనల ద్వారా పోలీసింగ్‌లో మెరుగైన వసతులు కల్పించడమే తమ లక్ష్యమని వెల్లడించారు. ఇప్పటికే హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, కేరళ, ఉత్తరప్రదేశ్, తమిళనాడులో ఐపీఎఫ్ విభాగాలు ఏర్పాటయ్యాయని, ఇప్పుడు తెలంగాణలోనూ విస్తరించనున్నట్టు చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభదశలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 15 పోలీస్‌స్టేషన్లు, సంగారెడ్డి జిల్లా పరిధిలో 15 పోలీస్‌స్టేషన్లలో అమలుచేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీజీ అభిలాష బిష్త్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖాగోయెల్, ఐపీఎఫ్ కార్యవర్గ సభ్యుడు దుర్గాప్రసాద్, అడిషనల్ డీజీలు మహేశ్ భగవత్, అనిల్‌కుమార్, సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి, ఐజీలు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పోస్టులు మంజూరుచేయండి: టీజీపీఈఏ

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : విద్యుత్తు సంస్థల అవసరం మేరకు కొత్త పోస్టులు మంజూరుచేయాలని తెలంగాణ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్(టీజీపీఈఏ) డిమాండ్‌చేసింది. ట్రాన్స్‌ఫర్ పాలసీని రూపొందించాలని, పదోన్నతులు కల్పించాలని కోరింది. టీజీపీఈఏ ఆధ్వర్యంలో సోమవారం ఇంజినీర్స్ డేను నిర్వహించారు. ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్, విద్యుత్తు సంస్థల సీఎండీలు హరీశ్, ముషారఫ్ ఫారూఖీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి సదానందం మాట్లాడుతూ.. 1999 - 2004 మధ్యలో రిక్రూట్ అయిన వారికి జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

బయ్యారం లిఫ్ట్ మరమ్మతులకు 3.34కోట్లు

హైదరాబాద్, సెప్టెంబర్15 (నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లా మధిర మండలంలో వైరా రివర్ కుడిగట్టుపై ఏర్పాటుచేసిన బయ్యారం లిఫ్ట్ పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.3.34కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు ఇరిగేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా మధిర మండలంలోని జాలిమూడి చెరువు కుడి, ఎడమ కాల్వల మరమ్మతులకు రూ.5.23కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చింది.

పది పరీక్షలకు విద్యాశాఖ యాక్షన్‌ప్లాన్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ యాక్షన్‌ప్లాన్‌ను విడుదల చేసింది. వచ్చే ఏడాది మార్చిలో పరీక్షలు జరగనున్న నేపథ్యంలో అత్యుత్తమ ఫలితాల సాధనకు కసరత్తును ప్రారంభించింది. ఈ మేరకు 2026 జనవరి 10లోపు సిలబస్‌ను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించింది. అక్టోబర్ నుంచే విద్యార్థులకు ఉదయం, సాయంత్రం స్పెషల్ క్లాసులు నిర్వహించాలని సూచించింది. చదువులో వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకోవాలని ఆదేశించింది. మూడురోజుల్లో ఒకరోజు పాఠాల బోధన.. మరుసటి రోజు పరీక్ష.. ఆ తర్వాత పరీక్షపై ఫలితాల విశ్లేషణ ఇలా ప్రణాళికాబద్ధంగా నడుచుకోవాలని పలు సూచనలు చేసింది.

16మంది పర్యవేక్షణాధికారుల నియామకం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): విద్యాశాఖ అమలు చేస్తున్న కార్యక్రమాల మానిటరింగ్‌కు 16మంది పర్యవేక్షణాధికారులను పాఠశాల విద్యాశాఖ నియమించింది. ఈ మేరకు అడిషనల్ డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లకు రెండు, మూడు జిల్లాలకు పర్యవేక్షణాధికారులుగా బాధ్యతలు అప్పగించింది.

నేటినుంచి బీఎస్సీ నర్సింగ్ అడ్మిషన్లు ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): బీఎస్సీ నర్సింగ్ నాలుగేండ్ల కోర్సులో భాగంగా 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం ఉదయం 9గంటల నుంచి ఈనెల 30 సాయంత్రం 5గంటల వరకు https://tsparamed.tsche.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. పూర్తి వివరాలకు 93926 85856, 78421 36688లేదా tsparamed.tech@gmail.com సంప్రదించాలని కోరింది.

యూఆర్ఎస్‌లకు స్థలాలు కేటాయించండి

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 27 అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లకు(యూఆర్ఎస్) పక్కా భవనాల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని పాఠశాల విద్యాశాఖ కోరింది. ఒక్కో యూఆర్ఎస్‌కు 4 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాశారు. రాష్ట్రంలో మొత్తం 29 అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఉండగా, ఒకదానికి సొంత భవనం ఉంది. మరొకటి నిర్మాణంలో ఉంది. మిగిలిన 27లో 21 యూఆర్ఎస్‌లు సర్కారు బడుల్లో నడుస్తున్నాయి. మరో 6 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వీటిల్లో వీధి బాలలు, అనాథలు, రెస్క్యూ చేసిన పిల్లలు, బాల కార్మికులు, పరారై చిక్కిన చిన్నారులను చేర్చుకుని విద్యనందిస్తున్నారు.

వారంపాటు వానలే వానలు

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు

మూడు రోజులు భారీ వర్షాలు: ఐఎండీ



ఆదివారం-సోమవారం జోరువాన

జిల్లా	వర్షం (సెం.మీ)
సిద్దిపేట	24.24
మెదక్	10.58
కామారెడ్డి	9.62
హైదరాబాద్	9.49
నిజామాబాద్	9.29

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో మరో వారం పాటు వర్షాలు జోరుగా కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది. మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పింది. సోమవారం అల్పపీడనం బలహీనపడి ఉపరితల ఆవర్తనంగా మారిందని తెలిపింది. తెలంగాణకు ఆనుకొని తూర్పు విదర్భ ప్రాంతంలో కేంద్రీకృతమైందని, దీంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు మెదక్, సిద్దిపేట, కామారెడ్డి, రంగారెడ్డి, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో భారీ వర్షం కురిసిందని వెల్లడించింది. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేటలో అత్యధికంగా 24.24 సెం.మీ వర్షపాతం నమోదైందని తెలిపింది. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో 9.49 సెంటీమీటర్ల వర్షం కురిసిందని, ముషీరాబాద్‌లో పెద్ద ఎత్తున వరద ముంపు ఏర్పడిందని, ముగ్గురు వ్యక్తులు గల్లంతైనట్టు అధికారులు వివరించారు.

మూడు రోజులు బీఅలర్ట్

మంగళవారం(నేడు) ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడొచ్చని వెల్లడించారు. బుధ, గురువారాల్లో సిద్దిపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని అంచనా వేశారు. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేశారు.

మైనర్ ఇరిగేషన్ స్కీం అమలుకు రాష్ట్రస్థాయి కమిటీ

ఈఎన్సీ చైర్మన్‌గా ఐదుగురు సభ్యులతో నియామకం

హైదరాబాద్, సెప్టెంబర్15(నమస్తే తెలంగాణ) : సర్ఫేస్ మైనర్ ఇరిగేషన్(ఎస్ఎంఐ)పథకం అమలుకోసం ప్రభుత్వం రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది. ఈఎన్సీ జనరల్ చైర్మన్‌గా, కాడా(కంట్రోల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) సీఈ కన్వీనర్‌గా, శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సంబంధిత ప్రాజెక్ట్ టెరిటోరియల్ సీఈ, సీడబ్ల్యూసీ(కేంద్ర జలసంఘం)రీజినల్ డైరెక్టర్, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌ను మెంబర్లుగా నియమించింది. ఈ మేరకు ఇరిగేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) పథకంలో భాగంగా ఎస్ఎంఐ స్కీమ్‌ను అమలుచేస్తున్నారు. ప్రధానంగా 20 హెక్టార్ల నుంచి 2వేల హెక్టార్లలోపు ఉన్న చెరువులు, ప్రాజెక్టుల అభివృద్ధికి, నీటి వినియోగానికి చేపట్టాల్సిన పనులకు కేంద్రం 60శాతం నిధులు ఇస్తుండగా, 40శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. స్కీం కింద ఎంపిక చేయాల్సిన చెరువులు, ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం స్టేట్ లెవల్ శాంక్షన్ కమిటీ(ఎస్ఎల్ఎస్‌సీ)ని ఏర్పాటుచేయాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్‌శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపగా.. ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

జిందగీ
ఊపిరి
నమస్తే తెలంగాణ హైదరాబాద్
మంగళవారం 16 సెప్టెంబర్ 2025
www.ntnews.com
10



చర్మం, కళ్లలోని తెల్లని భాగం పచ్చరంగుకు మారట మనేది కామెర్ల వ్యాధి (జాండిస్)కి అందరికీ తెలిసిన ఒక కొండ గుర్తు...! రక్తంలో బైల్ రూబిన్ అధికంగా చేరటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఇది పసుపు రంగులో ఉండే ఓ వ్యర్థ పదార్థం. ఎర్ర రక్తకణాలలోని హిమోగ్లోబిన్ తొలిగిపోయాక మిగిలిన భాగం ఇది. బైల్ రూబిన్ పరిమాణం ఎక్కువ అయినపుడు అది చుట్టుపక్కల కణజాలాల్లోకి చేరి వాటికి పసుపు రంగు కలిగిస్తుంది. సాధారణంగా రక్తంలోని బైల్ రూబిన్‌ని కాలేయం తొలగించి వేస్తుంటుంది. అది కాలేయానికి చేరుకోగానే అక్కడ దానిపై పలు రసాయనాలు పనిచేస్తాయి. ఆ రసాయన చర్యలతో అది అన్ కాంజుగేటెడ్ బైల్ రూబిన్ అనే పదార్థంగా తయారవుతుంది. కాలేయం దీనిని పైత్యరసంలోకి పంపిస్తుంది. ఈ జీర్ణరసం ద్వారా ఆహారంలోకి చేరిన బైల్ రూబిన్ జీర్ణప్రక్రియ చివరివరకూ కొనసాగి చివరకు మలంతో విసర్జితం అవుతుంది. మలానికి గోధుమరంగు దీనివల్లనే ఏర్పడుతుంది. పలుకారణాలు, అలవాట్లు, వైరస్ ఇన్ఫెక్షన్ల వల్ల ఈ ప్రక్రియకు ఆటంకం ఏర్పడి కామెర్ల వ్యాధి వస్తుంది.



కాలేయాన్ని కాటేసే కామెర్లు

కామెర్లను గుర్తించటం ఎలా?

కామెర్ల వ్యాధిలో సర్వసాధారణంగా కనిపించేది, అత్యధికులకు తెలిసింది చర్మం, కళ్లు పచ్చగా మారటం. ఇది మొదట తల భాగంతో ప్రారంభించి క్రమంగా శరీరం అంతా వ్యాపిస్తుంది. ఈ పచ్చదనం కాకుండా మరికొన్ని లక్షణాలు కూడా ఈ వ్యాధిలో గమనించవచ్చు.

దురదలు: చర్మంలో బైల్ సాల్ట్స్ అధికంగా చేరటంతో శరీరం అంతటా దురదలు పెడుతుంటాయి.

అలసట: స్పష్టమైన కారణం లేకుండానే విపరీతమైన అలసట ఏర్పడుతుంది. బరువు తగ్గిపోతుంది.

జ్వరం: హఠాత్తుగా జ్వరం వస్తుంది. వాంతులు అవుతాయి.

నొప్పి: పొట్టలో తీవ్రమైన నొప్పి కలుగుతుంది.

మూత్రం, మలం రంగు మారుతుంది: సాధారణంగా కొద్దిపాటి పసుపు రంగుతో తేటగా ఉండే మూత్రం చిక్కగా, గోధుమ రంగులో వస్తుంది. అదే విధంగా మలం పసుపు, ఆకు పచ్చ రంగులో ఉండటం కూడా కామెర్ల వ్యాధి లక్షణాలలో ముఖ్యమైనది.

కామెర్లకు కారణం ఏమిటి?

ప్రధానంగా రెండు కారణాల వల్ల జాండిస్ సోకుతుంది. వీటిలో మొదటిది శరీరంలో బైల్‌రూబిన్ అత్యధికంగా ఉత్పత్తి అవుతుండటం. రెండోది సహజంగా ఉత్పత్తి అవుతున్న బైల్‌రూబిన్‌ను కాలేయం తొలగించలేక పోవటం. ఈ రెండు సందర్భాలలోనూ బైల్‌రూబిన్ శరీర కణజాలంలో చేరి స్థిరపడుతుంది. కామెర్ల వ్యాధి సోకిన వ్యక్తి శరీర అంతర్భాగంలో కొన్ని స్పష్టమైన మార్పులు కనిపిస్తాయి.

కాలేయం వాపు: ఇలాంటి పరిస్థితిలో బైల్‌రూబిన్‌ను గుర్తించి తొలగించే సామర్థ్యం కాలేయానికి తగ్గుతుంది. దీంతో రక్తంలో ఆ వ్యర్థపదార్థం పరిమాణం పెరుగుతూ ఉంటుంది.

బైల్ డక్ట్ వాపు: పైత్యరసం నాళం వాపు... జీర్ణరసం స్రవించటానికి తద్వారా బైల్‌రూబిన్‌ను తొలగించటానికి ఆటంకంగా తయారవుతుంది. దీంతో కామెర్ల వ్యాధి ఏర్పడుతుంది.

పైత్యరసనాళంలో అడ్డంకులు: ఇది బైల్‌రూబిన్‌ను తొలగించే ప్రక్రియకు ఆటంకం కలిగిస్తుంది.

హెమోలైటిక్ ఎనిమియా: భారీ సంఖ్యలో ఎర్రరక్త కణాలు విచ్ఛిన్నం అవుతున్నప్పుడు శరీరంలో



పెద్ద మొత్తంలో బైల్‌రూబిన్ తయారవుతుంది. మలేరియా-తలసేమియా వ్యాధులు, కొన్ని ఔషధాలు ఎర్ర రక్తకణాలు భారీగా విచ్ఛిన్నం కావడానికి కారణం అవుతుంటాయి.

గిల్బర్ట్ సింద్రోమ్: వంశపారంపర్యంగా ఏర్పడే ఈ పరిస్థితి వల్ల పైత్యరసాన్ని విడుదల చేసే ఎంజైమ్‌ల సామర్థ్యం దెబ్బతింటుంది.

కొలెస్టాటిస్: కాలేయం నుంచి పైత్యరసం విడుదలకు అడ్డంకులు ఏర్పడతాయి. దాంతో కాంజుగేటెడ్ బైల్‌రూబిన్ విసర్జితం కావటానికి బదులు కాలేయంలోనే ఉండిపోతుంది.

వయోజనుల్లో మరికొన్ని తీవ్రమైన కారణాల వల్ల కామెర్ల వ్యాధి వస్తుంది. వీటిలో కొన్ని ప్రాణాంతకమైన పరిస్థితులకు దారితీయవచ్చు కూడా. మితిమీరిన మద్యపానం (నాలుగైదేళ్లకు పైబడి), హెపటైటిస్ బి, సి వైరస్ ఇన్‌ఫెక్షన్ల వల్ల చాలా మంది కామెర్ల వ్యాధికి గురవుతున్నారు. హెపటైటిస్ ఎ, ఇ వైరస్‌ల వల్ల వచ్చే కామెర్లు చాలా ప్రమాదకరం. దీనిలో హఠాత్తుగా కామెర్ల వ్యాధి సోకి ప్రాణానికి ముప్పు ముంచుకువస్తుంది. కలుషితమైన నీళ్లు, తిండి వల్ల ఈ తీవ్రమైన హైపటైటిస్ ఎ, ఇ వైరస్‌లు శరీరంలోకి చేరే ప్రమాదం ఉంది.

గుర్తించడం ఎలా?

చాలా సందర్భాలలో రోగి ఆరోగ్య చరిత్రను తెలుసుకోవటం, భౌతికంగా పరీక్షించటం, పొట్టను దగ్గరగా పరిశీలించటం ద్వారా డాక్టర్లు కామెర్ల వ్యాధిని గుర్తిస్తారు. పొట్టలో గడ్డలు ఏమైనా ఉన్నాయా, కాలేయం గట్టి పడిందా పరిశీలించి చూస్తారు. కాలేయం గట్టిగా మారటం సిరోసిస్ వ్యాధిని సూచిస్తుంది. అది రాయిలా మారటం క్యాన్సర్ లక్షణం. కామెర్ల తీవ్రతను తెలుసుకోవటానికి పలు రోగనిర్ధారణ పరీక్షలు ఉన్నాయి. వీటిలో మొదటిది లివర్ ఫంక్షన్ టెస్ట్. కాలేయం సరిగా పనిచేస్తున్నదీ లేనిదీ దీనితో వెల్లడవుతుంది. రోగిలో వ్యక్తమవుతున్న లక్షణాలకు కారణాలు బయటపడని పక్షంలో బైల్‌రూబిన్ పరిమాణం, రక్తపు తాజా పరిస్థితిని అర్థం చేసుకోవటానికి బైల్‌రూబిన్ టెస్ట్, ఫుల్ బ్లడ్ కౌంట్, కంప్లీట్ బ్లడ్‌కౌంట్, హెపటైటిస్ వైరస్ పరీక్షలు చేసి రోగ నిర్ధారణ చేస్తారు.

నాళాలకు అడ్డంకులు ఏర్పడటం వల్ల కామెర్ల వ్యాధి వచ్చినట్లు అనుమానిస్తే ఎం.ఆర్.ఐ. స్కాన్, అబ్డామినల్ అల్ట్రా సోనోగ్రఫీ, కాట్ స్కాన్ వంటి పరీక్షలు చేయిస్తారు. సిరోసిస్, క్యాన్సర్, ఫ్యాటీ లివర్ ఏర్పడినట్లు అనుమానం కలిగితే బయాప్సీ చేయించాల్సిందిగా వైద్యులు సూచిస్తారు.

చికిత్సకు లొంగేదే..

కామెర్ల చికిత్సకు ఇప్పుడు మంచి ఔషధాలు అందుబాటులోకి వచ్చాయి. చికిత్స నిర్లక్ష్యం చేస్తే.. కాలేయం దెబ్బతినే ప్రమాదం ఉంది. చికిత్సకు ముందు వ్యాధికి దారితీసిన కారణాలను గుర్తించేందుకు పరీక్షలు జరుపుతారు. తర్వాత కామెర్లను అదుపు చేయడం, నివారించడానికి చికిత్స అందిస్తారు. రక్తహీనత కారణంగా ఏర్పడిన కామెర్లను రక్తంలో ఎర్ర రక్తకణాలను అభివృద్ధి పరచటం ద్వారా అదుపుచేస్తారు. ఇందుకు ఐరన్ సప్లిమెంట్లను, ఇనుప ధాతువు అధికంగా ఉండే ఆహారం సిఫారసు చేస్తారు. హెపటైటిస్ కారణంగా వచ్చిన కామెర్లను తగ్గించటానికి యాంటి వైరల్, స్టెరాయిడ్ మందులను ఇస్తారు. నాళాలలో అడ్డంకుల కారణంగా కామెర్లు సోకితే శస్త్రచికిత్స ద్వారా ఆ ఆటంకాలను తొలగించి పరిస్థితి మెరుగుపరుస్తారు.

ఏవైనా మందులు వాడి, వాటిలోని రసాయనాల వల్ల కామెర్ల వ్యాధికి గురైన పక్షంలో.. తొలుత ఆ ఔషధాలు నిలిపివేయిస్తారు. ప్రత్యామ్నాయ మందులను సిఫారసు చేసి... దుష్ఫలితాలను తగ్గిస్తూ, వ్యాధికి చికిత్స అందిస్తారు. హెపటైటిస్ ఎ, ఇ వైరస్‌ల వల్ల వచ్చే కామెర్లు చాలా ప్రమాదకరం. హఠాత్తుగా ప్రాణాల మీదికి వస్తుంది. కాలేయం మార్పిడి మాత్రమే దీనికి నమ్మకమైన చికిత్స. సజీవులైన లేదా బ్రెయిన్ డెడ్ అయిన దాత నుంచి సేకరించిన ఆరోగ్యకర కాలేయంతో అవయవ మార్పిడి ఆపరేషన్ చేస్తారు. తర్వాత రోగి కోలుకునేలా అవసరమైన చికిత్స అందిస్తారు.



డాక్టర్ మహమ్మద్ అబ్దున్ నయీం
సీనియర్ లివర్ ట్రాన్స్ ప్లాంట్,
HPB & GI సర్జన్
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్

టైట్ అయితే.. ట్రబులే!

ఈరోజుల్లో కాలేజీ అమ్మాయిలే కాదు.. ఉద్యోగాలు చేసే వాళ్లూ జీన్స్ ధరిస్తున్నారు. కంఫర్ట్ కోసం బెల్ట్ కూడా పెట్టుకుంటారు. కానీ, చాలామంది బెల్టును చాలా టైట్‌గా ఉంచుకుంటారు. ఈ అలవాటు దీర్ఘకాలంలో అనేక ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




- బెల్ట్ బిగుతుగా పెట్టుకుంటే.. నరాల సమస్య పెరుగుతుంది. ఎక్కువ రోజులు అలాగే కొనసాగిస్తే.. రక్తనాళాల్లో రక్త సరఫరా మందగిస్తుంది. దీర్ఘకాలంలో ఉదర కండరాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది.
- బెల్ట్‌ను టైట్‌గా ధరించడం వల్ల.. కడుపుపై ఒత్తిడి పెరుగుతుంది. దాంతో కడుపులోని ఆమ్లాలు గొంతులోకి చేరుతాయి. ఎసిడిటీ సమస్యలు వస్తాయి. కొందరిలో యాసిడ్ రిఫ్లెక్స్ కూడా ఎక్కువ అవుతుంది.
- కటి ప్రాంతంపై ఒత్తిడి పడటం వల్ల పునరుత్పత్తి అవయవాలు ప్రభావితం అవుతాయి. సంతానోత్పత్తిపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది.
- ఇక బెల్టును బిగుతుగా ధరించడం వల్ల వెన్నెముక కూడా ఒత్తిడికి గురవుతుంది. వెన్నునొప్పి ఇబ్బంది పెడుతుంది. మోకీళ్లపై ఒత్తిడి పెరిగి.. భవిష్యత్తులో మోకాళ్ల నొప్పులు ఎక్కువ అవుతాయి.

బదులుగా.. వదులుగా ఉండే బెల్టులను ధరించాలి. శరీర కొలతలకు తగ్గట్టుగా ప్యాంటు సైజును ఎంచుకోవాలి. బెల్టు మాత్రమే కాదు, బిగుతు దుస్తులు ధరించినా.. ఇలాంటి సమస్యలే వస్తాయి. కాబట్టి, దుస్తులు కొంచెం వదులుగా ఉండేలా చూసుకోవాలి.

అకస్మాత్తుగా కుంటుతున్నాడు..

మా బాబు వయసు మూడు సంవత్సరాలు. హుషారుగానే ఆడుకుంటాడు. ఇంతకు ముందు ఎటువంటి ఆరోగ్య సమస్యలూ లేవు. అందరిలానే పరుగెత్తుతాడు, మాట్లాడతాడు. కానీ, వారం రోజులుగా తన నడకలో మార్పు కనిపిస్తున్నది. ఎందుకో కుంటుతున్నాడు. డాక్టర్‌కి చూపిస్తే.. నొప్పి ఉందని, కొన్ని నొప్పి తగ్గించే మందులు ఇచ్చారు. అవి వాడినా తగ్గలేదు. ఇప్పుడు ఏ వైద్యుడిని సంప్రదించాలి?



మూడు సంవత్సరాల వయసు పిల్లలు చాలా హుషారుగా ఉంటారు. బాగా గెంతుతూ ఉంటారు. కుంటిగా నడవడం, నడకలో తేడా వచ్చిందంటే లోపల ఏదో సమస్య ఉండే ఉంటుంది. మీరు ఇప్పటికే వైద్యులకు చూపించామని చెబుతున్నారు. కానీ, ఏ డాక్టర్ అన్నది వివరించలేదు. పిల్లల వైద్యులతో తప్పని సరిగా చికిత్స చేయించాలి. ఎటువంటి గాయం లేకుండా, దెబ్బ కనిపించకుండా ఉన్నా.. పెద్దలు చూడనప్పుడు కిందపడి గాయపడవచ్చు. అవి కనిపించకపోవచ్చు. అందువల్ల నొప్పి, నడకలో మార్పు వస్తుంది. అలాంటి నొప్పి రెండు, మూడు రోజుల్లో సాధారణంగా తగ్గిపోవాలి. కొన్నిసార్లు జాయింట్స్ (కీళ్ల)లో, ఎముకలో, కండరాల్లో ఇన్‌ఫెక్షన్ ఉన్నా నొప్పి కలగడం, నడకలో మార్పు రావడానికి ఆస్కారం ఉంటుంది. ఆ ఇన్‌ఫెక్షన్ ఉంటే జ్వరం వస్తుంది. బిడ్డ హుషారుగా ఉండకపోవడం, రోజూ ఆడినట్టుగా ఆడకపోవడం జరుగుతుంది. కొన్నిసార్లు వారం, రెండు వారాల పాటు ఇన్‌ఫెక్షన్ ఉంటే కీళ్లలో నీరు చేరుతుంది. తుంటి ఎముక కీళ్లలో ఎక్కువగా ఈ సమస్య వస్తుంది. ఈ ఇబ్బంది దానికదే తగ్గిపోతుంది. కొద్దిగా నొప్పి, కుంటుతూ నడవడం కనిపిస్తాయి. ఏది ఏమైనా, పిల్లల డాక్టర్, కుదిరితే పిల్లల ఎముకల డాక్టర్‌కి చూపిస్తే మంచిది. అవసరమైన ఎక్స్‌రే, స్కాన్, రక్తపరీక్షలు చేయించాలి. ఆ తర్వాత వైద్యుల సలహాలు పాటించాలి.



డాక్టర్ విజయానంద్
నియోనేటాలజిస్ట్ అండ్
పీడియాట్రీషియన్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్

మీ ఇంట్లో నూనెలు మంచివేనా?!

అనలతల్పమైన నూనెలో చక్కగా వేయించిన పకోడీలు తింటుంటే మజా అనిపిస్తుంది. సలసల మసిలే ఆయిల్‌లో మునకేసిన బజ్జీలు ప్రియంగా తింటాం. అంతెందుకు.. ఇంట్లో తిరగమోతలో కాస్త నూనె ఎక్కువగా వెయ్యమని ఆర్డర్లు జారీ చేస్తుంటాం. పండుగల వేళ పిండి వంటలు సరేసరి! జిహ్వ చాపల్యం కొద్దీ నూనెలో మునిగి తేలిన పదార్థాల చుట్టూ తిరుగుతుంటారు చాలామంది! అయితే, ఆయిల్‌ఫుడ్‌తో అంటకాగితే గుండెకు ముప్పు తప్పదు. ఆయిల్ బ్రాండ్ ఏదైనా... నూనె పదార్థాలు మితిమీరి తినడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరిగి గుండె సమస్యలకు దారితీస్తుంది.

వనస్పతి: ప్రస్తుతం అనేక కుటుంబాలు వనస్పతిని విరివిగా వాడుతున్నాయి. కానీ దాన్ని తయారు చేసే ప్రక్రియలో హైడ్రోజనేషన్ చేస్తారు. ఈ ప్రక్రియలో ట్రాన్స్‌ఫ్యాట్స్ ఉత్పత్తి అవుతాయి. వాటివల్ల చెడు కొలెస్ట్రాల్ పెరిగి మంచి కొలెస్ట్రాల్ తగ్గిపోతుంది. దీన్ని పూర్తిగా వాడకపోవడం ఉత్తమం.



పామ్ ఆయిల్: తక్కువ ధరకే లభించే ఈ పామ్ ఆయిల్‌ను హోటల్స్, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో అత్యధికంగా వాడుతుంటారు. కానీ, ఇందులో ఉండే సాచురేటెడ్ ఫ్యాట్స్ గుండెలోని ధమనుల్లో ప్లాక్ పేరుకుపోయేందుకు దారి తీస్తాయి. పామ్ అయిల్ వాడకం వల్ల కొలెస్ట్రాల్ పెరగడంతో పాటు గుండె సంబంధిత సమస్యలు తలెత్తుతాయి.

రిఫైన్డ్ ఆయిల్: రిఫైన్డ్ సన్‌ఫ్లవర్, సోయాబీన్, కార్న్ ఆయిల్ వంటివి ఆరోగ్యకరమైనవిగానే కనిపించినా, తయారీ ప్రక్రియలో సహజ పోషకాలను కోల్పోతాయి. వాటిలో రసాయన అవశేషాలు, ఆక్సిడైజ్డ్ ఫ్యాట్స్ చేరడంతో శరీరానికి హాని చేకూరుతుంది. వీటిలో ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండటం వల్ల ఇన్‌ఫ్లమేషన్ తలెత్తుతుంది. రిఫైన్డ్ నూనెలకు బదులు తక్కువ ప్రాసెస్ చేసిన నూనెలను మితంగా వాడటం మంచిది.

కాటన్‌సీడ్ ఆయిల్: స్నాక్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వాడే ఈ నూనెల్లో సాచ్‌రేటెడ్ ఫ్యాట్స్, ఒమేగా-6 అధిక మోతాదులో ఉండటంతో పాటు గాసిపాల్ అనే సహజ విషపదార్థం కూడా ఉంటుంది. ఈ విషపదార్థం పూర్తిగా తొలగించకపోతే మన ప్రాణాలకే ప్రమాదం. ఒమేగా-6, ఒమేగా-3ల మధ్య సమతౌల్యం లోపించి గుండె ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది.

కొబ్బరినూనె: ఇటీవలి కాలంలో కొబ్బరినూనెను ఆరోగ్యకరమైనదిగా ప్రచారం చేస్తున్నారు. నిజానికి ఇందులో 90 శాతం సాచురేటెడ్ ఫ్యాట్ ఉంటుంది. తక్కువ మోతాదులో వాడితే కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఎక్కువ మొత్తంలో వాడితే ఇబ్బందులు తప్పవు.

ఒత్తిడి హార్మోన్ తగ్గాలంటే..

మారుతున్న జీవనశైలి, బతుకు పోరాటంలో ఎంతోమంది విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ వివిధ సమస్యలతో సతమతమవుతున్నారు. దానివల్ల వాళ్లలో ఒత్తిడి కలిగించే కార్టిసాల్ హార్మోన్ విడుదలవుతున్నది. ఇది అధిక బరువు, ఆందోళన, అలసట లాంటి సమస్యలకు కారణమవుతున్నది. అందువల్ల రోజువారీ ఆహారంలో ఈ కార్టిసాల్ హార్మోన్ స్థాయులను తగ్గించే పదార్థాలను తీసుకోవాలి.

మెగ్నీషియం: శరీరంలో మెగ్నీషియం స్థాయులు తగ్గినప్పుడు, కార్టిసాల్ పెరుగుతుంది. దీనివల్ల నాడీ వ్యవస్థ పనితీరులో సమస్యలు వస్తాయి. అందుకే మెగ్నీషియం ఎక్కువగా ఉండే గింజలు, విత్తనాలు, చిక్కుళ్లు, ఆకుకూరలు, అరటిపండ్లు, అవకాడో, చేపలను ఆహారంలో చేర్చుకోవాలి.



విటమిన్-సి: కార్టిసాల్ ఉత్పత్తిని నియంత్రించే అడ్రినల్ గ్రంథి పనితీరుకు విటమిన్-సి బాగా ఉపయోగపడుతుంది. దీర్ఘకాల ఒత్తిడికి కారణమయ్యే ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను విటమిన్-సి తటస్థీకరిస్తుంది. అందుకే విటమిన్-సి అధికంగా ఉండే నారింజ, నిమ్మ, స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, కివి, బ్రకోలీ, క్యాప్సికమ్, టమాటా, క్యాబేజీ వంటి పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలి.

ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు: ఇవి శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్, కార్టిసాల్ స్థాయులను తగ్గిస్తాయి. ఒమేగా-3 ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటుంది. చేపలు, వాల్‌నట్స్, అవిసె గింజలను తరచూ తీసుకోవాలి. వీటితోపాటు అవసరాన్ని బట్టి డాక్టర్‌ను సంప్రదించి ఫిష్ ఆయిల్ సప్లిమెంట్లు కూడా వాడొచ్చు.

బి-విటమిన్ (బీ5, బీ6, బీ12): శరీరంలో శక్తికైనా, అడ్రినల్ ఆరోగ్యానికైనా విటమిన్-బి చాలా ముఖ్యం. అయితే విటమిన్- బీ5, బీ6, బీ12 మానసిక ఆరోగ్యం, నాడీ వ్యవస్థ పనితీరులో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి శరీరంలో లోపించినప్పుడు కార్టిసాల్ ఉత్పత్తి పెరుగుతుంది. ఇలాంటప్పుడు ఆహారంలో తృణధాన్యాలు, గుడ్లు, చిక్కుళ్లు తీసుకోవాలి. ఇవి హార్మోన్ల అసమతుల్యతకు మంచి పరిష్కారంగా పని చేస్తాయి.

ఫాస్ఫాటిడైల్సెరిన్: ఈ న్యూట్రియెంట్ మెదడు ఆరోగ్యానికి బాగా ఉపయోగపడుతుంది. అలాగే శరీరంలో కార్టిసాల్ స్థాయులను తగ్గిస్తుంది. ఇది సోయాబీన్స్, చేపలు వంటి వాటిలో ఉంటుంది. అయితే ఫాస్ఫాటిడైల్సెరిన్ అనే పోషకం మనం రోజువారీగా తీసుకునే ఆహారంలో తక్కువగా ఉంటుంది. కాబట్టి డాక్టర్‌ను సంప్రదించి సప్లిమెంట్స్ తీసుకుంటే మంచిది.

మానేసిన నిమిషాల్లోనే మంచి మార్పు మొదలు


ధూమపానం ఆరోగ్యానికి హానికరం. దానివల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి. మరి అదే ధూమపానం మానేసిన నిమిషాల్లోనే శరీరంలో మార్పులు మొదలవుతాయి. అన్నాళ్లూ స్మోకింగ్‌తో వాటిల్లిన నష్టం తగ్గుతూ వస్తుంది.

మొదటి 20 నిమిషాలు: ధూమపానం సమయాన్ని బట్టి చేస్తుంటారు. కొందరు పదినిమిషాలకో సిగరెట్ వెలిగిస్తుంటారు. అంతటి చెయిన్ స్మోకర్లు కూడా ధూమపానానికి స్వస్తి పలికితే తొలి 20 నిమిషాల్లోనే శరీరంలో మార్పు మొదలవుతుంది. రక్తపోటు సాధారణ స్థాయికి వస్తుంది. చేతులు, కాళ్ల ఉష్ణోగ్రత సాధారణ స్థితికి చేరుకుంటుంది.

8 గంటలు: వరుసగా ఎనిమిది గంటలు ధూమపానం జోలికి వెళ్లకుండా ఉంటే, సిగరెట్ల వల్ల శరీరంలోకి వెళ్లిన రసాయనాల స్థాయులు తగ్గిపోతాయి. దాంతో ఆక్సిజన్ సాధారణ స్థాయికి వస్తుంది. అయితే ఎక్కువగా క్రేవింగ్స్ వస్తాయి. అప్పుడు నియంత్రించుకుంటే 10-15 నిమిషాల్లో క్రేవింగ్స్ తగ్గుతాయి. ధూమపానం వైపు మనసు మళ్లినప్పుడు చూయింగ్ గమ్ నమలడమో, నీళ్లు తాగడమో చేయాలి.

12 గంటలు: రోజులో సగం సమయం అయిపోతుంది కాబట్టి గుండె ప్రశాంతంగా, ఆరోగ్యంగా కొట్టుకోవడం మొదలవుతుంది. ముందులా ఆక్సిజన్ కోసం వేగంగా కొట్టుకునే శ్రమ దానికి ఉండదు.

48 గంటలు: రెండు రోజుల తర్వాత రుచి, వాసన వంటివి బాగా పని చేస్తాయి. నరాలన్నీ ఆరోగ్యంగా పని చేసేందుకు సిద్ధమవుతుంటాయి. ఊపిరితిత్తులు అప్పటివరకూ తనలో పేరుకుపోయిన శ్లేష్మాన్ని బయటికి పంపించే పనిలో పడతాయి. దాంతో శరీరంలో నికోటిన్ తరిగిపోతుంది. ఆ సమయంలో ఆకలి, అలసట, తలనొప్పి వంటివి వస్తాయి. దానికోసం డాక్టర్‌ను సంప్రదించి సరైన చికిత్స తీసుకుంటే సరిపోతుంది.



వారాలు, నెలలు: రోజులు గడుస్తున్న కొద్దీ ఊపిరితిత్తులు పూర్తి ఆరోగ్యాన్ని సంతరించుకుంటాయి. మెల్లిమెల్లిగా వ్యాయామం అలవాటు చేసుకుంటే, గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. స్మోకింగ్‌కు బై చెప్పిన ఏడాదికి గుండెపోటు వచ్చే అవకాశం సగానికి సగం తగ్గుతుంది. అలాగే ఐదేళ్లు వచ్చేసరికి.. ధూమపానం చేయనివారితో సమానంగా గుండె పదిలంగా ఉంటుంది. అలాగే నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్ వచ్చే అవకాశాలు కూడా పూర్తిగా తగ్గుతాయి.

క్యాల్షియంతో పాటు..

ఎముక నిర్మాణంలో క్యాల్షియం ఎంత ముఖ్యమో విటమిన్ డి అంతే అవసరం. ఇవి రెండు సరిపోయేంత ఉంటేనే ఎముకలు పటిష్టంగా ఉంటాయి. ఆహారం ద్వారా శరీరంలోకి చేరిన క్యాల్షియం ఎముకకు చేరాలంటే విటమిన్ డి కీలక పాత్ర పోషిస్తుంది. క్యాల్షియంను ఎముకకు చేర్చే క్రమంలో విటమిన్ డి ఒక వాహకంలా పనిచేస్తుంది. విటమిన్ డి తగినంత లేకుంటే ఆహారం, సప్లిమెంట్స్ ద్వారా ఎంత క్యాల్షియం తీసుకున్నా వ్యర్థమవుతుంది. నిజానికి మన చర్మంలో విటమిన్ డి క్రియారహిత రూపంలో ఉంటుంది. ఎప్పుడైతే సూర్యరశ్మి తగులుతుందో అప్పుడు డి విటమిన్ యాక్టివ్ అవుతుంది. అందుకే ప్రతి రోజు ఉదయం పూట కనీసం గంట సేపు ఎండ తగిలేలా చూసుకోవాలి. మారిన జీవనశైలి కారణంగా విటమిన్ డి లోపాన్ని ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వారు సప్లిమెంట్స్ రూపంలో తీసుకోవచ్చు. వైద్యుల సూచన మేరకు క్యాల్షియం, విటమిన్ డి మందులు వాడొచ్చు.

108 అంబులెన్స్‌ల్లో భారీ స్కామ్!

శాలరీలు, మెయింటెనెన్స్ కలిపి

ప్రతి నెలా 7.5 కోట్ల గోల్‌మాల్

ఉద్దేశపూర్వకంగా వాహనాలు బ్రేక్‌డౌన్

- ఉద్యోగులకు 20 రోజులే డ్యూటీ
- మిగిలిన రోజులకు జీతాలు ఎగవేత
- ప్రశ్నిస్తే.. 'రిలీవర్ ఉన్నారు ఆఫ్ తీసుకోవాల్సిందే' అంటూ హుకుం
- మెయింటెనెన్స్ డబ్బుల్లో గోల్‌మాల్
- వాహనానికి చెల్లిస్తున్న 2 లక్షల్లో రూ. లక్ష అధికారుల జేబుల్లోకి..!
- అన్ని స్థాయిల ఆఫీసర్లకు వాటాలు
- ఓ మంత్రి కూతురి కనుసన్నల్లోనే వ్యవహారమన్న ఆరోపణలు



793	రాష్ట్రవ్యాప్తంగా 108 అంబులెన్సుల సంఖ్య
మొత్తం సిబ్బంది	4,758
సిబ్బందికి అందాల్సిన వేతనాలు	రూ.22,000-30,000
ప్రస్తుతం అందుతున్న వేతనం	రూ.12,000-18,000

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): 'కాదేదీ అనినీతికి అనర్హం' అన్న చందంగా రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు తీరు కొనసాగుతున్నది. తాజాగా 108 అంబులెన్స్‌లో భారీ స్కామ్ వెలుగు చూసింది. ఉద్దేశపూర్వకంగా వాహనాలను బ్రేక్‌డౌన్ చేసి సిబ్బంది నెలరోజులు పనిచేయాల్సి ఉండగా, 15 నుంచి 20 రోజులే డ్యూటీలు వేస్తూ అధికారులు కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లతోపాటు అన్ని స్థాయిల అధికారులకు డబ్బులు ముడుతున్నట్టు సమాచారం. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో 580 వరకు 108 అంబులెన్స్‌లు ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం మరో 213 కొత్త వాహనాలను ప్రారంభించింది. దీంతో 108 అంబులెన్స్‌ల సంఖ్య 793కి చేరింది. వీటిలో 4,758 సిబ్బంది పనిచేస్తున్నారు. వీరి స్థాయిని బట్టి ఈఎస్ఐ, పీఎఫ్ కలుపుకుని రూ.22,000 నుంచి రూ.30,000 వరకు వేతనంగా ప్రభుత్వం నిర్ణయించింది. కాగా సిబ్బంది వేతనం, 108 అంబులెన్స్ మెయింటెనెన్స్‌కు ఒక్కో వాహనానికి ప్రభుత్వం ప్రతి నెలా కాంట్రాక్టు కంపెనీకి రూ.2 లక్షల వరకు చెల్లిస్తున్నది. అయితే నెలలో 30 రోజులు వీరు పని చేయకుండా ఉద్దేశపూర్వకంగా వాహనాలను బ్రేక్‌డౌన్ చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. నెలలో 15-20 రోజులు మాత్రమే పనిచేస్తుండగా.. ఒక్కో ఉద్యోగికి రూ.12,000-రూ.18,000 వరకు మాత్రమే వేతనం వస్తున్నదని సిబ్బంది వాపోతున్నారు. పది రోజుల పాటు తమకు విధులు కేటాయించకుంటే ఎలా? అని అధికారులను ప్రశ్నిస్తే.. రిలీవర్ ఉన్నారని ఆఫ్ తీసుకోవాల్సిందే అంటూ హుకుం జారీ చేస్తున్నారని సిబ్బంది చెప్తున్నారు.

ప్రతి నెలా 7.5 కోట్లు ఆఫీసర్ల జేబుల్లోకి..!

ఒక్కో వాహనానికి ప్రభుత్వం రూ.2లక్షలు కేటాయిస్తుండగా.. ఆ మొత్తంపై కన్నేసిన కొంతమంది అధికారులు ఉద్దేశపూర్వకంగా 108 సిబ్బంది తక్కువ రోజులు విధులు నిర్వహించేలా కుట్రపన్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఒకవైపు వాహనాన్ని బ్రేక్‌డౌన్ చేస్తూనే, మరోవైపు మెయింటెనెన్స్ డబ్బులపై అధికారులు కన్నేశారు. ఇలా ఒక్కో వాహనానికి రూ.లక్ష చొప్పున మొత్తంగా ప్రతి నెలా రాష్ట్రవ్యాప్తంగా రూ.7.5 కోట్లు అధికారులు మిగుల్చుకుంటున్నారని సమాచారం. ఈ మొత్తం వ్యవహారం ఓ మంత్రి కూతురి కనుసన్నల్లోనే జరుగుతున్నట్టు ఆరోపణలున్నాయి. సదరు మంత్రి కూతురు రాష్ట్రంలోని నిమ్స్, గాంధీ, నిలోఫర్, ఉస్మానియా సహా ఇతర జిల్లాల 108 మెయింటెనెన్స్ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇంత పెద్ద మొత్తంలో నిధులు పక్కదారి పడుతున్నా ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చూసీ చూడనట్టు వ్యవహరించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా ఇదంతా జరగదని సిబ్బంది చర్చించుకుంటున్నారు.

ఆయుష్ డాక్టర్లపై కేసులు కొట్టివేత

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): అల్లోపతి వైద్యం చేస్తున్నారంటూ ఆయుష్ డాక్టర్లపై నమోదైన కేసులను హైకోర్టు కొట్టివేసింది. వారిపై నేరుగా చర్యలు తీసుకునే అధికారం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీఎంసీ)కి లేదని తీర్పు చెప్పింది. నిబంధనలకు విరుద్ధంగా ఆయుష్ డాక్టర్లు ప్రాక్టీస్ చేస్తుంటే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని స్పష్టంచేసింది. ఆయుష్ డాక్టర్లపై ఏమైనా ఫిర్యాదులు, పోలీసుల ప్రాథమిక నివేదిక ఉంటే వాటి ఆధారంగా చర్యలు తీసుకునే అధికారం ఆయుష్ కమిషనర్‌కు ఉన్నదని న్యాయస్థానం తెలిపింది. క్లినిక్‌లలో సోదాలు నిర్వహించడం, అల్లోపతి వైద్యం చేస్తున్నామంటూ టీఎంసీ ఫిర్యాదుల మేరకు తమపై కేసులు నమోదు చేయడం చెల్లదని సైబరాబాద్, సంగారెడ్డికి చెందిన ముగ్గురు డాక్టర్లు వేసిన పిటిషన్లపై జస్టిస్ తుకారాంజీ ఈ తీర్పు చెప్పారు.

ఎంబీబీఎస్ కన్వీనర్ మెరిట్ లిస్టు విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్టును కాళోజీ హెల్త్ యూనివర్సిటీ సోమవారం విడుదల చేసింది. మంగళవారం నుంచి ఈ నెల 18 వరకు https://tsmedadm.tsche.in/ వెబ్‌సైట్ ద్వారా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని నోటిఫికేషన్‌లో కోరింది.

వైద్య విద్యార్థులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలి

కాళోజీ వర్సిటీ వీసీకి హెచ్‌ఆర్డీఏ ప్రతినిధుల వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): వైద్య కళాశాలల్లో చదువుతున్న యూజీ, పీజీ వైద్య విద్యార్థులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్డీఏ) డిమాండ్ చేసింది. సోమవారం కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేసింది. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు బ్రహ్మేశ్వర్, జనరల్ సెక్రటరీ కార్తిక్ మాట్లాడుతూ.. ఆసుపత్రులు, ల్యాబొరేటరీల్లో హైరిస్క్ వాతావరణంలో వైద్య విద్యార్థులు పనిచేస్తారని తెలిపారు.



ఎంజీయూలో కాన్వకేషన్‌లో విద్యార్థులకు బంగారు పతకాలు, పట్టా అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఐఐటీ హైదరాబాద్ సంచాలకుడు బీఎస్ మూర్తి

కృత్రిమ మేధస్సుకు విద్యార్థులను సిద్ధం చేయండి

- ఎంజీయూ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- 57 మందికి బంగారు పతకాలు, 22 మందికి పీహెచ్‌డీ పట్టాల పంపిణీ

రామగిరి, సెప్టెంబర్ 15: యూనివర్సిటీలు విద్యార్థులను కొత్త సాంకేతికత, పరిశ్రమలు, విద్య, ఉపాధిని పునర్నిర్మించడానికి సిద్ధంగా ఉన్న కృత్రిమ మేధస్సుకు సిద్ధం చేయాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో 4వ కాన్వకేషన్ అట్టహాసంగా సాగింది. చాన్స్‌లర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. 57 మంది పీజీ విద్యార్థులకు బంగారు పతకాలు, పీహెచ్‌డీ పూర్తి చేసిన 22 మంది విద్యార్థులకు కాన్వకేషన్ పట్టాలను ఐఐటీ హైదరాబాద్ సంచాలకుడు బీఎస్ మూర్తితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగం, పరిశోధన, ఆవిష్కరణలు, సేవా కార్యకలాపాలలో అద్భుతమైన పురోగతి సాధిస్తున్న మహాత్మా గాంధీ వర్సిటీ గ్రామాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులను ఆకర్షించడం హర్షణీయమని కొనియాడారు. ఐఐటీ హైదరాబాద్ సంచాలకుడు బీఎస్ మూర్తి, ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ యూనివర్సిటీ అభివృద్ధితో పాటు భవిష్యత్తులో అమలు చేసే నూతన కోర్సుల విషయాలను వెల్లడించారు. గవర్నర్‌ను నల్లగొండ ఎంపీ కుందూరి రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, నాయకుడు అద్దంకి దయాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దేవసేన, రిజిస్ట్రార్ అల్వాల రవి, గవర్నర్ ఏడీసీ భవానీప్రసాద్, ఎంజీయూ సీవోఈ ఉపేందర్‌రెడ్డి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ఆకుల రవి పాల్గొన్నారు.



రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఫార్మా బాధిత రైతులు

నాడు పాదయాత్రలు చేసి.. నేడు విస్మరిస్తారా?

- పాదయాత్ర చేసిన మీరే మాతోపాటు కోర్టుకు రావాలి
- కోదండరాం, కోదండరెడ్డిని నిలదీసిన ఫార్మా రైతులు
- ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్

యాచారం, సెప్టెంబర్ 15: తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిపై ఫార్మా బాధిత రైతులు ఆక్రోశం వెళ్లగక్కారు. 'బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నాడు మాతో కలిసి పాదయాత్రలు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి.. మీకు పదవులు రాగానే మమ్మల్ని విస్మరిస్తారా?' అంటూ రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన ఫార్మా బాధిత రైతులు సోమవారం తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాం, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని నిలదీశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రైతులు ఇరువురికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు వారి ముందు తమ ఆవేదనను వెళ్లగక్కారు. 'గతంలో ఫార్మాసిటీకి భూములు ఇవ్వొద్దని మాతో కలిసి ఎలా పాదయాత్ర చేశారో.. మాకు కోర్టు నోటీసులు వచ్చినందున మాతో కోర్టుకు రావాలి' అని చెప్పారు.

సోమిరెడ్డిది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే

ఎంవోఎన్‌టీఈఏ విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్15 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ఎంపీడీవో కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించిన సోమిరెడ్డిది ఆత్మహత్య కాదని, ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని తెలంగాణ మైనార్టీ ఔట్‌సోర్సింగ్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండిపడింది. సుదీర్ఘకాలం వేతనాలను చెల్లించకుండా సర్కార్ నిర్లక్ష్యం చేయడం వల్లే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ రాజమ్మద్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సోమిరెడ్డి ఆరు నెలలుగా వేతనం అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో మానసిక ఒత్తిడికి గురై, ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత బాధాకరమని విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం కండ్లు తెరవాలని డిమాండ్ చేశారు.

పాలమూరు ప్రాజెక్టుపై త్వరలో కార్యాచరణ

జిల్లా బీఆర్‌ఎస్ నేతల సమావేశం



హైదరాబాదులోని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో సమావేశమైన మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నేతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలో కార్యాచరణ ప్రకటించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్‌ఎస్ నేతలు నిర్ణయించారు. హైదరాబాదులోని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో సోమవారం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై బీఆర్‌ఎస్ నేతలు మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు, బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, గద్వాల బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమంతునాయుడు, కేశవులు తదితరులు సమావేశమయ్యారు. పాలమూరు ప్రాజెక్ట్ 85 శాతం పూర్తయిందని, ఐదు రిజర్వాయర్లు 85 శాతం పూర్తయ్యాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. 15 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నట్టు, కాలువల టెండర్లు పిలిచారని అన్నారు. నార్లపూర్ వద్ద పంప్‌హౌస్ ట్రయల్‌రన్ చేశారని చెప్పారు. ప్రాజెక్ట్ పనులు పూర్తి చేస్తే మహబూబ్‌నగర్ పచ్చబడుతుందని, 15 లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుందని అన్నారు. పాలమూరు వలసలు పూర్తిస్థాయిలో ఆపాలంటే ప్రాజెక్ట్ పూర్తి చేయాలని అభిప్రాయపడ్డారు. నీళ్లు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని, పంపులతో రిజర్వాయర్లు నింపుకున్నా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వానికి సమయం ఇవ్వాలనే ఇన్ని రోజులు ఆగామని, ఇక కలిసి వచ్చే నాయకులతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కార్యాచరణ రూపొందిస్తామని నేతలు స్పష్టంచేశారు. పార్టీలకు అతీతంగా పాలమూరు ప్రాజెక్ట్ కోసం అందరు కలిసి రావాలని, అందరినీ సమన్వయము చేసే విధంగా కార్యాచరణ ఉంటుందని వారు వివరించారు.

అక్రెడిటేషన్ విధివిధానాలు రూపొందించండి

- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశం
- జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్టు వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్‌కార్డులు అందేలా విధివిధానాలు రూపొందించాలని ఐఅండ్‌పీఆర్ అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. జర్నలిస్టుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను తక్షణమే రూపొందించాలని సూచించారు. సోమవారం సచివాలయంలో జర్నలిస్టులకు సంబంధించి అక్రెడిటేషన్, హెల్త్ పాలసీ, అవార్డులు, జర్నలిస్టులపై దాడులను అరికట్టడం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని స్పష్టంచేశారు. జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించామని, ఇన్సూరెన్స్ పాలసీల్లో ఏది ప్రయోజనకరంగా ఉంటుందో అనే అంశంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. జర్నలిస్టులకు అవార్డులను పునరుద్ధరించాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

నవంబర్ 25లోగా 'మద్యం' లైసెన్సులు

- 8లోగా ఎక్సైజ్ షెడ్యూల్
- దరఖాస్తులకు నెల రోజుల గడువు
- కొత్త మద్యం దుకాణాల ఏర్పాటు తర్వాతే ఎక్సైజ్ ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు

హైదరాబాద్, సెప్టెంబర్15 (నమస్తే తెలంగాణ): కొత్త మద్యం దుకాణాలకు లైసెన్స్‌ల జారీ కోసం అక్టోబర్ 8లోగా షెడ్యూల్ విడుదల చేయాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. షెడ్యూల్ వెలువడిన మరుసటి రోజు నుంచే దరఖాస్తులు స్వీకరించేందుకు ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం కసరత్తు చేస్తున్నది. 2011 జనాభా లెక్కల ఆధారంగా ప్రస్తుతం రాష్ట్రంలో 2,620 మద్యం దుకాణాలు ఉన్నాయి. అవి ప్రస్తుత జనాభాకు సరిపోవని, దుకాణాల సంఖ్యను పెంచాలని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారా రూ.3,700 కోట్ల ఆదాయం దాటుతుందని అంచనా వేసింది. దరఖాస్తు ఫీజును రూ.3 లక్షలకు పెంచినందున మద్యం వ్యాపారులకు నెల రోజులు గడువు ఇవ్వడం ద్వారా ఎక్కువ దరఖాస్తులు వచ్చేలా చూడాలని, అప్పటికీ తగినన్ని దరఖాస్తులు రాకపోతే మరో 10 రోజులు గడువు పొడిగించాలని నిర్ణయించినట్టు తెలిసింది. నవంబర్ 25 లోగా లైసెన్సుల జారీని పూర్తిచేసి, డిసెంబర్ 1 నుంచి వాటిని అమల్లోకి తీసుకొచ్చేందుకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఎక్సైజ్ శాఖలో ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, బదిలీలను డిసెంబర్ రెండో వారం నుంచి చేపట్టాలని కమిషనర్ యోచిస్తున్నట్టు తెలిసింది.

కల్తీ, అక్రమ మద్యంపై ఎక్సైజ్ కొరడా!

30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కల్తీమద్యం, నకిలీ మద్యం, పన్నులు చెల్లించని మద్యం, సారాను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం వెల్లడించారు. దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని 30 వరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రైళ్లు, బస్సులు, ఇతర వాహనాలు, గోదాములు, రైస్ మిల్లుల్లో సోదాలు చేపడుతామని, చెక్‌పోస్టుల వద్ద నిఘా పెడుతామని చెప్పారు. ఖరీదైన మద్యంలో, తక్కువ ధర కలిగిన మద్యం కలిపి అమ్మకాలు చేపట్టే వారిపై, కల్తీ మద్యం తయారుచేసే కేంద్రాలపై దాడులు నిర్వహిస్తామని తెలిపారు. గోవా, ఢిల్లీ, హర్యానా నుంచి దిగుమతి అయ్యే పన్నులు చెల్లించని, డిఫెన్స్ మద్యం రవాణా, అమ్మకాలపై దృష్టిసారించామని స్పష్టంచేశారు. వరంగల్, మహబూబాబాద్, అదిలాబాద్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలోని సారా స్థావరాలపై మూకుమ్మడిగా దాడులు నిర్వహించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను షానవాజ్ ఖాసీం ఆదేశించారు. పన్నులు చెల్లించని మద్యం విక్రయాలకు సంబంధించి 2014 నుంచి 2025 ఆగస్టు నాటికి 4,516 కేసుల నమోదు పెట్టి, 3,238 మందిని అరెస్ట్ చేశామని, సారా తయారీ, విక్రయాలకు సంబంధించి 2,75,028 కేసులు నమోదు చేసి, 1,59,974 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు.

మా అమ్మకు వైద్యం చేయించండి

తల్లిని వెంటబెట్టుకుని సచివాలయానికి వచ్చిన యువకుడు

- సనత్‌నగర్‌కు చెందిన వృద్ధురాలికి అర్ధరాత్రి పక్షవాతం
- వైద్యం కోసం గాంధీ దవాఖానకు తరలించిన కుమారుడు
- బెడ్ ఖాళీ లేదని దవాఖానలో జాయిన్ చేసుకోని వైద్యులు
- సీఎం ఆదుకోవాలంటూ.. సెక్రటేరియట్ వద్ద ఆర్తనాదాలు
- రంగంలోకి దిగిన పోలీసులు.. వెంటనే దవాఖానకు తరలింపు



సచివాలయం వద్ద పక్షవాతం వచ్చిన తన తల్లిని చూపిస్తున్న యువకుడు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాల్సిన దుస్థితి నెలకొన్నది. ఆపద వచ్చినా... కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నా దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతున్నది. అత్యవసర వైద్యం చేయించుకోవాల్సి వచ్చినా ప్రజల ప్రాణాలు గాల్లో దీపాలుగానే మారిపోతున్నాయి. ఇందుకు నిదర్శనంగా నిలిచే హృదయవిదారకమైన ఓ ఘటన హైదరాబాద్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. సనత్‌నగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన దాసరి సులోచన (62)... కుమారుడితో కలిసి జీవిస్తున్నది. ఆదివారం అర్ధరాత్రి ఆమె మూతి వంకర పోయి, శరీరం బిగుసుకు పోయింది. ఆమె కుమారుడు గమనించి చుట్టూ పక్కల వారిని పిలిచాడు. ఆమెకు పక్షవాతం వచ్చిందని, గాంధీ దవాఖానకు తరలించారని స్థానికులు సలహా ఇచ్చారు. రాత్రి ఒంటి గంటకు అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే రాలేదు. ఆలస్యం చేయకుండా బైక్ మీదనే హుటాహుటిన తన తల్లిని సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించాడు. తల్లిని కాపాడుకోవాలనే ఆత్రుతతో అక్కడికి వెళ్లిన అతడికి నిరాశే ఎదురైంది. బెడ్స్ ఖాళీగా లేవని, మరో దవాఖానకు తరలించాలని వైద్యులు చేతులెత్తేశారని తెలిసింది. 'మా అమ్మకు వైద్యం చేయండి సారూ' అని కనపడిన ప్రతీ డాక్టర్‌ను కాళ్లావేళ్లా పడి వేడుకున్నాడు. అయినా ఒక్కరు కనికరించలేదు. రాత్రి నుంచి తెల్లవారే వరకు అక్కడే వేచి ఉన్నారు. పొద్దున్నే మళ్లీ డాక్టర్లను కలిశాడు. 'మా అమ్మను బతికించండి సారూ' అంటూ మళ్లీ వేడుకున్నాడు. 'బెడ్లు ఖాళీ లేవు వెళ్లిపోండి' అంటూ వైద్యులు అదే మాట మళ్లీ మళ్లీ చెప్పారని తెలిసింది.

వైద్యం చేయించాలని సీఎంకు మొర

అనారోగ్యానికి గురైన తన తల్లిని తెల్లవారిన తర్వాతైనా దవాఖానలో జాయిన్ చేసుకుంటారని బాధితురాలి కుమారుడు నిరీక్షించాడు. కానీ వైద్యులు బెడ్ లేదనే సమాధానమే చెప్పడంతో తన తల్లిని బైక్ మీద ఎక్కించుకొని నేరుగా సెక్రటేరియట్‌కు చేరుకున్నాడు. స్థానిక దుకాణం వాళ్లు ఒక చెయిర్ ఇచ్చారు. ఆమెను చెయిర్ మీద కూర్చోబెట్టిన యువకుడు 'సీఎం రేవంత్‌రెడ్డి గారు... నేను, మా అమ్మ ఇద్దరం నీకే ఓటేసినం. మా అమ్మకు ఆరోగ్యం బాగాలేదు, గాంధీ దవాఖానకు తరలిస్తే బెడ్ లేదని డాక్టర్లు చెప్పిండ్రు, మీరే వైద్యం చేయించాలి' అని గట్టిగా అరిచి మొరపెట్టుకున్నాడు. అక్కడే ఉన్న పోలీసులు మీడియా ప్రతినిధులు వచ్చేలోపు అంబులెన్స్‌ను తెప్పించి ఆమెను గాంధీ దవాఖానకు తరలించినట్టు తెలిసింది. ఈ హృదయవిదారకమైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాంగ్రెస్ పాలనలో పేదల ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందని నెటిజన్లు సర్కారుపై విమర్శలు చేస్తున్నారు.

ఉద్యోగుల వివరాలు సేకరించండి

- ఈఎఫ్‌ఎంఐఎస్‌లో అప్‌లోడ్ చేయండి
- ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): సకాలంలో వేతనాలు అందక కొందరు సిబ్బంది ఆత్మహత్యలకు పాల్పడుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. రాష్ట్రంలోని ఉద్యోగులు, తాత్కాలిక సిబ్బంది వివరాలను సేకరించాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు. ఈ వివరాలను ఇంటిగ్రేటెడ్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం(ఈఎఫ్‌ఎంఐఎస్)లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. సెక్రటేరియట్‌లోని అన్ని శాఖలు, ఆ శాఖల హెచ్‌వోడీలు ఉద్యోగుల వివరాలను నెలవారీ ఆఖరి తేదీ లేదా 10వ తేదీకి ముందు డాటా ఎంటర్ చేయాలని కోరారు. జీతం, పరిహారాల కోసం డాటాను నెలవారీ బేసిస్‌పై అప్‌డేట్ చేయాలని పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ 600 కోట్లు

- దీపావళికి మరో 600 కోట్లు
- బంద్ దెబ్బకు దిగొచ్చిన సర్కారు
- కాలేజీ యాజమాన్యాలకు హామీ
- బంద్ విరమించుకున్న కాలేజీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కాలేజీ యాజమాన్యాలు ఇచ్చిన నిరవధిక బంద్ పిలుపునకు సర్కారు దిగి వచ్చింది. వెంటనే బకాయిల విడుదలకు అంగీకరించింది. వారంలో రూ.600 కోట్లు, దీపావళికి మరో రూ.600 కోట్లను విడుదల చేస్తామని హామీనిచ్చింది. దీంతో కాలేజీల యాజమాన్యాలు నిరవధిక బంద్‌ను విరమిస్తున్నట్టు ప్రకటించాయి. ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఫతి) ప్రతినిధులతో సర్కారు సోమవారం మరోసారి చర్చలు జరిపింది. ప్రజాభవన్‌లో జరిగిన ఈ చర్చల్లో తొలుత అధికారులు యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపారు. ఆ తర్వాత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడాది క్రితం టోకెన్లు జారీచేసిన పెండింగ్ బకాయిలు రూ.1207 కోట్లను విడుదల చేయాలని యాజమాన్యాలు కోరాయి. అంత ఇవ్వలేమని సర్కారు చెప్పడంతో ప్రొఫెషనల్ కాలేజీలకు రూ.500కోట్లు, డిగ్రీ కాలేజీలకు రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.700 కోట్ల బకాయిలను విడుదల చేయాలని యాజమన్యాలు పట్టుబట్టాయి. అయితే ఈ వారంలో రూ.600 కోట్లు విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీపావళికి మరో రూ.600 కోట్లు విడుదల చేస్తామని హామీనిచ్చింది. దీంతో కాలేజీల నిరవధిక బంద్‌ను విరమిస్తున్నట్టు కాలేజీల యాజమాన్యాలు ప్రకటించాయి.

తొలిరోజు కాలేజీలకు తాళాలు

యాజమాన్యాలు చేపట్టిన కాలేజీల బంద్ తొలిరోజు విజయవంతమైంది. బంద్ సందర్భంగా యాజమాన్యాలు కాలేజీలకు తాళాలు వేశాయి. గేట్లు కూడా తెరవలేదు. కాలేజీల బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. విద్యార్థులు ఇండ్లకే పరిమితమయ్యారు. దాదాపు 750కి పైగా కాలేజీలు బంద్ పాటించాయి. కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు సైతం బంద్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా యాజమాన్యాలు బ్యానర్లు ప్రదర్శించి నిరసన తెలిపాయి. గత్యంతరం లేకే తాము బంద్‌కు పిలుపునిచ్చామని, తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరించాలని కోరుతూ కాలేజీల గేట్ల ఎదుట పోస్టర్లు, ఫ్లెక్సీలు ప్రదర్శించాయి.

విద్యార్థుల ఖాతాల్లోకే ఫీజు రీయింబర్స్‌మెంట్?

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగా సర్కారు కొత్త ఎత్తుగడతో రెడీ అయ్యింది. రీయింబర్స్‌మెంట్ పథకంలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న ది. నేరుగా విద్యార్థుల ఖాతాల్లోకి ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేయాలన్న ఆలోచనలో సర్కారు ఉంది. విద్యార్థితోపాటు తల్లిదండ్రుల పేరుతో జాయింట్ అకౌంట్ తీస్తారు. రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ఆయా ఖాతాలో జమచేస్తారు. విద్యార్థులే సొంతంగా కాలేజీలకు ఫీజులు చెల్లించుకోవాల్సి ఉంటుంది. రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలంటూ కాలేజీ యాజమాన్యాలు నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో సర్కారు ఈ కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో మార్పులు చేస్తే విద్యార్థులు, తల్లిదండ్రులపై మోయలేని భారం పడనున్నది. ప్రస్తుతం కన్వీనర్ కోటాలో సీటు పొందినవారు ట్యూషన్ ఫీజులు చెల్లించాల్సిన అవసరంలేదు. కేవలం కౌన్సెలింగ్ ఫీజు చెల్లిస్తే సరిపోతుంది.

వీధి దీపాల బాధ్యత సర్పంచ్‌లకే

కొత్త దీపాల ఏర్పాటు, నిర్వహణ పంచాయతీలకే రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతను సర్పంచ్‌లకే అప్పగించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అవసరమైనన్ని కొత్త ఎల్‌ఈడీ లైట్లను అమర్చటంతో పాటు వాటిని సమర్థంగా నిర్వహించే అధికారం గ్రామ పంచాయతీల పరిధిలోనే ఉండాలని స్పష్టంచేశారు. ఈ మేరకు సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీరాజ్, జీహెచ్‌ఎంసీ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇప్పటికే ఉన్న ఎల్‌ఈడీ లైట్లు వెలుగుతున్నాయా లేదా కొత్తగా ఎన్ని అవసరమున్నాయో పక్కాగా అంచనా వేయాలని, ప్రతి పోల్ సర్వే చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. రాత్రిపూట ఎల్‌ఈడీ లైట్లు పనిచేయటంతోపాటు పగటిపూట దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణ ఉండాలని, అన్ని గ్రామాల ఎల్‌ఈడీ డ్యాష్ బోర్డు మండల స్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షణలో ఉండాలని చెప్పారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలని అన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై నేడు సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): వానకాలం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లపై సివిల్ సప్లయ్ మంగళవారం కీలక సమావేశాన్ని నిర్వహించనున్నది. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో నిర్వహించే ఈ సమావేశానికి అన్ని జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, సివిల్ సప్లయ్ జిల్లా అధికారులు హాజరుకానున్నారు. ఈ మేరకు ఈ సీజన్‌లో ఎంత ధాన్యం దిగుబడి వస్తుంది..?, ఇందులో ఎంతమేరకు కొనుగోలు కేంద్రాలకు వస్తుందనే అంశాలపై చర్చించనున్నారు. అయితే సుమారు 80లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయాల్సి వస్తుందని అధికారులు అంచనా వేసినట్టుగా తెలిసింది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 52లక్షల మెట్రిక్ టన్నులకే అనుమతి ఇచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మిగిలిన ధాన్యం కొనుగోలుపై ఏం చేయాలనే అంశంతోపాటు, సన్న ధాన్యం బోనస్‌పై చర్చించనున్నారు.

నేటి మ్యాచ్ | అఫ్గానిస్థాన్ X బంగ్లాదేశ్ | సోనీ స్పోర్ట్స్‌లో రాత్రి: 8 నుంచి




గ్రాండ్ స్విస్ విజేత వైశాలి

● వరుసగా రెండో టైటిల్

సమర్‌కండ్ (ఉజ్బెకిస్థాన్): భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు ఫిడే ఉమెన్స్ గ్రాండ్ స్విస్ టోర్నీలో విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఆఖరి రౌండ్ (11)లో ఆమె.. ప్రపంచ మాజీ చాంపియన్ టాన్ జోంగ్యీతో గేమ్‌ను డ్రా చేసుకుంది. ఈ డ్రాతో పాయింట్ల పట్టికలో వైశాలి 8 పాయింట్లతో రష్యన్ అమ్మాయి క్యాటెరీనా లాగ్నోతో సమానంగా నిలిచింది. కానీ టైబ్రేక్ స్కోరు పరంగా వైశాలి టైటిల్ నెగ్గింది. ఈ టైటిల్ గెలవడం వైశాలికి ఇది వరుసగా రెండోసారి. తద్వారా ఆమె వచ్చే ఏడాది జరుగబోయే ఉమెన్స్ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించింది.

డుప్లాంటిస్ 14వ సారి

● పోల్‌వాల్ట్‌లో ప్రపంచ రికార్డు



టోక్యో: స్వీడన్ పోల్‌వాల్ట్ దిగ్గజం అర్మాండ్ మోండో డుప్లాంటిస్ తనకు తానే సాటి అని మరో మారు నిరూపించాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో డుప్లాంటిస్ మరోమారు తన అద్భుత ప్రదర్శనతో ఏకంగా 14వ సారి వరల్డ్ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. సోమవారం జరిగిన పురుషుల పోల్‌వాల్ట్ ఫైనల్లో బరిలోకి దిగిన డుప్లాంటిస్ ఏకంగా 6.30 మీటర్ల ఎత్తు దూకి పసిడి పతకాన్ని సగర్వంగా ముద్దాడాడు.

సిరాజ్‌కు ఐసీసీ అవార్డు

దుబాయ్: హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ ఐసీసీ ప్రతిష్ఠాత్మక అవార్డును గెలుచుకున్నాడు. ఆగస్టు నెలకు గాను అతడు 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్'గా ఎంపికయ్యాడు. గత నెలలో ముగిసిన అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో టెస్టులో టీమ్‌ఇండియా ఆరు పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-2తో డ్రా చేయడంలో సిరాజ్ కీలక పాత్ర పోషించాడు. ఆఖరి టెస్టు తీవ్ర ఒత్తిడిలోనూ అతడు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు పడగొట్టాడు.

కరచాలనం.. కొత్త వివాదం

పాక్ ఆటగాళ్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వని భారత్ ● పీసీబీ గుర్రు.. ఐసీసీ వద్దకు చేరిన పంచాయితీ

మ్యాచ్ రిఫరీని తొలగించాలని డిమాండ్ ● తమ చర్యను సమర్థించుకున్న టీమ్‌ఇండియా ● నిబంధనల్లో అలాంటిదేమీ లేదంటూ కౌంటర్





దుబాయ్: ఆసియా కప్‌లో భాగంగా చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య ఆదివారం రాత్రి దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఇరుజట్ల ఆటగాళ్లు కరచాలనం చేసుకోకపోవడం కొత్త వివాదానికి దారితీసింది. టాస్ సందర్భంగా గానీ.. మైదానంలో ఆడేప్పుడు గానీ దాయాదులతో అంటీముట్టనట్టుగానే వ్యవహరించిన టీమ్‌ఇండియా.. ఆట ముగిశాక కూడా పాక్ ఆటగాళ్లకు హ్యాండ్‌షేక్ ఇవ్వకుండానే డగౌట్‌కు చేరింది. పాక్ ప్లేయర్లు మైదానంలో వేచి చూసినా భారత డ్రెస్సింగ్ రూమ్ నుంచి అలాంటి స్పందనేమీ రాలేదు. దీంతో అవమానానికి గురైన పాకిస్థాన్.. ఐసీసీ తలుపు తట్టింది. ఇది క్రీడాస్ఫూర్తికి విరుద్ధమంటూ కొత్త రాగాన్ని అందుకుంది. భారత ఆటగాళ్ల చర్యకు మ్యాచ్‌కు రిఫరీగా వ్యవహరించిన ఆండీ పైక్రాఫ్ట్‌ను బాధ్యుడిగా చేస్తూ అతడిపై చర్యలు తీసుకోవాలని ఐసీసీని డిమాండ్ చేసింది. అయితే పాక్ ఆటగాళ్లతో కరచాలన చేయకపోవడాన్ని టీమ్‌ఇండియా సమర్థించుకుంది.

రిఫరీపై ఎందుకు?

పీసీబీ.. ఐసీసీలో మ్యాచ్ రిఫరీ పైక్రాఫ్ట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం వెనుక కారణముంది. టాస్ వేసేప్పుడు భారత కెప్టెన్ సూర్యతో కరచాలనం చేయవద్దని పాక్ సారథి సల్మాన్ అఘాతో చెప్పాడని పీసీబీ చెబుతున్నది. సాధారణంగా మ్యాచ్‌లో టాస్ వేసేప్పుడు ఇరుజట్ల సారథులు కరచాలనం చేసుకోవడంతో పాటు టీమ్ షీట్ (ఎవరెవరు ఆడుతున్నారు? అని ఉండే పేపర్)ను ఒకరినొకరు మార్చుకుంటారు. కానీ మొన్నటి మ్యాచ్‌లో మాత్రం పైక్రాఫ్ట్ ఆ పనిచేశాడని పాకిస్థాన్ టీమ్ మేనేజర్ నవీద్ చీమ ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ)కు ఫిర్యాదుచేశాడు. మ్యాచ్ ముగిశాక టీమ్‌ఇండియా ఆటగాళ్లు కరచాలనం ఇవ్వకుండా వెళ్లడానికీ కారణం ఆయనేననేది పాక్ వాదన. ఈ మేరకు పీసీబీ స్పందిస్తూ.. 'పైక్రాఫ్ట్ చేసిన పనిపై నవీద్ ఏసీసీకి ఫిర్యాదుచేశాడు. భారత ఆటగాళ్ల తీరుపైనా అతడు తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఇది క్రీడాస్ఫూర్తికి విరుద్ధం. అందుకే పోస్ట్ మ్యాచ్ సెర్మనీకి మేం మా కెప్టెన్‌ను పంపించలేదు' అని తెలిపింది. ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎంసీసీ క్రికెట్ నిబంధనలను అనుసరించి పైక్రాఫ్ట్‌ను ఆసియా కప్ నుంచి తొలగించాలని పీసీబీ డిమాండ్ చేసింది.

మేం చేసింది కరెక్టే: టీమ్‌ఇండియా

ఈ వివాదంపై భారత సారథి, హెడ్‌కోచ్ తమ చర్యలను సమర్థించుకున్నారు. మ్యాచ్ ముగిశాక పాక్ జర్నలిస్ట్ ఒకరు 'దీని వెనుక ఏదైనా రాజకీయ కారణం ఉందా?' అని అడిగిన ప్రశ్నకు సూర్య సమాధానమిస్తూ.. 'జీవితంలో కొన్ని విషయాలు క్రీడాస్ఫూర్తి కంటే ముందుంటాయి. ఆ విషయాన్ని నేను మ్యాచ్‌కు ముందే చెప్పా. పహల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన బాధితులకు మేం అండగా ఉన్నాం. అలాగే మా విజయాన్ని భారత సైన్యానికి అంకితమిచ్చాం' అని స్పష్టం చేశాడు. పోస్ట్ మ్యాచ్ ప్రజెంటేషన్‌లోనూ సూర్య ఇదే విషయాన్ని చెప్పాడు. 'జట్టుగా మేం ఇక్కడికి కేవలం మ్యాచ్ ఆడటానికే వచ్చాం. మేం వారికి (పాకిస్థాన్‌కు) సరైన సమాధానమే ఇచ్చామని భావిస్తున్నాం' అని తెలిపాడు. ఇదే విషయమై గంభీర్ స్పందిస్తూ.. 'జట్టుగా మేమంతా పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన బాధితులకు అండగా ఉండాలని అనుకున్నాం. అంతకుమించి ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతంగా నిర్వహించిన భారత సైనిక బలగాలకు మేం కృతజ్ఞతలు చెబుతున్నాం' అని చెప్పాడు.



బీసీసీఐ ఆదేశమేనా?

ఇదిలాఉండగా టీమ్‌ఇండియా ఆటగాళ్లు తీసుకున్న ఈ నిర్ణయం అప్పటికప్పటిది కాదని.. బీసీసీఐ నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే ఇలా చేశారని తెలుస్తున్నది. ఆసియా కప్ ఆరంభానికి ముందు నిర్వహించిన కెప్టెన్స్ మీట్‌తో పాటు ఏసీసీ సారథిగా ఉన్న పాక్ మంత్రి మోహ్సిన్ నఖ్వీతో సూర్య కరచాలనం చేయడం, దాయాదితో మ్యాచ్‌ను నిషేధించాలని దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమైన నేపథ్యంలోనే బీసీసీఐ 'నో షేక్ హ్యాండ్ పాలసీ'ని తీసుకొచ్చినట్టు వినికిడి. గ్రూప్ దశలోనే గాక సూపర్-4 దశలోనూ దాయాదితో ఇదే విధానాన్ని కొనసాగించనున్నారని టీమ్ మేనేజ్‌మెంట్‌కు స్పష్టమైన ఆదేశాలు అందినట్టు సమాచారం.

అలాంటి నిబంధనేమీ లేదు

ఈ వివాదంపై బీసీసీఐ ప్రతినిధి ఒకరు స్పందిస్తూ ఆటలోఅలాంటి కచ్చితమైన నిబంధనేమీ లేదని పాక్‌కు కౌంటర్ ఇచ్చారు. 'మీరు ఒకసారి రూల్స్ బుక్‌ను చూడండి. మ్యాచ్ ముగిశాక ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లకు తప్పకుండా హ్యాండ్‌షేక్ ఇవ్వాలని ఏమీ లేదు. అది ఒక మర్యాదపూర్వకమైన సంజ్ఞ మాత్రమే' అని చెప్పాడు. అంతర్జాతీయ స్థాయిలోనూ ఇలా జరుగడం ఇదేమీ కొత్త కాదు. 2023 వింబుల్డన్ సందర్భంగా ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలీనా స్వితోలినా.. బెలారస్ ప్లేయర్ విక్టోరియా అజరెంకాతో మ్యాచ్ ముగిశాక ఆమెకు షేక్‌హ్యాండ్ ఇవ్వడానికి నిరాకరించింది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో తాను రష్యా, బెలారస్ ప్లేయర్లతో కరచాలనం చేయబోనని స్పష్టం చేసింది. క్రీడాస్ఫూర్తిని పాటించలేదని అప్పుడు వింబుల్డన్ ఆమెపై ఎటువంటి చర్యలకూ దిగలేదు.

నఖ్వీ చేతులమీదుగా తీసుకుంటారా?

తాజా పరిణామాల నేపథ్యంలో ఒకవేళ భారత్ గనక ఆసియా కప్ గెలిస్తే ఏసీసీ అధ్యక్షుడు నఖ్వీ చేతులమీదుగా ట్రోఫీని అందుకుంటుందా? లేదా? అన్నదానిపై సర్వత్రా చర్చ మొదలైంది. దీనిపై బీసీసీఐ ఎటువంటి విధానాన్ని అవలంభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

యూఏఈకి తొలి విజయం

● ఒమన్‌పై గెలుపు



అబుదాబి: స్వదేశంలో ఆసియా కప్ ఆడుతున్న యూఏఈ తమ రెండో మ్యాచ్‌లో బోణీ కొట్టింది. అబుదాబిలోని షేక్ జాయేద్ స్టేడియంలో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 42 పరుగులతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన యూఏఈ.. 20 ఓవర్లకు 172/5 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ వసీమ్ (69), అలీషాన్ (51) అర్ధశతకాలతో రాణించారు. ఛేదనలో ఒమన్ 18.4 ఓవర్లలో 130 రన్స్‌కు ఆలౌట్ అయింది. యూఏఈ బౌలర్లలో జునైద్ సిద్ధిఖీకి నాలుగు (4/23) వికెట్లు దక్కాయి.

లంక హమ్మయ్య!

● హాంకాంగ్‌పై చెమటోడ్చి విజయం

దుబాయ్: ఆసియాకప్‌లో హాంకాంగ్‌పై శ్రీలంక చెమటోడ్చి విజయం సాధించింది. హాంకాంగ్ నిర్దేశించిన 150 పరుగుల లక్ష్యఛేదనలో 18.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. ఓపెనర్ నిస్సనక(68) అర్ధసెంచరీతో రాణించగా, మిగతా వారు స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. ఈ విజయంతో గ్రూపు-బీలో లంక టాప్‌లోకి దూసుకొచ్చింది. ముర్తజా(2/37) రెండు వికెట్లు తీశాడు. ఈ మ్యాచ్‌లో ఏకంగా 11 క్యాచ్‌లు విడిచిపెట్టిన హాంకాం గెలిచే అవకాశాన్ని చేజార్చుకుంది. తొలుత నిజాఖత్ ఖాన్(52 నాటౌట్), అన్షి రాత్(48) రాణించడంతో హాంకాంగ్ 20 ఓవర్లలో 149/4 స్కోరు చేసింది. చమీర(2/29) రెండు వికెట్లు తీశాడు.

శ్రీశంకర్, పారుల్‌కు నిరాశ

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

టోక్యో: ప్రతిష్ఠాత్మక ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ల నిరాశజనక ప్రదర్శన కొనసాగుతున్నది. స్టార్ లాంగ్‌జంపర్ మురళీ శ్రీశంకర్‌తో పాటు స్టిపుల్‌చేజర్ పారుల్ చౌదరీ ఘోరంగా నిరాశపరిచారు. సోమవారం జరిగిన పురుషుల లాంగ్‌జంప్‌లో శ్రీశంకర్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయాడు. గ్రూపు-ఏలో క్వాలిఫికేషన్ రౌండ్‌లో పోటీకి దిగిన శ్రీశంకర్ అత్యుత్తమంగా 7.78మీటర్లు దూకి 14వ స్థానంలో నిలిచాడు. ఓవరాల్‌గా మొత్తం 37 మందిలో 25వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. గత మూడేండ్ల వ్యవధిలో శంకర్‌కు ఇదే చెత్త ప్రదర్శన. క్వాలిఫయింగ్ మార్క్ 8.15మీటర్లు లేదా తొలి 12 స్థానాల్లో నిలిచిన అథ్లెట్లు ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు. గాయం కారణంగా గతేడాది పారిస్ ఒలింపిక్స్ సహా అన్ని టోర్నీలకు దూరమైన ఈ 26 ఏండ్ల అథ్లెట్..ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు ముందు ఐదు టైటిళ్లతో ఆకట్టుకున్నాడు. మరోవైపు మహిళల 3000మీటర్ల స్టిపుల్‌చేజ్‌లో భారత అథ్లెట్లు పారుల్ చౌదరీ (9:22:24సె), అంకిత ధయాని (10:03:22సె) వరుసగా 20, 35 స్థానాల్లో నిలిచి నిరాశపరిచారు. పురుషుల 110మీటర్ల హర్డిల్స్‌లో తేజాస్ షిర్సె హీట్స్‌లోనే వెనుదిరిగాడు.

సెంట్రల్‌దే దులీప్ ట్రోఫీ

● ఫైనల్లో సౌత్‌జోన్‌పై విజయం



బెంగళూరు: దేశవాళీలో ప్రతిష్ఠాత్మకమైన దులీప్ ట్రోఫీని సెంట్రల్ జోన్ గెలుచుకుంది. బెంగళూరులోని బీసీసీఐ సీవోఈ గ్రౌండ్స్‌లో జరిగిన ఫైనల్‌లో సెంట్రల్.. సౌత్‌జోన్ నిర్దేశించిన 65 పరుగుల లక్ష్యాన్ని 4 వికెట్లు కోల్పోయి కైవసం చేసుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో సౌత్‌జోన్ పోరాడి (426 ఆలౌట్) సెంట్రల్ విజయాన్ని ఐదో రోజుకు వాయిదా వేసిన విషయం తెలిసిందే. సౌత్ బౌలర్లు చకచకా 4 వికెట్లు పడగొట్టినా లక్ష్యం మరీ తక్కువగా ఉండటంతో వాళ్లూ ఏమీ చేయలేకపోయారు. 11 ఏండ్ల విరామం తర్వాత సెంట్రల్ జోన్ దులీప్ ట్రోఫీ టైటిల్‌ను దక్కించుకోవడం విశేషం. ఫైనల్‌లో తృటిలో ద్విశతకం చేజార్చుకున్న యశ్ రాథోడ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కగా సరాన్ష్ జైన్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ గెలుచుకున్నాడు.



ఐపీవోకి మెడికవర్ హాస్పిటల్స్

రూ.250 కోట్లతో హైదరాబాద్‌లో మరో రెండు దవాఖానలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15: సూపర్-స్పెషాల్టీ హెల్త్‌కేర్ సేవల సంస్థ మెడికవర్ హాస్పిటల్స్..హైదరాబాద్‌లో మరో 2 హాస్పిటల్స్‌ను ప్రారంభించబోతున్నది. రూ.100 కోట్లతో సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన దవాఖానను ఈ నెల 16న, రూ.150 కోట్లతో కోకాపేట వద్ద ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్ ఈ ఏడాది చివరినాటికి అందుబాటులోకి రానున్నట్టు కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కృష్ణ తెలిపారు. దీంతో అదనంగా 800 పడకలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ పెట్టుబడులను అంతర్గత వనరుల ద్వారా, ఆర్థిక సేవల సంస్థల వద్ద రుణాలు తీసుకున్నట్టు చెప్పారు. వ్యాపార విస్తరణకు అవసరమైన నిధులను సేకరించడానికి వచ్చే ఏడాది ఐపీవోకి రానున్నట్టు ఆయన ప్రకటించారు. ఎంతమేర సేకరించేదానిపై ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. మౌలిక సదుపాయాల కల్పనకోసం, రుణాలను తగ్గించుకోవడానికి ఐపీవో ద్వారా సేకరించిన నిధులను వినియోగించనున్నట్టు ఆయన ప్రకటించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.1,850 కోట్లుగా నమోదైన టర్నోవర్, ఈసారి రూ.2 వేల కోట్లు అధిగమించనున్నదన్నారు. తెలంగాణతోపాటు ఏపీ, బెంగళూరు, పూణెలలో 23 హాస్పిటల్స్ ఉండగా, పడకల కెపాసిటీ 5,750 ఉన్నది.

చిన్న నగరాలపై దృష్టి

ప్రస్తుతం మెట్రో నగరాల్లో దవాఖానాలను ఏర్పాటు చేసిన సంస్థ..సమీప భవిష్యత్తులో ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఇందుకోసం ఆయా నగరాల్లో చిన్న స్థాయి హాస్పిటల్స్‌ను కొనుగోలు చేసే ఆలోచన కూడా ఉన్నదని, ప్రస్తుతం ఈ విషయంపై ప్రధానంగా దృష్టి సారించినట్టు చెప్పారు. ఇదే క్రమంలో చందానగర్‌లో ఉన్న ఆసుపత్రి సామర్థ్యాన్ని మరో 150 పడకలు పెంచుతున్నట్టు తెలిపారు. హాస్పిటల్ రంగం పలు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నదని, ముఖ్యంగా క్లినికల్ ప్రతిభ ఉన్నవారు చాలా తక్కువ స్థాయిలో ఉన్నారని, దీనికి తోడు హెల్త్‌కేర్ ఖర్చులు అధికం కావడం, అంతర్జాతీయ స్థాయిలో కరెన్సీలు తీవ్ర ఆటుపోటులకు గురి కావడం, టారిఫ్‌లు, నూతన మెడికల్ టెక్నాలజీ పరికరాలకోసం అధికంగా నిధులు వెచ్చించాల్సి వస్తున్నదన్నారు.

ఐటీఆర్ ఫైలింగ్ గడువు పెంపు

ఒక్కరోజు పెంచిన సీబీడీటీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: మదింపు సంవత్సరం 2025-26కుగాను ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నుల దాఖలుకున్న గడువును సోమవారం సీబీడీటీ మరొక్కరోజు పొడిగించింది. దీంతో మంగళవారం కూడా ఐటీఆర్ ఫైలింగ్ చేసుకోవచ్చు. కాగా, ఇప్పటిదాకా 7 కోట్లకుపైగా ఐటీఆర్‌లు దాఖలయ్యాయి. ఇందులో 6.03 కోట్లకుపైగా ఐటీ రిటర్నులను ఐటీ శాఖ వెరిఫై చేసింది. 4 కోట్ల ఐటీ రిటర్నులను ప్రాసెస్ చేసింది. అయితే ఐటీ రిటర్నుల దాఖలుకు సోమవారమే ఆఖరు తేదీ కావడంతో ఫైలింగ్ పోర్టల్‌పై ఒత్తిడి కనిపించింది. ఇక ఆలస్య రుసుము రూ.5,000 (రూ.5 లక్షలదాకే వార్షిక ఆదాయం ఉంటే రూ.1,000), వడ్డీతో బుధవారం నుంచి కూడా ఐటీ రిటర్నులను దాఖలు చేసుకోవచ్చు.

సూచీల వరుస ర్యాలీకి బ్రేక్

ముంబై, సెప్టెంబర్ 15: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. వరుసగా ఎనిమిది రోజులుగా పెరుగుతూ వచ్చిన సూచీలకు ఐటీ, వాహన రంగ షేర్లు ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో సూచీలు నష్టపోయాయి. వడ్డీరేట్ల తగ్గింపుపై అమెరికా ఫెడరల్ రిజర్వు ఈ వారంలోనే నిర్ణయం తీసుకోనుండటంతో మదుపరులు అప్రమత్తకు మొగ్గుచూపారు. ఫలితంగా ఐదు రోజులుగా పెరుగుతూ వచ్చిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 118.96 పాయింట్లు కోల్పోయి 81,785.74 వద్ద ముగియగా, నిఫ్టీ 44.80 పాయింట్లు నష్టపోయి 25,069.20 వద్ద ముగిసింది.

సాఫ్ట్‌వేర్ టు హార్డ్‌వేర్

రూటు మార్చిన దేశీయ ఐటీ రంగ సంస్థలు

చిప్, ఎలక్ట్రానిక్స్ తయారీపై దృష్టి ● ఆయా సంస్థలతో కలిసి ప్రాజెక్టులకు సై

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: దేశీయ ఐటీ రంగ సంస్థలు.. సాఫ్ట్‌వేర్ నుంచి హార్డ్‌వేర్ వైపునకు అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే దాదాపుగా బడా కంపెనీలన్నీ వ్యూహాత్మకంగా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ ప్రాజెక్టుల దిశగా వెళ్తున్నాయి. తద్వారా భారత్‌లో చిప్స్ తయారీకి పెద్ద ఎత్తున ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని చూస్తున్నాయి. దీంతో ఇంజినీరింగ్, రిసెర్చ్, డెవలప్‌మెంట్ కోసం వివిధ సంస్థలతో కలిసి భారీగా పెట్టుబడులకూ ప్రముఖ ఐటీ కంపెనీల యాజమాన్యాలు సిద్ధమవుతున్నాయి. ఆయా సంస్థల్లో వాటాలనూ దక్కించుకుంటున్నాయి.



ఇదీ సంగతి..

నిజానికి గత కొన్నేండ్ల నుంచే సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లోకి ఐటీ కంపెనీలు వస్తున్నాయి. అయితే ఇటీవలికాలంలో అవి విస్తరణ బాట పట్టడం గమనార్హం. ఇక నిరుడు రూ.1.26 లక్షల కోట్ల విలువైన సెమీకండక్టర్ ప్లాంట్ల ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినదీ విదితమే.

- హర్మన్స్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్ బిజినెస్‌లో ప్రధాన ఐటీ కంపెనీ విప్రో గత నెల 375 మిలియన్ డాలర్లతో వాటాను దక్కించుకున్నది. ఈ ఏడాది డిసెంబర్ 31కల్లా ఈ డీల్ పూర్తవుతుందని ఇండస్ట్రీ వర్గాల అంచనా. అలాగే విప్రో, హర్మన్, సామ్‌సంగ్‌ల మధ్య ఓ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కూడా కుదిరిందని చెప్తున్నారు. ఇప్పటికే తమ అనుబంధ సంస్థ విప్రో పారీ ద్వారా భారీ మెషినరీ తయారీ సంస్థలకు విప్రో సేవలందిస్తున్నది. ఈ నేపథ్యంలో విప్రో-హర్మన్స్ లావాదేవీ మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది.
- హెచ్‌సీఎల్ గ్రూప్ నోయిడాలో ఫాక్స్‌కాన్‌తో కలిసి ఓ ఫ్యాబ్‌ను పెడుతున్నది. ఈ ప్రాజెక్టుపై పెట్టుబడులు రూ.3,706 కోట్లుగా ఉన్నాయి. మేలో కేంద్ర క్యాబినెట్ కూడా ఇందుకు ఆమోదం తెలిపింది. 2019, 2020ల్లోనే హెచ్‌సీఎల్ టెక్.. సంకల్ప్ సెమీకండక్టర్‌ను సొంతం చేసుకున్నది. నిరుడు ఇంటెల్ ఫౌండ్రీతో విప్రో, హెచ్‌సీఎల్ టెక్ జట్టుకట్టాయి.
- దేశీయ రెండో అతిపెద్ద ఐటీ రంగ సంస్థ ఇన్ఫోసిస్ కూడా బెంగళూరుకు చెందిన సెమీకండక్టర్ డిజైన్, ఎంబెడ్డెడ్ కంపెనీ ఇన్‌సెమీతో గత ఏడాది జట్టు కట్టింది.
- సిరియం సిస్టమ్స్‌ను టెక్ మహీంద్రా, ఎగ్జిమస్ డిజైన్‌ను విప్రో హస్తగతం చేసుకున్నాయి. యాక్సెంచర్, క్యాప్‌జెమినీ తదితర అంతర్జాతీయ సంస్థలూ థర్డ్-పార్టీ ఆర్అండ్‌డీ సర్వీసులను అందిస్తున్నాయి.
- మధ్యశ్రేణి ఐటీ రంగ కంపెనీ సైయెంట్ ఏకంగా సొంతంగానే సైయెంట్ సెమీకండక్టర్స్ పేరిట ఓ సెమీకండక్టర్ సంస్థను తీసుకొచ్చింది. ఎల్అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్, దాని అనుబంధ సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీ ఆధ్వర్యంలో ఎల్అండ్‌టీ సెమీకండక్టర్ టెక్నాలజీస్ పరిచయమైంది.
- దేశీయ ఐటీ రంగ దిగ్గజ సంస్థ టీసీఎస్.. ఇటీవలే తమ చిప్‌సెట్ ఆధారిత సిస్టమ్ ఇంజినీరింగ్ సర్వీసెస్‌ను ప్రారంభించింది. సెమీకండక్టర్ కంపెనీలు సరికొత్త సెమీకండక్టర్లను తయారు చేసేందుకు దోహదం చేసేలా దీన్ని రూపొందించారు. టాటా ఎలక్ట్రానిక్స్ ఇందులో భాగస్వామ్యమై ఉంటుంది. తైవాన్‌కు చెందిన పవర్‌చిప్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్ప్‌తో టాటా ఎలక్ట్రానిక్స్ టై-అప్ అయ్యింది. ఈ క్రమంలోనే గుజరాత్‌లో కొన్ని చిప్ తయారీ కేంద్రాలను తెచ్చే ఆలోచనలో కూడా టాటా గ్రూప్ ఉన్నది.
- ప్రస్తుతం గ్లోబల్ సెమీకండక్టర్ మార్కెట్ విలువ దాదాపు 600 బిలియన్ డాలర్లుగా ఉంటుందని ఇండస్ట్రీ నిపుణుల అంచనా. అయితే 2032 నాటికి ఇది 2 ట్రిలియన్ డాలర్లను తాకవచ్చని చెప్తున్నారు.



జెన్ఏఐ అనేది కేవలం ఓ టెక్ సైకిల్ మాత్రమే కాదు. అదో నాగరిక మార్పు. సెమీకండక్టర్స్, క్లౌడ్ కంప్యూటింగ్, క్వాంటమ్ టెక్నాలజీస్, రోబోటిక్స్, ఎనర్జీ ఇన్నోవేషన్‌లలో జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే కీలకపాత్ర.

-ఎన్ చంద్రశేఖరన్, టాటా సన్స్ చైర్మన్



హై-పర్ఫార్మెన్స్ సెమీకండక్టర్ సొల్యూషన్స్‌కు పెద్ద ఎత్తున డిమాండ్ ఉన్నది. సైయెంట్ సెమీకండక్టర్స్ ఈ విషయంలో ప్రధాన భూమికను పోషించగలదు. చిప్ తయారీ, పరిశోధనల రంగంలో దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తాం.

-కృష్ణ బొడనపు, సైయెంట్ ఎండీ

నిపుణుల మాటేంటి?

ప్రస్తుతం ఐటీ ఇండస్ట్రీకి అనేక ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయని, ఈ తరుణంలో ఆయా సంస్థలు ఇతర వ్యాపార రంగాల వైపు చూడటం మంచిదేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారతీయ ఐటీ పరిశ్రమకు దేశీయంగా కంటే విదేశీ ప్రాజెక్టుల ద్వారా వచ్చే ఆదాయమే ఎక్కువగా ఉంటున్నది. అందులోనూ అమెరికా, ఐరోపాల వాటా అధికం. అయితే ఇప్పుడు ఆయా దేశాల్లో పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. దీంతో ఐటీ కంపెనీలు ఖర్చుల్ని తగ్గించుకొనే పనిలోపడ్డాయి. కొత్త నియామకాల సంగతి పక్కనపెడితే.. ఉన్న ఉద్యోగులనే భారీగా తీసేస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది.

వెండి పరుగులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: వెండి పరుగులుపెట్టింది. కిలో వెండి ధర రూ.300 అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,32,300 పలికింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడం వల్లనే ధరలు మరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ తెలిపింది.. బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. పదిగ్రాముల ధర రూ.500 తగ్గి రూ.1,13,300కి దిగొచ్చింది.

బ్యాంకులకు కార్ల రుణాల దెబ్బ

భారీగా రద్దు చేసుకుంటున్న కస్టమర్లు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: కార్లపై రుణాలు తీసుకోవాలనుకుంటున్నవారు బ్యాంకులకు షాకిస్తున్నారు. రుణాలు మంజూరైనప్పటికీ రద్దు చేసుకుంటున్నారు. కార్లపై జీఎస్టీ తగ్గుతుండటంతో ధరలు భారీగా దిగనుండటమే కారణం. 1,200 సీసీ ఇంజిన్ కలిగిన కార్లపై జీఎస్టీని 18 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయం ఈ నెల 22 నుంచి అమలులోకి రానుండటంతో అప్పటి వరకు వాహన కొనుగోలుదారులు తమ నిర్ణయాన్ని వాయిదావేస్తున్నారు. ఆ తర్వాతనే కార్ల ధరలను తగ్గించనున్నట్లు దేశీయ, అంతర్జాతీయ ఆటోమొబైల్ సంస్థలు ఇప్పటికే ప్రకటించాయి. దీంతో వారు ఆర్థిక ప్రయోజనాలను పొందడానికి తమ కొనుగోలు నిర్ణయాన్ని వాయిదావేస్తున్నారు. తమ కార్ల రుణాలను రద్దు చేయండని బ్యాంకులకు విజ్ఞప్తిలు వస్తున్నాయి. చిన్న కార్లతోపాటు ఎస్‌యూవీల ధరలు తగ్గుముఖం పట్టనున్నాయి.

రేట్లు తగ్గిన తర్వాతే..

వాహన రేట్లు తగ్గిన తర్వాతనే కొనుగోళ్లు జరుపుతామని, అప్పుడే రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటామని బ్యాంకర్లకు కొనుగోలుదారులు హామీలు ఇస్తున్నారు. ఇప్పటికే పలు బ్యాంకులు వాహన, గృహ రుణాలపై ప్రాసెసింగ్ చార్జీలను ఎత్తివేశాయి కూడా.

వాణిజ్య



పెరగనున్న బెంజ్ కార్ల ధరలు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: జీఎస్టీ తగ్గింపుతో ఒకవైపు వాహన ధరలను తగ్గిస్తున్న ప్రస్తుత తరుణంలో జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ మాత్రం తన వాహన ధరలను పెంచడానికి సిద్ధమైంది. యూరోతో పోలిస్తే రూపాయి బలహీనంగా ఉండటంతో వచ్చే ఏడాది తొలి నెలలోనే తమ కార్ల ధరలను పెంచాలనుకుంటున్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు సంస్థ తన వాహన ధరలను 3.5-4 శాతం వరకు పెంచిన విషయం తెలిసిందే. రూపాయితో పోలిస్తే యూరో విలువ 93-94 స్థాయిలో ఉండగా, ప్రస్తుతం ఇది 103 స్థాయికి పడిపోయిందని, దీంతో సంస్థపై అదనపు భారం పడుతున్నదని, దీనిని తగ్గించుకోవడంలో భాగంగా ధరలను పెంచాల్సి వస్తున్నదన్నారు. జీఎస్టీ తగ్గింపుతో కంపెనీ తన వాహన ధరలను రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు తగ్గించిన విషయం తెలిసిందే.

హైదరాబాద్‌లో '1 ఫైనాన్స్' సెంటర్

హైదరాబాద్, సెప్టెంబర్ 15: హైదరాబాద్‌లో ఫైనాన్షియల్ ప్లానింగ్ సెంటర్‌ను ప్రారంభించినట్టు '1 ఫైనాన్స్' ప్రకటించింది. వ్యాపార విస్తరణలో భాగంగా దేశంలో థానే తర్వాత ఏర్పాటు చేసిన రెండో సెంటర్ ఇదే కావడం విశేషం. రాష్ట్రంలో వ్యక్తిగతంగా, కుటుంబాలకు ఆర్థిక సలహాలు ఇచ్చే వారు చాలా తక్కువగా ఉండటంతో ఎక్కడ పెట్టుబడులు పెట్టాలో చాలా మంది సతమతమవుతున్నారని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ అనూజ్ మెహతా తెలిపారు. సంస్థ ఎలాంటి ఉత్పత్తులను విక్రయించదని, అలాగే కమిషన్లు కూడా తీసుకోదని ఆయన స్పష్టంచేశారు. పన్ను చెల్లింపుల విషయాలతోపాటు బీమా, రుణాలు, పదవీ విరమణ తర్వాత తమ భవిష్యత్తు ప్రణాళికను ఎలా నిర్మించుకోవాలనే దానిపై ఈ సెంటర్ ప్రధానంగా సూచనలు చేయనున్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



జిన్‌పింగ్ అలా.. మోదీ ఇలా!

ట్రంప్ టారిఫ్ హెచ్చరికలకు దీటైన జవాబిచ్చిన చైనా

- సుంకాలకు ప్రతిచర్య ఉంటుందని నాటో, జీ7కు హెచ్చరిక
- భారత్‌పై సుంకాలతో పాటు నోరు పారేసుకొన్న ట్రంప్
- డెడ్ ఎకానమీ అని, పాక్ దగ్గర చమురు కొనాలని హేళన
- నాటో, జీ7 దేశాలను ఉసిగొల్పుతూ టారిఫ్‌లకు యత్నం
- అయినప్పటికీ, ఇంతవరకూ నోరు తెరవని ప్రధాని మోదీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రష్యా నుంచి చమురు కొనుగోలును బూచిగా చూపుతూ భారత్, చైనాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల వాత పెడుతున్నారు. అంతటితో ఆగకుండా ఈ రెండు దేశాలపై టారిఫ్‌లు విధించాలని నాటో, జీ7 దేశాలను ఉసిగొల్పుతున్నారు. ట్రంప్ చర్యలను తప్పుబడుతూ ప్రధాని మోదీ ఒక్క ప్రకటన కూడా చేయలేదు. అయితే, చైనా మాత్రం తీవ్రంగా స్పందించింది. తమను ఏకపక్షంగా వేధించేందుకు ఆర్థిక బలప్రదర్శన కోసమే అమెరికా ఇటువంటి చర్యలు చేపడుతున్నదని మండిపడింది. అమెరికా చెప్పినట్టు చేస్తే, తాము కూడా ప్రతిచర్యలు చేపడుతామని నాటో, జీ7 దేశాలను హెచ్చరించింది. భారత్‌పై టారిఫ్‌లు విధించాలని నాటో, జీ7 దేశాలపై ఇటీవల ట్రంప్ ఒత్తిళ్లు తీసుకొచ్చారు. అయితే, ట్రంప్ చర్యలను ఖండిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఒక్క ప్రకటన కూడా చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ట్రంప్‌పై ముప్పేట దాడి

సుంకాల పేరిట అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకొంటున్న ఏక పక్ష నిర్ణయాలను తప్పుబడుతూ పలు దేశాలు ఎప్పటికప్పుడు గట్టిగానే కౌంటర్ ఇస్తున్నాయి. బ్రిక్స్ అనుకూల దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు విధిస్తామన్న ట్రంప్ ప్రకటనపై బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డిసిల్వా తీవ్రంగా స్పందించారు. తమ ఆర్థిక వ్యవస్థను డెడ్ ఎకానమీగా పోల్చడంపై రష్యా కూడా ట్రంప్‌పై గట్టిగానే మండిపడింది. ఇప్పుడు నాటో, జీ7 దేశాలను తమపై ఉసిగొల్పిన ట్రంప్‌ను చైనా గట్టి హెచ్చరికలతో కట్టడి చేసింది.

నోరు మెదపని మౌన ప్రధాని

ట్రంప్‌కు మిగతా దేశాలు గట్టిగా బదులిస్తుంటే, ప్రధాని మోదీ మాత్రం ట్రంప్ వ్యాఖ్యలపై, ఆయన విధించిన సుంకాలపై ఏ విధంగానూ స్పందించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. రష్యా-భారత్‌ను ఉద్దేశిస్తూ ట్రంప్ గత నెలలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకొన్నా తనకు సంబంధం లేదన్న ట్రంప్.. ఈ క్రమంలో భారత ఆర్థిక వ్యవస్థను డెడ్ ఎకానమీగా అభివర్ణించారు. ఇక, పాకిస్థాన్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందం గురించి చెప్తూ.. భారత్‌పై నోరు జారారు. భవిష్యత్తులో భారత్‌కు పాక్ చమురు విక్రయించవచ్చంటూ ఊహాగానాలు చేశారు. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినప్పటికీ, మోదీ ఖండించకపోవడంపై పలువురు మండిపడుతున్నారు.

ఇండియన్స్‌కు 'నో' ఎంట్రీ!

అమెరికా ఆపింది.. ఆస్ట్రేలియా పొమ్మంది

- కెనడా కసురుకుంది.. ఐరోపా వద్దే వద్దంది
- విదేశాల్లో భారతీయులకు బహిష్కరణ ముప్పు
- తాజాగా లండన్‌లో పెల్లుబికిన తీవ్ర నిరసనలు
- మోదీ దౌత్య వైఫల్యమే: రాజకీయ విశ్లేషకులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): విదేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పొందాలనుకొన్న భారతీయుల కల కల్లగానే మారుతున్నది. అమెరికాలో ట్రంప్ అధ్యక్ష పగ్గాలు చేపట్టినప్పటి నుంచి వలసవాద విధానాల్లో మొదలైన కఠిన ఆంక్షల అగ్గి.. ఇప్పుడు కెనడా, ఐరోపా, ఆస్ట్రేలియా ఇలా ప్రపంచమంతటా నిరసనల రూపంలో రాజుకొంటున్నది. వెరసి విదేశాల్లో భారతీయులకు సామాజిక, ఆర్థిక భద్రత లేకుండా పోతున్నది. దౌత్యపరంగా సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా ఈ పరిణామాల్ని ప్రధాని మోదీ దౌత్య వైఫల్యంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అమెరికాతో మొదలైన అగ్గి

జనవరి 20న అధికారంలోకి వచ్చింది మొదలు అక్రమ వలసలు, హెచ్1బీ వీసాలు, గ్రీన్‌కార్డు, జన్మతః పౌరసత్వ రద్దు, ఎఫ్1, ఓటీపీ.. ఇలా ప్రతీ అంశంలో ట్రంప్ సర్కారు తీసుకొంటున్న నిర్ణయాలు భారతీయులకు కునుకులేకుండా చేసున్నాయి. 'అమెరికా ఫస్ట్', 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (మాగా) నినాదాల్ని చూపిస్తూ విదేశీయులపై ట్రంప్ విధిస్తున్న ఆంక్షలు.. ఇండియన్ల 'డాలర్ డ్రీమ్స్'ను కల్లలుగా మారుస్తున్నాయి. భారతీయ వస్తువులపై 50 శాతం దిగుమతి సుంకం విధింపు నిర్ణయం దరిమిలా యూఎస్-ఇండియా మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యేలా చేశాయి. ఈ క్రమంలో ట్రంప్ ఎన్నికల నినాదం మేక్ అమెరికా గ్రేట్ అగైన్(మాగా) ప్రచారకులు సోషల్ మీడియా వేదికగా భారత వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరం చేశారు. భారత్‌పై ట్రంప్ తీసుకొన్న తాజా చర్యలను గట్టిగా సమర్థిస్తున్న కన్జర్వేటివ్ ప్రముఖులు.. భారతీయ ఉద్యోగులతోపాటు కాల్ సెంటర్లపై కూడా ఆంక్షలకు పిలుపునిస్తున్నారు. ఇండియన్స్‌ను బయటకి పంపిస్తేనే, అమెరికన్లకు విద్య, ఉపాధి అవకాశాలు దక్కుతాయని ఆందోళనలు చేస్తున్నారు.



ఇతర దేశాల్లోనూ సెగ

వలసవాదులపై అమెరికాలో మొదలైన వ్యతిరేక నిరసనలు కెనడా, ఐరోపా దేశాలతో పాటూ ఆస్ట్రేలియా వరకూ వ్యాపించాయి. 'మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా' పేరిట ఆ దేశంలోని పలు నగరాల్లో ఇటీవల వేలాది మంది నిరసన ప్రదర్శనలు చేపట్టారు. మాస్ ఇమ్మిగ్రేషన్‌ను నిలిపేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక, ఐరోపా దేశాలైన జర్మనీ, ఇంగ్లండ్‌తో పాటు తాజాగా యూకేలోనూ వలసలకు సంబంధించిన వ్యతిరేక ఆందోళనలు మిన్నంటాయి. లండన్ వీధుల్లో ఏకంగా లక్షన్నర మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. వార్సా, డబ్లిన్, బెర్లిన్ నగరాల్లోనూ వలస వ్యతిరేక ఆందోళనలతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. భారతీయులు సహా విదేశీయులు వెంటనే తమ దేశాన్ని విడిచిపెట్టి వెళ్లాలని కెనడాలోనూ పెద్దయెత్తున నిరసనలు వెల్లువెత్తాయి.

ఇబ్బందుల్లో ఇండియన్స్

విదేశాల్లో తాజాగా నెలకొన్న పరిస్థితులు భారత్ నుంచి బయటకు వెళ్లే విద్యార్థులు, వృత్తి నిపుణులు, చిరుద్యోగులపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సామాజిక, విద్య, ఉపాధి, ఆర్థిక భద్రతను సాకుగా చూయిస్తూ మొదలైన ఈ వలస వ్యతిరేక నిరసనలు.. జాతి విద్వేష దాడులకు ప్రేరేపించవచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా దేశాల్లో మైనార్టీలైన భారతీయులే లక్ష్యంగా ఈ దాడులు జరగొచ్చని హెచ్చరిస్తున్నారు. పరిస్థితులు దిగజారక ముందే మోదీ ప్రభుత్వం దౌత్యపరమైన పరిష్కారాలను ఎప్పుడో వెదకాల్సిందని చెప్తున్నారు. అయితే, భారతీయులపై దాడులు జరిగిన సందర్భంలో విదేశాంగ శాఖ కేవలం అడ్వైజరీలకే పరిమితం కావడంపై మండిపడుతున్నారు. మొత్తంగా ఇది మోదీ విదేశాంగ దౌత్యంలో అతి పెద్ద వైఫల్యమని అభివర్ణిస్తున్నారు.

మా మక్కజొన్న కొనాల్సిందే

భారత్‌కు ట్రంప్ సర్కార్ బెదిరింపు



వాషింగ్టన్, సెప్టెంబర్ 115: భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు జరగనున్న వేళ ట్రంప్ సర్కార్ నుంచి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ముందస్తు బెదిరింపులు మొదలయ్యాయి. అమెరికాలో పండించిన మక్క పంటను భారత్ కొనుగోలు చేయడానికి నిరాకరిస్తే అమెరికన్ మార్కెట్‌కు భారత్ దూరం కావలసి వస్తుందని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుత్నిక్ హెచ్చరించారు. ఒకపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై తన ఆంక్షలను సడలించుకునే ప్రయత్నం చేస్తుండగా లుత్నిక్ మాత్రం భారత్ తన సుంకాలను తగ్గించుకోకపోతే కష్టకాలం ఎదుర్కోవలసి వస్తుందని బెదిరించడం గమనార్హం. ఆక్సియోస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో లుత్నిక్ మాట్లాడుతూ భారత్-అమెరికా సంబంధాలు ఏకపక్షంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. "అమెరికాకు విక్రయించి భారత్ సొమ్ము చేసుకుంటోంది. మా మార్కెట్‌లోకి వచ్చి ప్రయోజనం పొందాలని మేము ఆహ్వానిస్తుంటే భారత్ మాత్రం మమ్మల్ని తన మార్కెట్‌లోకి మేము రాకుండా అడ్డుకుంటోంది" అని ఆయన ఆరోపించారు. తమకు 140 కోట్ల జనాభా ఉందని భారత్ గొప్పలు చెప్పుకుంటుందని, 140 కోట్ల మంది కలసి ఒక బుషెల్ మక్కలు (అంటే 25.4 కిలోలతో సమానం) కూడా కొనలేరా అని ఆయన ప్రశ్నించారు. వాళ్లు(భారత్) మాత్రం తమకు అన్నీ అమ్ముతారని, తమ దగ్గర నుంచి మాత్రం మక్కజొన్న కూడా కొనరని, అన్ని వస్తువులపై సుంకాలు మాత్రం విధిస్తారని, ఇది తమకు బాధ కలిగించదా అని ఆయన ఆక్రోశం వెళ్లగక్కారు. అమెరికాపై విధిస్తున్న సుంకాలు తగ్గించి, తాము ఎలా వ్యవహరిస్తామో తమ పట్ల కూడా భారత్ అలాగే వ్యవహరించాలని ట్రంప్ కోరుతున్నారని లుత్నిక్ చెప్పారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిచేసేందుకు ట్రంప్ ప్రభుత్వం పోరాడుతోందని, తాము దీన్ని సరిచేసేంత వరకు సుంకాలు దారిలోకి రావని ఆయన వ్యాఖ్యానించారు. "ఇది అధ్యక్షుడు ట్రంప్ మోడల్. మీరు ఒప్పుకునైనా తీరాలి లేదా ప్రపంచంలోని అతి పెద్ద వినియోగదారుడితో వ్యాపారం చేసే అవకాశాన్నయినా కోల్పోవాలి" అంటూ ఆయన హెచ్చరించారు.

మక్కపై ఎందుకు పట్టు?

బీబీసీ నివేదిక ప్రకారం చైనా ఆర్థిక ఆంక్షల కారణంగా అమెరికా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అమెరికా వ్యవసాయ గ్రూపులు హెచ్చరించాయి. చైనా, అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం సాగుతున్న దరిమిలా అమెరికా మక్కల కోసం చైనా నుంచి కొనుగోలు ఆర్డర్లు గణనీయంగా తగ్గిపోయాయి. ఫలితంగా అమెరికా సన్నకారు రైతులు దివాలా తీసినట్లు ప్రకటిస్తున్నారు. గత ఐదేళ్లలో అత్యధికంగా మక్క రైతులు ఈ ఏడాది నష్టపోయినట్లు బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. అమెరికా, చైనా మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నప్పటికీ అవి ప్రధానంగా టెక్నాలజీ అందుబాటు, అరుదైన భూ ఖనిజాల ఎగుమతులు తదితర అంశాలకే పరిమితమవుతున్నాయి. అమెరికా రైతులకు కొత్త మార్కెట్‌ను సృష్టించే లక్ష్యంతో ట్రంప్ ప్రభుత్వం మక్క ఎగుమతుల కోసం భారత్‌నే లక్ష్యంగా చేసుకున్నట్లు కనపడుతోంది.

నేడు భారత్-అమెరికా వాణిజ్య చర్చలు

న్యూఢిల్లీ : భారతీయ వస్తువులపై అమెరికా 50 శాతం దిగుమతి సుంకం విధించిన అనంతరం ప్రతిష్టంభనకు గురైన భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరిపేందుకు అమెరికా ప్రభుత్వ ప్రధాన సంధానకర్త బ్రెండన్ లించ్ సోమవారం అర్ధరాత్రి న్యూఢిల్లీ చేరుకున్నారు. భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం(బీటీఏ)పై ఇప్పటివరకు ఐదు విడతల చర్చలు జరగగా ఆగస్టు 25-29 మధ్య జరగవలసిన ఆరవ విడత చర్చలు భారతీయ వస్తువులపై అమెరికా ప్రభుత్వం 50 శాతం సుంకాలు విధించడంతో వాయిదాపడ్డాయి.

ట్రంప్ యూ టర్న్!

దక్షిణ కొరియా దెబ్బకు దిగొచ్చిన అమెరికా

వాషింగ్టన్, సెప్టెంబర్ 15: అధికారంలోకి వచ్చింది మొదలు టారిఫ్‌లు, వలస విధానాలతో ఆయా దేశాలపై విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు దక్షిణ కొరియా గట్టి షాక్ ఇచ్చింది. దీంతో విదేశీ సంస్థల ఉద్యోగులకు స్వాగతమంటూ ట్రంప్ ఓ ప్రకటన చేయాల్సి వచ్చింది. అమెరికా పరిశ్రమలకు విదేశీ ఉద్యోగుల అవసరం ఉందని ట్రంప్ చెప్పారు. దీనికంటే ముందు, తమ దేశ వ్యాపార సంస్థలు యూఎస్‌లో పెట్టుబడులు పెట్టడానికి వెనుకాడుతాయని దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జా మ్యూంగ్ హెచ్చరించారు. దీంతో ట్రంప్ దిగి రాక తప్పలేదు. మరోవైపు ఖతార్ తమకు చాలా ముఖ్యమైన మిత్ర దేశమని, దానిపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలని అనుకున్నప్పుడు ఇజ్రాయెల్ ఆచితూచి వ్యవహరించాలని ఆ దేశ ప్రధాని నెతన్యాహును ట్రంప్ హెచ్చరించారు. హమాస్‌పై ఎటువంటి చర్యలు తీసుకున్నా.. ఖతార్ జోలికి రావొద్దని అన్నారు.

అక్రమ వలసదారులను ఉపేక్షించం

ఇటీవల డాలస్‌లో భారత సంతతి మేనేజర్ నాగమల్లయ్య హత్యపై ట్రంప్ సోమవారం స్పం దించారు. 'ఇలాంటి అక్రమ వలస నేరగాళ్ల పట్ల మృదువుగా వ్యవహరించడం అయిపోయింది' అని చెప్పారు.

కంటి సంరక్షణకు జాతీయ హెల్ప్‌లైన్ 9990666872

న్యూఢిల్లీ : కంటి చూపు సమస్యలతో బాధపడేవారికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఓ హెల్ప్‌లైన్ నంబరు అందుబాటులోకి వచ్చింది. లాభాపేక్ష లేని సంస్థ 'సైట్ సార్తి ఇండియా ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఢిల్లీలోని ప్రముఖ నేత్ర వైద్యుల బృందం హెల్ప్‌లైన్ నంబరు 9990666872ను అందుబాటులోకి తెచ్చింది.

చట్ట విరుద్ధంగా ఉంటే బీహార్ ఎస్ఐఆర్ రద్దు చేస్తాం

ఈసీకి సుప్రీంకోర్టు హెచ్చరిక

న్యూఢిల్లీ : బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను గంపగుత్తగా రద్దు చేసేస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఎన్నికల కమిషన్ అమలు చేస్తున్న పద్ధతిలో ఏదైనా చట్ట విరుద్ధత కనిపిస్తే ఈ చర్య తప్పదని తెలిపింది. రాజ్యాంగ వ్యవస్థ అయిన ఈసీ ఎస్ఐఆర్ కోసం చట్టాన్ని, నిర్దేశిత నిబంధనలను పాటించినట్లు భావిస్తున్నామని పేర్కొంది. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరుపుతున్న ధర్మాసనం ఈ హెచ్చరిక చేసింది. తాము ఇచ్చే తుది తీర్పు యావత్తు దేశంలో నిర్వహించే ఎస్ఐఆర్‌పై ప్రభావం చూపేలా ఉంటుందని పేర్కొంది. బీహార్‌లో ఎస్ఐఆర్ చెల్లుబాటుపై తుది వాదనలను వచ్చే నెల 7న వినిపించాలని తెలిపింది.

1974 తర్వాతి నిరసనలపై అధ్యయనం

అధికారులకు అమిత్ షా ఆదేశం

న్యూఢిల్లీ: పొరుగు దేశాల్లో తలెత్తుతున్న ఆందోళనలు, నిరసనలు మన దేశంలోని పాలకులను ఆలోచనలో పడేస్తున్నాయి. మనదేశంలో.. ముఖ్యంగా 1974 తర్వాత తలెత్తిన నిరసనలన్నింటిపైనా అధ్యయనం చేయాలని కేంద్ర హోంశాఖ అధికారులను అమిత్ షా ఆదేశించారట. నిరసనల వెనుకున్న కారణాల్ని విశ్లేషించాలని, ముఖ్యంగా ఆర్థిక కోణాలు, తెరవెనుక వ్యక్తులు, తుది ఫలితాలు.. మొదలైనవి తెలుపుతూ 'బ్యూరో ఆఫ్ పోలీస్ రిసెర్చ్, డెవలప్‌మెంట్' అధికారుల నుంచి అమిత్ షా నివేదిక కోరారు. దేశవ్యాప్తంగా సామూహిక ప్రజా ఆందోళనలు, నిరసనలు తలెత్తితే.. వాటిని ఎలా ఎదుర్కోవాలి? అన్నదానిపై కసరత్తు చేయాలని వారికి తెలిపారట.

ఇదేనా బీజేపీ సంస్కారం?

- గుజరాత్ మాజీ సీఎం రూపానీ అంత్యక్రియల్లో దిగజారుడుతనం
- కుటుంబ సభ్యుల నెత్తిన పూలు, టెంట్ల ఖర్చు
- అధికార లాంఛనాల పేరిట కుటుంబంపైనే 25 లక్షల భారం
- చెల్లించేందుకు పార్టీ నిరాకరణ



రాజ్‌కోట్: అహ్మదాబాద్‌లో జూన్ 12న జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ సీఎం, బీజేపీ సీనియర్ నేత విజయ్ రూపానీ పట్ల ఆ పార్టీకి, ఆ పార్టీ నాయకులకు ఏమాత్రం గౌరవభావముందో బయటపెట్టే దారుణ ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాల సొంత రాష్ట్రం గుజరాత్‌కు బీజేపీ ముఖ్యమంత్రిగా పనిచేసిన విజయ్ రూపానీ మరణించిన మూడు నెలల తర్వాత ఆయన కుటుంబం పట్ల బీజేపీ, ఆ పార్టీ నాయకులు ఎంత లేకిగా వ్యవహరించారో ఈ సంఘటన నిరూపిస్తుంది. ప్రమాదవశాత్తు కూలిపోయి 141 మంది మరణించిన ఎయిరిండియా విమానంలో విజయ్ రూపానీ కూడా ఉన్నారు. ఆయన తన కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు లండన్ వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆయన భౌతికకాయాన్ని గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించిన తర్వాత జూన్ 16న రాజ్‌కోట్‌లో అంత్యక్రియలు జరిగాయి. ఆయన భౌతికకాయాన్ని తీసుకువెళుతున్న శకటాన్ని పూలతో అలంకరించారు. అంతకుముందు ఆయన భౌతికకాయానికి పలువురు బీజేపీ ప్రముఖులు పుష్ప నివాళులర్పించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, రాష్ట్రానికి చెందిన పలువురు ప్రముఖుల సమక్షంలో అధికారిక లాంఛనాలతో రూపానీ భౌతికకాయానికి అంత్యక్రియలు జరిగాయి. వేలాదిమంది ప్రజలు తమ అభిమాన నాయకునికి తుది వీడ్కోలు పలికారు. అయితే అంత్యక్రియల సందర్భంగా ఉపయోగించిన పూలు, షామియానాలు, ఇతర ఖర్చులను చెల్లించాలంటూ స్థానిక వ్యాపారులు రూపానీ కుటుంబ సభ్యుల చేతిలో రూ. 25 లక్షల బిల్లు పెట్టారు. ఈ బిల్లులు చెల్లించడానికి రాష్ట్ర బీజేపీ నిరాకరించినట్లు వ్యాపారులు చెప్పడంతో రూపానీ కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. తాము డబ్బు చెల్లించడం గురించి బాధపడడం లేదని, కాని బీజేపీ కోసం అహర్నిశలు పాటుపడిన ఓ సీనియర్ నాయకుడికి, మాజీ ముఖ్యమంత్రికి పార్టీ ఇచ్చే గౌరవం ఇదేనా? అని రూపానీ కుటుంబ సన్నిహితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని చక్కదిద్దేందుకు జోక్యం చేసుకున్న పార్టీకి చెందిన ఇద్దరు సౌరాష్ట్ర నాయకులు చివరకు చేతులెత్తేసినట్లు సమాచారం. సున్నిత మనస్కుడిగా పేరుపొందిన విజయ్ రూపానీ పట్ల బీజేపీ ఇంత కర్కశంగా వ్యవహరించడం పట్ల పార్టీ కార్యకర్తలే కాక సామాన్య ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండోసారి సీఎం అయ్యాక 2021లో హఠాత్తుగా ఆ పదవికి రాజీనామా చేసి రూపానీ అందరినీ విస్మయానికి గురిచేశారు. అప్పుడు రూపానీ, తాజాగా ధన్‌ఖడ్‌ల ఉదంతాలే తీసుకుంటే బీజేపీలో సీనియర్ నాయకుల ఆకస్మిక రాజీనామాల వెనుక ఏ అదృశ్య శక్తులున్నాయో ఎవరికైనా సులభంగా అర్థమవుతుంది.


ఏఐ కంటెంట్‌కు లైసెన్స్, లేబులింగ్

పార్లమెంటరీ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ : కృత్రిమ మేధ (ఏఐ) కంటెంట్ క్రియేటర్ల కోసం కొత్త నిబంధనలను పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనల ప్రకారం, ఏఐ జనరేటెడ్ వీడియోలు, ఆర్టికల్స్ కోసం లైసెన్స్ తీసుకోవలసి ఉంటుంది, తప్పనిసరిగా లేబులింగ్ చేయవలసి ఉంటుంది. దీనికి సంబంధించిన ముసాయిదా నివేదికను బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే నేతృత్వంలోని కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై స్థాయీ సంఘం రూపొందించింది. ఈ నివేదికను లోక్ సభ సభాపతి ఓం బిర్లాకు సమర్పించింది. సమాచార, ప్రసార; ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ వంటి వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించింది. ఫేక్ న్యూస్‌ను సృష్టించి, వ్యాపింపజేసే వారిని గుర్తించి, శిక్షించడానికి పటిష్టమైన న్యాయ, టెక్నలాజికల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడానికి ఇది దోహదపడుతుందని పేర్కొంది. ఏఐ టూల్స్‌ను ఉపయోగించి సులువుగా కంటెంట్‌ను క్రియేట్ చేయవచ్చు. దీనివల్ల ఏది వాస్తవం, ఏది నకిలీ అనేది తెలుసుకోవడం కష్టమవుతున్నది. ఏఐ జనరేటెడ్ ఫేక్ న్యూస్ ప్రజా శాంతికి విఘాతం కలిగిస్తుందని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఈ కమిటీ పేర్కొంది.

వక్ఫ్ చట్టానికి పాక్షికంగా బ్రేక్!

- వివాదాస్పద నిబంధనలపై స్టే విధించిన సుప్రీంకోర్టు
- ఐదేళ్ల పాటు ఇస్లాం పాటించాలన్న నిబంధన నిలిపివేత
- వక్ఫ్ ఆస్తిలో కలెక్టర్ల జోక్యం నిలుపుదల



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్(సవరణ) చట్టం, 2025 చట్టబద్ధతను సవాలు చేసిన పిటిషనర్లకు సుప్రీంకోర్టులో పాక్షిక ఉపశమనం లభించింది. వక్ఫ్ చట్టంలోని కొన్ని వివాదాస్పద నిబంధనలపై సుప్రీంకోర్టు సోమవారం స్టే ఇచ్చింది. వక్ఫ్ బోర్డులో ఎవరు సభ్యులుగా ఉండాలన్న అంశంపై సిఫార్సు చేయడంతోపాటు వక్ఫ్‌ను ఎవరు సృష్టించవచ్చు, ఆక్రమణలకు చెందిన వివాదాలను ఎవరు పరిష్కరించాలన్న అంశాలకు సంబంధించిన నిబంధనలను సుప్రీంకోర్టు నిలిపివేసింది. వక్ఫ్ చట్టంపై మొత్తంగా స్టే విధించాల్సిన అవసరం ప్రస్తుతం న్యాయస్థానానికి కనిపించడం లేదని, కొత్త చట్టంలో రాజ్యాంగపరమైన సవాళ్లకు సంబంధించి విస్తృత స్థాయిలో విచారణ జరుపుతామని సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది. మొత్తం చట్టాన్నే పిటిషనర్లు సవాలు చేశారని, అయితే మౌలికంగా చట్టంలోని 3(ఆర్), 3సీ, 14 సెక్షన్లను పిటిషనర్లు సవాలు చేశారని ధర్మాసనం తెలిపింది. సవాలు చేసిన సెక్షన్లపై తాము స్టే ఇస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. వక్ఫ్‌ను సృష్టించే వ్యక్తి ఐదేళ్ల పాటు ఇస్లాం మతాన్ని తప్పనిసరిగా పాటించాలన్న నిబంధనను(సెక్షన్ 3(ఆర్) నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఇస్లాంను ఆచరిస్తున్న వ్యక్తిని నిర్ధారించడానికి నిబంధనలు రూపొందించే వరకు ఈ సెక్షన్‌పై స్టే విధిస్తున్నట్లు కోర్టు పేర్కొంది. వక్ఫ్ ఆస్తిగా ప్రకటించిన ఆస్తి ప్రభుత్వ ఆస్తి అవునా కాదా అన్న విషయాన్ని నిర్ధారించి ఉత్తర్వులు జారీ చేసే అధికారాన్ని కలెక్టర్‌కు అప్పగిస్తూ చట్టంలో పొందుపరిచిన నిబంధనపై(సెక్షన్ 3సీ(4)) కూడా ధర్మాసనం స్టే విధించింది. వక్ఫ్ ఆస్తిగా ప్రకటించిన ఆస్తి ఆక్రమణ ద్వారా జరిగిందీ లేనిదీ నిర్ధారిస్తూ ప్రభుత్వం నియమించిన అధికారి నివేదికను సమర్పించే వరకు వక్ఫ్ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధనపై(సెక్షన్ 3సీ(2) కూడా కోర్టు స్టే ఇచ్చింది. వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతర సభ్యులను చేర్చాలన్న నిబంధనపై(సెక్షన్ 9,14) స్టే ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో ముగ్గురికి మించి ముస్లిమేతర సభ్యులను నియమించరాదని, వక్ఫ్ కౌన్సిళ్లలో నలుగురికి మించి ముస్లిమేతర సభ్యులను నియమించరాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

విద్యార్థులకు 75% హాజరు తప్పనిసరి

10, పన్నెండో తరగతులకు సీబీఎస్ఈ కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ : పదో తరగతి, పన్నెండో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అర్హత నిబంధనలను సీబీఎస్ఈ కఠినతరం చేసింది. పరీక్షలు రాయడానికి అర్హత పొందాలంటే విద్యార్థులు కనీసం 75 శాతం తరగతులకు హాజరై ఉండాలని తెలిపింది. విద్యాపరమైన, హాజరుకు సంబంధించిన నిబంధనలను నెరవేర్చని విద్యార్థులను పరీక్షలకు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. పదో తరగతి, పన్నెండో తరగతి రెండేళ్ల ప్రోగ్రామ్స్ అని పేర్కొంది. విద్యార్థి పాఠశాలకు హాజరుకాకపోతే, అతని ఇంటర్నల్ అసెస్‌మెంట్ జరగదని తెలిపింది. ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లో పనితీరు కనబరచకపోతే, ఆ విద్యార్థి పరీక్షల ఫలితాన్ని ప్రకటించేది లేదని పేర్కొంది. అలాంటి విద్యార్థులను ఎసెన్షియల్ రిపీట్ క్యాటగిరీలో పెట్టనున్నట్లు వివరించింది. అనుమతి లేకుండా సబ్జెక్టులను ఆఫర్ చేయవద్దని అనుబంధ పాఠశాలలను సీబీఎస్ఈ హెచ్చరించింది.

మావోయిస్టు నేత సహదేవ్ ఎన్‌కౌంటర్

- జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లాలో ఎదురుకాల్పులు
- ముగ్గురు నక్సల్స్ మృతి
- సహదేవ్‌పై కోటి రివార్డు



సహదేవ్ (ఫైల్)

కొత్తగూడెం ప్రగతి మైదాన్ : భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సహదేవ్ సొరేన్‌తోపాటు మరో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన జార్ఖండ్ రాష్ట్రం హజారీబాగ్ జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. పంతిత్రి అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు భద్రతా బలగాలు సెర్చింగ్ ఆపరేషన్ ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే జవాన్లు మూడు దిక్కుల నుంచి చుట్టుముట్టి ఎదురుకాల్పులకు దిగారు. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయారు. ఇరువర్గాల మధ్య సుమారు రెండు గంటలపాటు విడతల వారీగా ఎదురుకాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. అనంతరం ఘటనా స్థలం నుంచి ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు, వారి ఆయుధాలను జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో రూ. కోటి రివార్డు ఉన్న సహదేవ్ సొరేన్, రూ.25 లక్షల రివార్డు కలిగిన జార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు రఘునాథ్ హేమ్‌బ్రమ్ అలియాస్ చంచల్, రూ.10 లక్షల రివార్డు ఉన్న జోనల్ కమిటీ సభ్యుడు బైర్‌సెన్ ఘంజూ అలియాస్ రామ్‌ఖెలవన్ ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు.

మొదటి 15 నిమిషాలు ఆధార్ వెరిఫైడ్ యూజర్లకే అవకాశం!

- జనరల్ రిజర్వేషన్ టికెట్లకూ ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి
- రిజర్వేషన్ విధానంలో రైల్వే మార్పు
- వచ్చే నెల 1 నుంచి కొత్త నిబంధన

న్యూఢిల్లీ: రైల్వే బోర్డు వచ్చే నెల ఒకటి నుంచి కొత్త నిబంధనలను అమలు చేయబోతున్నది. ఏ రైలుకైనా బుకింగ్ విండో ఓపెన్ అయిన తర్వాత మొదటి 15 నిమిషాల్లో జనరల్ రిజర్వేషన్ టికెట్స్‌ను బుక్ చేయాలంటే ప్రయాణికులకు ఆధార్ వెరిఫైడ్ ఐఆర్‌సీటీసీ అకౌంట్స్ తప్పనిసరిగా ఉండాలి. దీనివల్ల మోసపూరిత బుకింగ్స్‌కు కళ్లెం వేయవచ్చునని, అసలైన ప్రయాణికులకు న్యాయంగా టికెట్ బుకింగ్ అవకాశాలు లభిస్తాయని బోర్డు భావిస్తున్నది.

ఈ విధానం ఎలా పని చేస్తుంది?

ఉదాహరణకు, ఓ ప్రయాణికుడు న్యూఢిల్లీ నుంచి వారణాసి వెళ్లే శివగంగ ఎక్స్‌ప్రెస్ రైలులో నవంబరు 15న ప్రయాణించడం కోసం టికెట్ బుక్ చేయాలి. దీనికి బుకింగ్ విండో సెప్టెంబరు 16 రాత్రి 12.20 గంటలకు ఓపెన్ అవుతుంది. కాబట్టి రాత్రి 12.20 గంటల నుంచి 12.35 గంటల మధ్యలో కేవలం ఆధార్ వెరిఫైడ్ ఐఆర్‌సీటీసీ అకౌంట్లు ఉన్న యూజర్లు మాత్రమే ఈ రైలు టికెట్లను బుక్ చేసుకోగలుగుతారు. ఆధార్ అథెంటికేషన్ లేనివారు ఈ 15 నిమిషాల సమయంలో టికెట్లను బుక్ చేసుకోలేరు. దీపావళి, ఛాత్ పూజ, హోలీ వంటి ప్రధాన పండుగల సమయాల్లో, పెళ్లిళ్ల సీజన్‌లో రైలు టికెట్లకు డిమాండ్ విపరీతంగా ఉంటుంది. ప్రయాణ తేదీకి 60 రోజుల ముందుగా బుకింగ్ విండో ఓపెన్ అయినపుడు ఈ డిమాండ్ అధికంగా ఉంటుంది. జనరల్ బుకింగ్ ద్వారా టికెట్లను బుక్ చేసుకోవడానికి ప్రయాణికుల మధ్య పోటీ తీవ్రంగా ఉంటుంది. ఆధార్ ఆధారిత నిబంధన వల్ల బుకింగ్ ప్రాసెస్ పారదర్శకంగా ఉంటుందని రైల్వే బోర్డు భావిస్తున్నది.

బైక్‌ను ఢీకొట్టిన బీఎండబ్ల్యూ కారు

- కేంద్ర ప్రభుత్వ అధికారి మృతి
- 19 కి.మీ దూరంలో ఉన్న చిన్న దవాఖానకు తరలింపు

న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖలో డిప్యూటీ సెక్రటరీ నవ్‌జోత్ సింగ్ (52), ఆయన భార్య సందీప్ ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై వెళ్తుండగా, వారిని బీఎండబ్ల్యూ కారు ఢీకొట్టింది. సింగ్ మరణించగా, సందీప్ తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతున్నారు. ఎయిమ్స్‌కు లేదా ఆర్మీ బేస్ హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని ఆమె గగన్‌ప్రీత్‌ను, ఆమె భర్తను పదే పదే కోరారు. కానీ వారు సింగ్, సందీప్‌లను 19 కి.మీ దూరంలోని చిన్న దవాఖానకు తీసుకెళ్లినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో బీఎండబ్ల్యూ కారు నడిపిన గగన్‌ప్రీత్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

చిరు-వెంకీ కలిసి స్టెప్పులేస్తే..



చిరంజీవి నటిస్తున్న ‘మన శంకరవరప్రసాద్ గారు’ శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్ని పంచడానికి ముస్తాబవుతున్నది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఆద్యంతం హాస్య ప్రధానంగా సాగుతుందని, చిరంజీవి తనదైన శైలి వింటేజ్ కామెడీతో ప్రేక్షకుల్ని అలరిస్తారని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నది. వచ్చే నెలలో 20 రోజుల పాటు నాన్‌స్టాప్ షెడ్యూల్‌కు ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. ఈ చిత్రంలో అగ్ర నటుడు వెంకటేష్ కీలకమైన అతిథి పాత్రలో కనిపించబోతున్న విషయం తెలిసిందే. చిరంజీవి, వెంకటేష్ ఇద్దరూ సమకాలీనులు కావడం..దాదాపు 40 ఏళ్లుగా సూపర్‌స్టార్‌డమ్‌తో కొనసాగుతుండటంతో వీరిద్దరి కాంబో సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ కాబోతున్నది. ఈ నేపథ్యంలో ఈ సూపర్‌స్టార్స్ ఇద్దరూ ఓ పాటలో కలిసి సందడి చేయబోతున్నారట. దీనిని అక్టోబర్ షెడ్యూల్‌లో తెరకెక్కిస్తారని తెలిసింది. ఈ పాట కోసం సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఇప్పటికే అద్భుతమైన ట్యూన్‌ను సిద్ధం చేశారని, చిరు-వెంకీల సిగ్నేచర్స్ డ్యాన్ మూమెంట్స్, ఎనర్జీతో ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని అంటున్నారు. ఈ చిత్రాన్ని షైన్‌స్క్రీన్స్ అండ్ గోల్డ్‌బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు.

వారణాసి సెట్‌లో కీలక ఘట్టాలు?




దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ‘SSMB29’ ప్రథమస్థానంలో ఉంటుంది. మహేశ్‌బాబు కథానాయకుడిగా దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై అంతులేని అంచనాలున్నాయి. దానికి తగ్గట్టే అత్యంత ప్రతిష్టాత్మకంగా రాజమౌళి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా కెన్యా షెడ్యూల్ పూర్తి చేసుకున్నది. ప్రస్తుతం కొత్త షెడ్యూల్ కోసం కసరత్తు మొదలైంది. ఈ షెడ్యూల్ కోసం వారణాసి క్షేత్రానికి సంబంధించిన భారీ సెట్‌ను వేస్తున్నట్టు సమాచారం. ఈ సెట్‌లో జరిగే షెడ్యూల్‌లో కీలక తారాగణమంతా పాల్గొంటారని తెలుస్తున్నది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగే అడ్వెంచర్ థ్రిల్లర్‌గా దర్శకుడు రాజమౌళి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్టు వినికిడి. దక్షిణాఫ్రికా నవలా రచయిత విల్బర్ స్మిత్ రాసిన ఓ నవలను ప్రేరణగా తీసుకొని రచయిత విజయేంద్రప్రసాద్ ఈ కథ తయారు చేసినట్టు సమాచారం. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ పాన్ వరల్డ్ సినిమాలో పలు భాషలకు చెందిన భారతీయ నటులతోపాటు హాలీవుడ్ నటులు కూడా భాగం కానున్నారు. ఈ చిత్రానికి మాటలు: దేవకట్టా, సంగీతం: ఎం.ఎం.కీరవాణి.



ఓజస్ గంభీర ప్రపంచంలోకి

అగ్ర హీరో పవన్‌కల్యాణ్ ‘ఓజీ’తో ఈ ఏడాది దసరా బరిలోకి దిగబోతున్నారు. ఈ నెల 25న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని రెట్టింపు చేశాయి. ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ ఓజస్ గంభీర అనే పాత్రలో కనిపించనున్నారు. కొద్దిరోజుల క్రితం విడుదల చేసిన ‘ట్రాన్స్ ఆఫ్ ఓమి’ పాటకు మంచి స్పందన లభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ‘గన్స్ అండ్ రోజెస్’ పేరుతో మరో పాటను రిలీజ్ చేశారు. తమన్ స్వరపరచిన ఈ పాట యాక్షన్ ప్యాక్డ్ ‘ఓజీ’ ప్రపంచంలోకి ప్రేక్షకుల్ని తీసుకెళ్లేలా ఉంది. కథానాయకుడు ఓజస్ గంభీర ఎదుర్కొనే భయంకరమైన అండర్‌వరల్డ్ ప్రపంచం, అతని చుట్టూ ఉన్న ప్రమాదకరమైన శక్తులను పరిచయం చేస్తూ సాగింది. ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. తమన్ సంగీతాన్నందించారు.

నా సంగీతానికి కథే ప్రేరణ



‘ఈ సినిమాకు నేనిచ్చిన సంగీతానికి ప్రేరణ కార్తీక్ ఘట్టమనేని చెప్పిన కథే. గొప్ప కథ రాసుకొని, దాన్ని ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో తీశారాయన. ఈ సినిమా ఫస్ట్ షో పడ్డ దగ్గర్నుంచీ నా ఫోన్ కంటిన్యూగా రింగ్ అవుతూనే ఉంది. నా మ్యూజిక్‌ని ఆడియన్స్ ఎక్స్‌పీరియన్స్ చేయడం చాలా ఆనందంగా ఉంది.’ అని సంగీత దర్శకుడు హరి గౌర అన్నారు. రీసెంట్ బ్లాక్‌బస్టర్ ‘మిరాయ్’కి ఈయన సంగీతం అందించారు. తేజ సజ్జా కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై విజయపథంలో దూసుకుపోతున్నది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు హరి గౌర సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ‘కథని దృష్టిలో పెట్టుకుని మ్యూజిక్ స్కోర్ రాశాను. రాములవారి పోర్షన్‌లో ఉండే ఎలిమెంట్స్‌ని పవర్‌ఫుల్‌గా ప్రజెంట్ చేయడానికి పదిరోజులు పట్టింది. ముఖ్యంగా ఇంటర్వెల్ బ్యాంగ్ బాగా రావడానికి విభిన్నంగా ప్రయత్నించాను. తెరపై అవుట్‌పుట్ చూస్తే చెప్పలేని ఆనందం అనిపించింది’. అని తెలిపారు హరిగౌర. ‘వైబ్’ సాంగ్ సినిమా నుంచి తీసేయడం అనేది టీమ్ డెసిషన్ అనీ, సినిమాకు ఆ పాట అవసరం లేదని, పీపుల్ మీడియా ఫ్యాక్టరీలోనే మరో నాలుగు సినిమాలు చేస్తున్నానని హరి గౌర తెలిపారు.



యక్షగాన విజయాన్ని చెప్పే కథ

కన్నడ అగ్ర హీరో శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషించిన చిత్రం ‘వీర చంద్రహాస’. ‘కేజీఎఫ్’ సంగీత దర్శకుడు రవి బస్రూర్ ఈ సినిమా ద్వారా దర్శకునిగా మారారు. ప్రతిష్టాత్మక హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో ఓంకార్ మూవీస్ పతాకంపై ఎస్.ఎస్.రాజ్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం కన్నడలో భారీ విజయాన్ని సాధించింది. కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ పతాకంపై ఎంవీ రాధాకృష్ణ ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. దర్శకుడు రవి బస్రూర్ మాట్లాడుతూ ‘ఇదొక రూటెడ్ స్టోరీ. యక్షగానం కల్చర్‌ని రిప్రజెంట్ చేసేలా ఉంటుంది. ఇది నా పన్నెండేండ్ల కల. విజయం సాధించిన ప్రతి ఒక్కరి కథ ఇది. ఓ వ్యక్తి జీరో నుంచి హీరోగా ఎలా ఎదుగుతాడు అనే పాయింట్ ఈ కథలో ఉంటుంది. ఓ కొత్త ప్రపంచం ఈ సినిమాలో కనిపిస్తుంది.’ అని పేర్కొన్నారు. ఇటీవలే కన్నడంలో ఈ సినిమా వందరోజులు పూర్తి చేసుకున్నదని, తెలుగులో కూడా కచ్చితంగా ఈ సినిమా విజయం సాధిస్తుందని నిర్మాత ఎం.వీ.రాధాకృష్ణ నమ్మకం వెలిబుచ్చారు. మరో నిర్మాత జేమ్స్ డబ్ల్యూ కొమ్ము కూడా మాట్లాడారు.

ఆ కష్టం ఎవరికీ రావొద్దని..




బాలీవుడ్ నుంచి గ్లోబల్ స్టార్‌గా ఎదిగింది ప్రియాంక చోప్రా. గత కొన్నేళ్లుగా హాలీవుడ్ చిత్రాలకు ప్రాధాన్యతనిస్తున్న ఈ సొగసరి మహేష్‌బాబు-రాజమౌళి కాంబోలో రూపొందుతున్న సినిమాలో నాయికగా ఇండియన్ ఫిల్మ్స్‌లోకి కమ్‌బ్యాక్ ఇచ్చింది. ఈ సినిమాతోపాటు ‘క్రిష్-4’లో కూడా ప్రియాంకచోప్రా కథానాయికగా నటిస్తున్నది. ఇదిలావుండగా పర్పుల్ పెబెల్ పిక్చర్స్ పేరుతో భర్త నిక్‌జోనస్‌తో కలిసి నిర్మాణ సంస్థను కొనసాగిస్తున్నది ప్రియాంక చోప్రా. ఇప్పటికే ఈ బ్యానర్‌పై పలు చిత్రాలను తెరకెక్కించింది. తాజా ఇంటర్వ్యూలో తాను నిర్మాతగా ఎందుకు మారాల్సి వచ్చిందో వివరించింది ప్రియాంక చోప్రా. బాలీవుడ్‌లో అడుగుపెట్టిన రెండేళ్లలోనే అక్కడి పరిస్థితులు మొత్తం తనకు అర్థమయ్యాయని, సినీ నేపథ్యం లేకుంటే ఎంత చులకనగా చూస్తారో తెలిసిందని చెప్పింది. ‘బాలీవుడ్‌లో వారసులదే హవా. బయటి వారు సక్సెస్ కావడం అంత సులభం కాదు. నేను ఎన్నో కష్టాలకోర్చుకొని అవకాశాలు సంపాదించా. నా ప్రయత్నాలతో పాటు అదృష్టం కూడా కలిసొచ్చింది. నాలా కొత్తవారెవరూ కష్టపడొద్దనే ఉద్దేశ్యంతో నిర్మాణ సంస్థను స్థాపించాను. అందులో న్యూటాలెంట్‌ను ప్రోత్సహిస్తున్నా’ అని ప్రియాంకచోప్రా పేర్కొంది.

పీపుల్ పాలిటిక్స్‌తో ‘భద్రకాళి’



‘దర్శకుడు అరుణ్ ప్రభు అద్భుతమైన కథ రాసుకున్నారు. దాన్ని అంతే అద్భుతంగా తెరకెక్కించారు. ఆయనతో వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. నా అభిప్రాయం ప్రకారం ఇండియాలో టాప్ టెన్ డైరెక్టర్స్‌లో తను ఒకరు. చాలా టాలెంటెడ్ పర్సన్. ఆ ప్రతిభను మీరు తెరపై చూస్తారు.’ అని విజయ్ ఆంటోని అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన పొలిటికల్ థ్రిల్లర్ ‘భద్రకాళి’. ఇది ఆయన 25వ చిత్రం కావడం విశేషం. అరుణ్‌ప్రభు దర్శకుడు. రామాంజనేయులు జవ్వాజి నిర్మాత. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్మెంట్, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా కలిసి ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోని మాట్లాడారు. ‘ఇది మంచి పొలిటిక్ థ్రిల్లర్. ఏ రాష్ట్రానికో దేశానికో సంబంధించిన పాలిటిక్స్ ఇందులో ఉండవ్. ఇది పీపుల్ పాలిటిక్స్. అందరికీ రిలేట్ అయ్యేలా ఉంటుంది. మీ అందరి అంచనాలనూ ‘భద్రకాళి’ అందుకుంటుంది.’ అని దర్శకుడు నమ్మకం వెలిబుచ్చారు. దర్శకుడు అరుణ్ సమాజంలోని కీలకమైన అంశాలను సందేశాత్మకంగా ఈ కథలో డీల్ చేశారని నిర్మాత రామాంజనేయులు అన్నారు. ఇంకా అగ్ర నిర్మాత డి.సురేశ్‌బాబు, కథానాయిక తృప్తి రవీంద్ర, రైటర్ భాష్యశ్రీ కూడా మాట్లాడారు.

జానపదాల స్ఫూర్తితో ‘జటాధర’



సుధీర్‌బాబు, సోనాక్షిసిన్హా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మైథలాజికల్ సూపర్‌నేచురల్ థ్రిల్లర్ ‘జటాధర’. వెంకట కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని నవంబర్ 7న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో హీరో సుధీర్ బాబు డివైన్ ఫీల్ ఉన్న లుక్‌తో కనిపిస్తున్నారు. భారతీయ పురాణాలు, జానపద కథల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, గ్రాఫిక్స్ అబ్బురపరుస్తాయని మేకర్స్ తెలిపారు. మానవాళికి, దైవానికి మధ్య జరిగే సంఘర్షణ ప్రధానాంశంగా ఈ చిత్రాన్ని రూపొందించామని , విజువల్స్ పరంగా ప్రేక్షకుల్ని కొత్త లోకంలోకి తీసుకెళ్తుందని చిత్రబృందం తెలిపింది. జీ స్టూడియోస్, ఎస్‌కే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఉమేష్‌కుమార్ బన్స్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేర్నా అరోరా, శిల్పా సింగాల్, నిఖిల్ నందా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ బయోపిక్



వేలమందికి అన్నదానం చేసిన అపర అన్నపూర్ణగా ప్రసిద్ధికెక్కిన డొక్క సీతమ్మ జీవితకథ వెండితెర దృశ్యమానం కానుంది. ‘అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ’ పేరుతో రూపొందించనున్న ఈ చిత్రానికి అచ్చర్ల రాజబాబు దర్శకత్వం వహిస్తున్నారు. ఎ.ఆర్.బి. నిర్మాత. ఈ సినిమా టైటిల్ హక్కులు తమకే సొంతమని, దీనిని ఫిల్మ్ ఛాంబర్‌లో రిజిస్టర్ చేయించామని వీఎన్‌ఆర్ ఫిల్మ్స్ సంస్థ వెల్లడించింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ ‘ఈ టైటిల్ ఇవ్వమని కొందరు దర్శకనిర్మాతలు అడిగారు. మేమే సినిమా చేస్తున్నాం కాబట్టి టైటిల్ ఇవ్వడం కుదరదని చెప్పాం. ఈ టైటిల్‌తో మరే దర్శకనిర్మాత సినిమా తీసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. త్వరలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం’ అన్నారు.



మాస్ ‘మారెమ్మ’

అగ్రహీరో రవితేజ తమ్ముడు కుమారుడైన మాధవ్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న రూరల్ రస్టిక్ మూవీ ‘మారెమ్మ’. మంచాల నాగరాజ్ దర్శకుడు. మయూర్ రెడ్డి బంగారు నిర్మాత. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఇప్పుడు హీరో మాధవ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం స్పెషల్ పోస్టర్‌ని, గ్లింప్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇంటెన్స్, రగ్గడ్ లుక్‌లో ఉన్న మాధవ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. కబడ్డీ కోర్ట్‌లోకి మాధవ్ అడుగు పెడుతున్నట్టుగా ప్రజెంట్ చేసిన గ్లింప్స్ మాస్‌ని ఆకట్టుకునేలా ఉంది. దీపా బాలు కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో వినోద్‌కుమార్, వికాస్ వశిష్ట, దయానంద్‌రెడ్డి, వి.ఎస్.రూపలక్ష్మి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ప్రశాంత్ అంకిరెడ్డి, సంగీతం: ప్రశాంత్ ఆర్.విహారి, నిర్మాణం: మోక్ష ఆర్ట్స్.

సరైన దర్శకుడి చేతిలో సాయిపల్లవి



పాత్రల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తారు నటి సాయిపల్లవి. ప్రాధాన్యత లేని పాత్రల్లో ఆమె నటించిన దాఖలాలు అస్సలు లేవు. గత ఏడాది ‘అమరన్’తో, ఈ ఏడాది ‘తండేల్’తో పలకరించిన ఈ తమిళ సోయగం.. ప్రస్తుతం బాలీవుడ్ ‘రామాయణ’లో నటిస్తున్నారు. అందులో ఆమె సీతగా కనిపించనున్న విషయం తెలిసిందే. సాయిపల్లవి నటించిన తొలి బాలీవుడ్ సినిమా ‘మేరే రహో’ త్వరలో విడుదల కానుంది. ఇదిలావుంటే.. ప్రస్తుతం సాయిపల్లవి గురించి ఆసక్తికరమైన వార్త కోలీవుడ్ మీడియాలో బలంగా వినిపిస్తున్నది. కోలీవుడ్ మోస్ట్ టాలెంటెడ్ డైరెక్టర్ వెట్రిమారన్ దర్శకత్వంలో ఆమె నటించనున్నారనేది ఆ వార్త సారాంశం. శింబు ఇందులో కథానాయకుడు. వెట్రిమారన్ ‘వడా చెన్నై’ తరహాలోనే ఈ సినిమా కూడా ఉంటుందని తెలుస్తున్నది. నిజానికి వెట్రిమారన్ దర్శకత్వంలో సాయిపల్లవి ఇంతకు ముందే నటించారు. నెట్‌ఫ్లిక్స్ కోసం ఆయన చేసిన ‘పావ కథైంగల్’లో ఒక ఎపిసోడ్‌లో సాయిపల్లవి లీడ్‌రోల్ చేశారు. పూర్తిస్థాయి సినిమా చేయడం మాత్రం ఇదే ప్రథమం.

ఇన్నర్ బ్యూటీ విలువ చెప్పే కథ

‘సుబ్రహ్మణ్యం అనే జర్నలిస్ట్ రాసిన కథ ఇది. ఈ కథలో హీరోహీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ హైలైట్. అద్భుతమైన డ్రామా. ఎక్కడా బోర్ కొట్టదు. హీరో అంకిత్ సహజమైన నటన కనబరిచాడు. ఎంతో కష్టపడి అంకితభావంతో నటించాడు. హీరోయిన్ అయితే.. పక్కింటి అమ్మాయిలా అనిపిస్తుంది. ఇది సందేశం, వినోదంతో కూడిన కుటుంబ కథ. అందుకని క్లాసులు పీకడాలు ఏవీ ఉండవ్. ఒక జీవితం చూపిస్తాం.. అంతే...’ అన్నారు డైరెక్టర్ జె.ఎస్.ఎస్.వర్ధన్. ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘బ్యూటీ’. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటించారు. విజయ్‌పాల్‌రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ కలిసి నిర్మించారు. మారుతీ టీమ్ ప్రొడక్ట్స్, వానర సెల్యూలాయిడ్ సమర్పణలో ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో దర్శకుడు వర్ధన్ విలేకరులతో ముచ్చటించారు. ‘నా తొలి అవకాశం ‘భలే వున్నాడే’ మారుతీగారి వల్లే వచ్చింది. ఇప్పుడు ‘బ్యూటీ’ కూడా ఆయనే పిలిచి అవకాశం ఇచ్చారు. సినిమా చూసి ఆయనెంతో మెచ్చుకున్నారు. కేవలం 5 నిమిషాలు కట్ చేయమని సూచించారు. ఆయన చెప్పాక నేను చూసి ఏడు నిమిషాలు కట్ చేశాను. ఇన్నర్ బ్యూటీ ఇంపార్టెంట్ చెప్పే సినిమా ఇది’ అని తెలిపారు వర్ధన్.



‘కాక్‌టెయిల్-2’లో రష్మిక మందన్న

అగ్ర కథానాయిక రష్మిక మందన్న దక్షిణాదితో పాటు హిందీలో సైతం తిరుగులేని స్టార్‌డమ్‌తో దూసుకుపోతున్నది. గత ఏడాది ‘ఛావా’ చిత్రంతో బాలీవుడ్‌లో బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను అందుకుంది. ప్రస్తుతం ఆమె హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘తమా’ చిత్రంలో నటిస్తున్నది. తాజాగా ఈ భామ ‘కాక్‌టెయిల్-2’ చిత్రంలో భాగమైనట్లు అధికారికంగా ప్రకటించింది. వివరాల్లోకి వెళితే.. 2012లో వచ్చిన ‘కాక్‌టెయిల్’ చిత్రం భారీ విజయాన్ని సాధించింది. సైఫ్‌అలీఖాన్, దీపికా పడుకోన్, డయానా పెంటీ ప్రధాన పాత్రధారులు. ప్రేమ, స్నేహం, అనుబంధాల తాలూకు సంక్లిష్టతల నేపథ్యంలో చక్కటి వినోదంతో ఈ సినిమా యువతను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడీ చిత్రానికి సీక్వెల్ సిద్ధమవుతున్నది. ఇందులో షాహిద్‌కపూర్, రష్మిక మందన్న, కృతి సనన్ ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. ఈ సినిమాలో రష్మిక మందన్న నటిస్తున్నట్లు గతంలోనే వార్తలొచ్చాయి. అయితే వాటిని అధికారికంగా ఎవరూ ధృవీకరించలేదు. తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా రష్మిక మందన్న ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ సందర్భంగా ఆన్‌లొకేషన్ ఫొటోలను అభిమానులతో పంచుకుంది. అపరిమితమైన వినోదానికి సిద్ధం అంటూ ఆ ఫొటోలకు క్యాప్షన్‌ను జోడించింది. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

